SAPTHAGIRI
(TELUGU)
SPIRITUAL ILLUSTRATED
MONTHLY
Volume: 54, Issue: 3
AUGUST - 2023
Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఆగష్టు 2023
వెల రూ. 20/-
పుటలు-56



## తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు

27-08-2023 నుండి 29-08-2023 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు

# విజ్ఞప్తి

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.

తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న 'సప్తవర్ణ' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

## 'సప్తగిరి' పత్రిక వెలలో మార్పు

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన అనుభూతిని పొందండి.

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రికకు చందా కట్టండి.



శ్రీవారి అక్షర ప్రసాదాన్ని నెలనెలా అందుకోండి.



# సప్తగిరి



ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషలు)

..... చందా వివరాలు ......

విడిప్రతి: రూ.20/-

సంవత్సరచందా: రూ.240/-

జీవితచందా (12 సం॥లకు మాత్రమే): రూ.2400/-

విదేశాలకు సంవత్సరచందా: రూ. 1030/-

వెలలో మార్పు సెప్టెంబరు, 2022 నుండి అమలులోకి వచ్చింది.

నూతన చందాదారులకు మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.

వివరాలకు:

ప్రధాన సంపాదకుడు, తి.తి.దే. ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి - 517 507.

ఫోన్: 0877-2264363, 2264543.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః।
యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-07వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కార్పణ్యదోషోపహతస్వభావః= కృపణత్వమను దోషముచే కొట్టబడిన స్వభావము గల (నేను); ధర్మసమ్మూఢచేతాః= ధర్మవిషయమున సందేహముగల మనస్సు గలవాడనై; త్వామ్= నిన్ను; పృచ్ఛామి= అడుగుచున్నాను, యత్= ఏది; నిశ్చితమ్= నిశ్చయింపబడిన; శ్రేయః= శ్రేయము; స్యాత్= అగునో; తత్= దానిని; మే= నాకు; బ్రూహి= చెప్పుము; అహమ్= నేను; తే= నీకు; శిష్యః=శిష్యుడను; త్వామ్=నిన్ను; ప్రపన్నమ్= శరణు బొందిన; మామ్= నన్ను; శాధి= శాసింపుము.

**భావం:** (ఓకృష్ణా!) కృపణత్వము (ఆత్మజ్ఞానశూన్యత) అను దోషముచే కొట్టబడిన వాడనగుటచే ధర్మవిషయమున సందేహముగలిగి నిన్నడుగుచున్నాను. ఏది నిశ్చయముగ శ్రేయస్కరమో దానిని చెప్పుము. నేను నీకు శిష్యుడను. శరణు బొందిన నన్ను ('ఈ ప్రకారముగ నడుపుము'- అని) శాసింపుము.

---

## ఎన్నగల తిరువేంకటేశు మాయల తగిలి..!!

ఎవ్వరెవ్వరివాఁడో యీ జీవుడు చూడ
నెవ్వరికి నేమౌనో - యీ జీవుఁడు?

ఎందరికిఁ గొడుకు గాఁ- డీ జీవుడు- వెనక
కెందరికిఁ దోఁబుట్టఁ- డీజీవుడు ?
ఎందరిని భ్రమయించఁ- డీజీవుఁడు- దుఃఖ
మెందరికిఁ గావింపఁ - డీజీవుడు ?

ఎక్కడెక్కడఁ దిరుగ- డీజీవుఁడు - వెనక
కెక్కడో తనజన్మ- మీజీవుఁడు ?
ఎక్కడి చుట్టము తనకు- నీజీవుఁడు- ఎప్పు
డెక్కడికి నేగునో- యీ జీవుఁడు?

ఎన్నఁడును జేటులే నీజీవుఁడు వెనక
కెన్ని తనువులు మోవఁ- డీజీవుడు?
ఎన్నఁగల తిరువేంక- టేశు మాయలఁ దగిలి
యెన్ని పదవులఁ బొందఁ- డీజీవుఁడు?

(సంపుటం- 01, సంకీర్తన-97)



*ఈ జీవుడు ఎన్నో జన్మములలో ఎందరికో జన్మించుచున్నాడు. జనన మరణాత్మకమైన సంసారచక్రంలో పరిభ్రమించుచున్నాడు. ఇట్టి జీవుడు ఏ యే జన్మలలో ఎవ్వరెవ్వరికి ఏయే వావివరుసలలో సంబంధపడి ఉన్నాడో నిర్ణయించుట కెవరితరము? విచారించగా జీవులలో ఒకరితోనొకరికెట్టి సంబంధమును లేదు.*

*ఈ జీవుడెన్నో జన్మములలో ఎందరికో కొడుకై జన్మించాడు. పూర్వము తానెందరికో తోబుట్టువుగా పుట్టినాడు. ఎందరినో ఎన్నోవిధాల పుత్రమిత్రకళత్రాది సంబంధాలతో భ్రమింపజేసినాడు. ఎందరినో ఎన్నోరీతుల దుఃఖాలపాలు చేసినాడు.*



*ఈ జీవుడు తిరుగనిచోటే లేదు. ముందటిజన్మలలో ఎన్నోచోట్ల పలురూపులతో జన్మించి తిరిగి ఉన్నాడు. తానున్న జన్మంలో ఇతడెక్కడ పుట్టనున్నాడో? ఈ జన్మంలో మాత్రం తనకీజీవుడేవిధంగా అనుగుచుట్టము కాగలడు? ఇతడెప్పుడెక్కడికిపోవునో తెలియదుగదా!*

*ఎన్నిజన్మలు దాలుస్తున్నాన్నిసార్లు మరణిస్తున్నా నిజంగా ఈ జీవునకు మాత్రం ఎట్టి చేటును లేదు. పూర్వమితడెన్నో తనువులు దాల్చినాడు. తాను దాల్చిన శరీరములే చేటొందుతున్నాయి. గాని సనాతనుడైన జీవాత్మునకే మాత్రము చేటు లేదు. శ్రీవేంకటేశ్వరుని మహామాయా ప్రభావానికి లోబడి ఈ జీవుడెన్నో పదవులు పొందుతున్నాడు అని అన్నమయ్య జీవుల జన్మల గురించి వేదాంతపరంగా పై కీర్తనలో వర్ణించాడు. -కీ.శే. డా॥ సముద్రాల లక్ష్మణయ్య*

# గరుడపురాణప్రబోధం

- శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర, 63005 46700

భగవంతుని సృష్టి అపురూపం, ఒక అద్భుతం. దానిలో చిత్రవిచిత్రమైనది మానవదేహం. మానవునిలో వాయువు ఉంటే శివం అంటాం. ఆ వాయువు ఆయువు తీరిపోతే గాలిలో కలిసిపోతుంది. దీనిని శవం అంటాం. పుణ్యం చేసినవారు స్వర్గం వెళతారు. పాపం చేసినవారు నరకానికి వెళతారు. ఈ జనన, మరణసిద్ధాంతంలో ఒక పరిపూర్ణమైన సందేశముంది. గరుడపురాణపఠనం ఎంతో ప్రయోజనకరమైనది. విష్ణుపురాణంలో సైతం ఈ గరుడపురాణంగురించి వివరించడం విశేషం. వ్యాసమహర్షి రచించిన అష్టాదశపురాణాల్లో వైష్ణవసంప్రదాయంప్రకారం, ఈ గరుడపురాణం శ్రీమహావిష్ణువు గరుడకు ఉద్దేశించింది ఇది అని తెలుస్తోంది.

**2023, ఆగష్టు, 21న గరుడపంచమి సందర్భంగా..**



హిందూసనాతనధర్మం హైందవసంస్కృతికి దర్పణంలాంటిది. చనిపోయినవారి ఆత్మశాంతికోసం 13రోజులపాటు గరుడపురాణం చదువుతారు. ఆలా చదివితే ఆత్మలకు శాంతితోబాటు ఇహలోకప్రాప్తి లభిస్తుందంటారు. మానవుడు తన విధులను ధర్మబద్ధంగా నిర్వహించాలని పరులకు పరోపకారం తప్ప కీడు తలపెట్టరాదని, అలాంటివారిపట్ల మనం కృతజ్ఞతాభావంతో మసలుకోవాలని ఈ పురాణం మనకు ప్రబోధిస్తుంది. ఇతరులకు అన్నదానం, భూదానం, చేతనైన సాయంచేయడం, పెద్దలను గౌరవించడం, పండితులను ఆదరించడం, అసూయ, అహంకారం వీడి నిస్వార్థంతో సత్యధర్మాలు పాటించినవారికి ఉత్తమసుగుణాలు అలవడతాయని గరుడపురాణం చెప్తోంది. ప్రతిమనిషి తన జీవితకర్తవ్యం తెలుసుకుని సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో మసలుకుని మానవత్వం విలువలు కాపాడాలని ఈ గరుడపురాణం వివరిస్తుంది. మోసాలకు పాల్పడకుండా ధర్మమార్గం అనుసరించి జీవించేవారు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. సనాతనధర్మంతో జీవించాలి. కానీ వీటికి విరుద్ధంగా ఉండేవారు నరకం అనుభవిస్తారు అని మనకు గరుడపురాణం వివరిస్తోంది. అది తప్పు అని తెలిసికూడా అలాగే ప్రవర్తిస్తే శిక్ష తప్పదు అని గ్రహించాలి.

హిందూమతంలో 18 పురాణాలున్నాయి. వాటిలో గరుడపురాణం ఒకటి. ఈ పురాణంలో 18వేలనుండి 19వేలవరకూ శ్లోకాలు ఉన్నాయి. కానీ, మనకు ప్రస్తుతం కేవలం ఆరువేలుమాత్రమే అందుబాటులో ఉన్నాయి. మానవుడు మరణాంతరం ఎక్కడికి వెళతాడు అన్న విషయం ఈ గరుడపురాణం వివరిస్తుంది.

ఒకసారి గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుని జీవులు చనిపోయాక ఏమి అవుతారు అని అడిగాడు. అందుకు సమాధానం ఈ గరుడపురాణమే చెప్పాడు. ఈ గరుడపురాణంలో యుగధర్మాలు, నీతినియమాలు, ఆధ్యాత్మికవిషయాలగురించి అనేకం ఉన్నాయి. విష్ణుమాహాత్మ్యం తెలిపే విష్ణుపురాణం, నారదపురాణాల్లో ఈ గరుడపురాణం విశిష్టతగురించి వివరించారు. దీనిని ఎప్పుడైనా చదవవచ్చు. మానవజీవితం పరిపూర్ణమయం చేసే అంశాలు ఈ పురాణంలో ఉన్నాయి. యుగశాస్త్రధర్మాలు వివరించే గరుడపురాణంలో శివారాధన ప్రాముఖ్యతకూడా ఉంది. అంటే శివకేశవులు ఒకటేనని దీనినిబట్టి మనకు తెలుస్తోంది. ఏది ఏమైనా యుగధర్మం అనుసరించి మానవుడు ఈ కలియుగంలో పాపకర్మములు చేయక పరులమేలు తలపెట్టాలి. ఉన్నంతలో దానధర్మాలు చేయాలి. దానాల్లో అన్నదానం గొప్పది. కనుక ఆకలి అన్న పేదలకు ఆకలితీర్చేలా అన్నదానం చేయాలి. తల్లితండ్రులను, గోమాతను, పెద్దలను, గురువులను గౌరవించాలి. పూజించాలి. సనాతనధర్మాలు పాటిస్తే స్వర్గలోకప్రాప్తి పొందుతారు. ఈ విషయంకూడా మనకు గరుడపురాణం ప్రబోధిస్తోంది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 ఆగష్టు, 2023 సంచిక : 03




**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **అందరికోసం** | | |
| గరుడపురాణప్రబోధం | శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర | 04 |
| నాగపరమార్థం | శ్రీ చాకిచెర్ల నాగసుదర్శనరావు | 07 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 08 |
| జనమేజయ-సర్పయాగ పరిణామశీలత | శ్రీ యం.వి.యస్.రామశేషు | 10 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 12 |
| న గాయత్ర్యాః పరోమంత్రః | శ్రీ మల్లాది నరసింహమూర్తి | 20 |
| నైమిశారణ్యంలో చక్రతీర్థం | శ్రీ శ్రీరాముల హేమంత్‌కుమార్ | 22 |
| విశ్వచైతన్యం పెరగాలంటే... | డా॥ ముంజులూరి నరసింహారావు | 37 |
| సకలజీవకోటిబ్రహ్మ, కశ్యపమహర్షి | డా॥ పి.లలితవాణి | 41 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |
| **మహిళలకోసం** | | |
| శ్రావణపౌర్ణమి విశిష్టత | డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి | 09 |
| వరాలనిచ్చే వరలక్ష్మీపూజ | డా॥ కడప లలిత | 31 |
| నాగలక్ష్మి ఉలూచి | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 33 |
| **శ్రీవేంకటేశ్వరలీలలు** | | |
| స్వామిదయ!! | శ్రీమతి మంచుకొండ జయప్రద | 40 |
| **యువతకోసం** | | |
| నీ విధికి నీవే శిల్పివి!! | ఆచార్య ఆంధ్రరత్న జి.వి.శేషారెడ్డి | 21 |
| త్రికరణశుద్ధితో సాధించలేనిది లేదు!! | శ్రీ యం.రవితేజ | 24 |
| రక్షాబంధన్-యువతకు స్ఫూర్తి | డా॥ మైలవరపు లలితకుమారి | 25 |
| భారతీయగణితం | ఆచార్య వి. రమేష్‌బాబు | 35 |
| **దేవాలయాలు** | | |
| పళనిస్వామి క్షేత్రం | శ్రీమతి వావిలాల నాగవల్లి | 15 |
| తిరుక్కణ్ణప్పరం | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 39 |
| ఇండోనేషియాలో భారతీయసంస్కృతి | శ్రీ కె.సి.నాయుడు | 42 |
| **ధారావాహికలు** | | |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| **ఆయుర్వేదం** | | |
| బీట్రూట్ | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| **బాలబాలికలకోసం** | | |
| తప్పు లెన్నరాదు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| కార్యదక్షుడైనవాడు.. (భాస్కరశతకం) | శ్రీ మారవి వెంకయ్య | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- కీ.శే.మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| బకాసురవధ (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| ఆ దేవుడే నాకన్నీ ఇస్తున్నాడు!! (బాలనీతి) | శ్రీ బలిజేపల్లి సుబ్బారావు | 52 |
| ప్రశ్నావళి | | 53 |


ముఖచిత్రం : తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు
వెనుకచిత్రం : తిరుచానూరు శ్రీ పద్మావతిదేవి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# సనాతనధర్మమార్గంలో పయనిద్దాం!!

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, మంత్రశాస్త్రాలు, స్తోత్రాదివాఙ్మయసర్వస్వం, సనాతనధర్మానికి ఆలంబనలు. వాటిలోని శాశ్వతవిలువలను ఎప్పటికప్పుడు స్మరించుకుంటూ సాగిపోవడమే జీవితసాఫల్యం. ఇవేవో జీవితాలకు అతీతమైనవి అని తోసిపుచ్చక, ఇవి జీవితాన్ని సరిగ్గా నిర్వచింపచేసే అక్షరసత్యాలని ఆదరిస్తే జీవితం సుగమంగా సాగిపోతుంది.

అన్ని కాలాల్లోనూ అనాదికాలంనుండీ ఆదరింపబడుతూన్న ధర్మం సనాతనధర్మం మాత్రమే. 'ఏకం సత్ విప్రా బహుధావసంతి' అని ఋగ్వేదంలో చెప్పబడినట్లు వేరువేరు మానసభూమికల్లో ఉన్న సనాతన ధర్మంలోని అనేక ప్రక్రియలు, సాధనలు, సాధకుల సౌకర్యంకోసం చూపబడి ఉన్నాయి. వివిధశక్తులకు ప్రతీకలైన ఎందరో దేవతలు, వారి పూజావిధానాలు, వివిధవ్రతాలు, వాటిని ఆచరించాల్సిన పద్ధతులన్నీకూడా సనాతనధర్మాలుగా చెప్పబడుతున్న వివిధమార్గాలు.

నిత్యజీవితంలో నిరంతర ధర్మాచరణవల్ల నిశ్చలమైన, నిర్మలమైన సుఖజీవనం సిద్ధించడమే కాక, ఆ ధర్మమే రక్షాకవచమై కాపాడుతుంది. పురాణేతిహాసాల్లోనూ, శాస్త్రవాఙ్మయంలోనూ ఉన్న అనేక అపురూప విషయాలు ఆర్షధర్మాలు మన నిత్యజీవితంలో ఆచరణకు నిర్దేశించబడ్డాయి. పరమేశ్వరుడు తాను సృష్టించిన చరాచరాలన్నీ ఒక నియమితమైన, నియమబద్ధమైనపరిధిలో ప్రవర్తించేటట్లు శాసించాడు. ఈ విధంగా జగత్ వ్యవహారాలను ఒకరీతిలో నడిచేటట్లు చేసిన పరబ్రహ్మ, మానవబుద్ధికి మాత్రం పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాడు. మానవుడిమేథతో సన్మార్గాన్ని అనుసరిస్తూ భగవంతుడిచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవడానికై ధర్మాధర్మాలను బోధించే వేదరూపమైన శాస్త్రంకూడా భగవంతుడు ప్రసాదించాడు.

మనం సనాతనమైన ధర్మానికి చెందినవారం. ధర్మమన్నది గడచిన, గడుస్తున్న, గడవబోయే మూడు కాలాలకు, అన్నిదేశాలకు, అన్నిప్రాంతాలకు వర్తిస్తుంది. ఐతే ఆచారాలుమాత్రం దేశ, కాల, ప్రాంతాలకు వర్తించేవి. అధర్మాన్ని ఆచరించకపోవడమే ధర్మమౌతుంది. వేదాలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో దేశకాలాదులకు అనుగుణంగా వేదవిరుద్ధాలుకాని ఆచారాలను మహర్షులు తమ స్మృతులలో పొందుపరిచారు. ఈ కోవలో తిరుమలస్వామికి సంబంధించిన అనేక ఆచారాలు, సంప్రదాయాలు, మతవిశిష్టత మొదలైన వాటి వ్యాప్తిలో విశేషంగా కృషి చేసినవారిలో శ్రీమద్ శ్రీరామానుజాచార్యులు, శ్రీమద్ శ్రీశంకరాచార్యులు అగ్రగణ్యులుగా కీర్తించబడ్డారు.

కాగా ప్రస్తుతం మారుతున్నకాలంలో ఉమ్మడికుటుంబవ్యవస్థ విచ్ఛిన్నమైపోవడం, ఉద్యోగాలకై పిల్లలు విదేశాలకు, ఇతరరాష్ట్రాలకు వెళ్లిపోవడం, పాశ్చాత్యనాగరికత, పెద్దవాళ్లు చేసేవి, చెప్పేవి అర్థంలేని చాదస్తాలనే భావం ఈ తరంవారిలో పెరిగిపోయి సదాచారాలన్నీ కనుమరుగైపోతున్నాయి. అందువల్ల మనం ఏం చేస్తున్నామో, ఏం చెయ్యాలో అని తెలియజేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

ఈ కోవలో సనాతనధర్మవ్యాప్తిలో భాగంగా తి.తి.దే. వారి హిందూధర్మప్రచారపరిషత్తువారిచే సదా చారాలపేరిట అనేక కార్యక్రమాలు చేబడుతోంది. అందుకు తార్కాణంగా దేశవ్యాప్తంగా అనేక పెద్ద, చిన్న దేవాలయాలు, భజనమందిరాలను నిర్మించడమే గొప్ప విషయంగా చెప్పుకోవచ్చు. ఇవన్నీకూడా హిందువులు ప్రత్యేకించి యువత సంప్రదాయవిలువలసార్థకృతను గ్రహిస్తారని, వీలయినంతవరకు దేశకాలపరిస్థితులను బట్టి వాటిని ఆచరించడమేకాకుండా ముందుతరాలకు మార్గనిర్దేశకంగా ఉంటారనే గొప్ప ఆశయంతో, లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తద్వారా మనమందరం సనాతనధర్మాన్ని ఆచరిస్తూ నైతికధర్మానికి కట్టుబడి సనాతనధర్మంలోనే పయనించి మన జీవితాలను సుస్థిరం చేసుకుందాం.

**ధర్మోరక్షతి రక్షితః**

# నాగపరమార్థం

- శ్రీ చాకిచెర్ల నాగసుదర్శనరావు,
97013 85006

కలియుగ వైకుంఠమైన తిరుమలలో ఆ శ్రీమన్నారాయణుడే శ్రీవేంకటేశ్వరస్వామిగా అవతరించి భక్తులచే పూజ లందుకుంటూ వారి కోర్కెలను నెఱవేర్చుతున్నాడు. ఆ కలియుగ దైవానికి ఎన్ని పేర్లున్నా ఏడుకొండలవాడుగా భక్తులమదిలో నిలిచాడు. ఏడుకొండలలో వెలసిన శ్రీవేంకటేశుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల అత్యున్నతమైన ఆరాధ్యదైవం.

ఏడుశిఖరాలను కలిగి ఉన్న ఈ కొండల్లో మొదటిది అయిన శేషాద్రే ఆదిశేషావతారం. తరువాతవి గరుడాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి, అంజనాద్రి. సాక్షాత్ శ్రీమహావిష్ణువుయొక్క పానుపు అయిన ఆదిశేషుడి విశిష్టతగురించి తెలుసుకుందాం.

పాలసముద్రంలో శ్రీమహావిష్ణువు శయనించే శేష తల్పమే ఆదిశేషుడు. సర్పాలకు ఆద్యుడు, రారాజు. ఈతని అంశలోనే రామాయణంలో లక్ష్మణుడు జన్మించాడు. పురాణాల ప్రకారం సమస్తభూమండలాన్నీ ఆదిశేషుడు తన పడగపై మోస్తు న్నాడు. వేయిపడగలనుంచీ నిత్యం విష్ణుకీర్తి వినిపిస్తూ ఉంటుంది. ఈ సర్పానికే అనంతశేషుడనే పేరుకూడా ఉంది. అంతేకాదు ఉషఃకాలాన తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని కీర్తించే సుప్రభాతంలోకూడా ఓ శేషశైలవాసా! అని ఇలా శ్రీ అనంతాచార్యులవారు వర్ణించారు!

అత్ర్యాది సప్త ఋషయస్సముపాస్య సంధ్యాం
ఆకాశ సింధు కమలాని మనోహరాణి ।
ఆదాయ పాదయుగ మర్చయితుం ప్రపన్నాః
శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్ ॥ 5 ॥

శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యాం ।
ఆఖ్యాం త్వదీయ వసతే రనిశం వదంతి
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతం ॥ 15 ॥

శ్రీపద్మావతి శ్రీశ్రీనివాసులకల్యాణం తర్వాత మామ గారైన ఆకాశరాజు శ్రీనివాసునికి రెండుచేతులకు నాగాభరణాల తోబాటు రెండుబంగారుకంకణాలనుకూడా బహూకరిం చాడు. అటుతర్వాత శ్రీవేంకటేశ్వరస్వామికి మహాభక్తుడైన వీర నరసింహదేవ గజపతిరాజస్వామి కుడిచేతికి నాగాభరణాన్ని చేయించాడు.

అయితే పరమపూజ్యుడైన భగవాన్ శ్రీరామానుజులవారి సౌజన్యంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఎడమచేతికికూడా నాగాభరణం అమరింది. అందువల్ల ఇప్పటికీ స్వామికి సర్వాభరణ అలం కారం చేసినప్పుడు రెండుచేతులకు రెండు నాగాభరణాలు ధరించి భక్తులకు దర్శనమిస్తారు స్వామి. రెండుకళ్ళు చాలవు!! ఈ అలంకారంలో స్వామిని దర్శిస్తున్నప్పుడు. అందుకే అంటారు అలంకారప్రియః విష్ణువు అని!

ఒకసారి వేయిపడగల ఆదిశేషువు మరియు వాయు దేవునికి మధ్య ఎవరు గొప్ప అంటే ఎవరు గొప్ప అని వాగ్వి వాదం జరిగింది. అప్పుడు ఆదిశేషువు నిరంతరం శ్రీమన్నారా యణునికి శయ్యగా మరియు గొడుగుగా ఉండి సేవచేస్తున్నాను, నీలాగాకాదు అని గర్వంతో వాయుదేవుణ్ణి చిన్నబుచ్చుతూ మాట్లాడాడు. అప్పుడు వాయువు వేయినాలుకలు ఉన్నంత మాత్రాన నువ్వు అలా నన్ను కించపరుస్తూ మాట్లాడ్డం తప్పు. అంతేగాక ఈ సమస్తలోకాల్లోని జీవరాశులు నావల్లనే మనుగడ సాగిస్తున్నాయి అన్నాడు. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది.

అప్పుడు ఆదిశేషువు వైకుంఠంలోని క్రీడాద్రిని గట్టిగా చుట్టుకొని నన్ను కదల్చు చూద్దాం అని అన్నాడు. అప్పుడు వాయుదేవుడు తన వాయుబలంతో ఆదిశేషుణ్ణి భూలోకంలోకి క్రీడాద్రితోసహా వచ్చిపడేట్లు చేశాడు. అప్పుడు ఆదిశేషుడు అవమానంతో ఆ శ్రీహరిని ప్రార్థించాడు. అంతట శ్రీహరి తన భక్తుడైన ఆదిశేషునికి గర్వమణిగిందని తెలుసుకుని ఓదారుస్తూ నువ్వు ఎంతమాత్రమూ చింతించవద్దు, నిన్ను నా బాహువులకు నాగాభరణంగా ధరించి, భక్తులకు నాగాభరణుడిగా దర్శన మిస్తాను. ఈ క్రీడాద్రి శేషాద్రిగా ప్రసిద్ధి చెందుతుంది అని చెప్పాడు. అప్పుడు ఆదిశేషువు ఎంతో ఆనందభరితుడయ్యాడు.

*20-08-2023 న నాగచతుర్థి సందర్భంగా..*

## నాగపూజ

శ్రావణమాసంలో నాగపంచమి వస్తుంది, ఈ పర్వ దినాల్లో నాగారాధన చేయటం చాలా విశేషం, ఈ రోజుల్లో భూమిని దున్నటం, తవ్వడం, చెట్టు. పుట్టలను కొట్టడం నిషేధం అని పురాణాల్లో వివరించబడింది.

నాగులచవితి, నాగపంచమిరోజుల్లో పుట్టవద్దకెళ్లి దీపం వెలిగించి, పూజ చేయాలి. పూజ అయినతర్వాత ఆవుపాలు పుట్టలో పోసి నాగపూజచేసి, చలిమిడి, చిమ్మిలి అరటిపళ్ళు మున్నగునవి నివేదన చేయాలి.

పూజకు ముందు నాగేంద్రఅష్టోత్తరం, నాగేంద్రస్తోత్రం, నాగస్తుతి, నాగేంద్రసహస్రనామాలు పఠిస్తే సకలదోషాలు పోతాయని విశ్వాసం. అలా వీలుకానిపక్షంలో "ఓం నాగేంద్ర స్వామినే నమః" అనే మంత్రాన్ని 108సార్లు జపించాలి.

'ప్రకృతి' మానవమనుగడకు జీవనాధారమైనది కనుక దానిని దైవస్వరూపంగా భావించి ఆనాటినుండి నేటివరకూ చెట్టును, పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని- ఇలా సమస్తప్రాణికోటిని దైవస్వరూపంగా చూచు కుంటూ పూజిస్తూ వస్తున్నారు. అదే మనభారతీయసంస్కృతిలోని విశిష్టత. నిశితంగా మనం పరిశీలిస్తే... అందులో భాగంగానే 'పాము'ను కూడా నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తూ వస్తు న్నారు. పాముల్ని భూమి అంతర్భాగంలో నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్తజీవకోటికి "నీటిని" ప్రసాదించే దేవతలుగా భావిస్తారు. ఇవి పంటలను నాశనం చేసే క్రిమి కీటకాలను తింటూ, పరోక్షంగా రైతుకు పంటనష్టం కలుగ కుండా చేస్తాయి. అలా ప్రకృతిపరంగా అవి మనకు ఎంతో సహాయపడుతూ ఉంటాయి.



## శ్రీకృష్ణామృతం...

చిన్మయరూప యదునందనా
చిరుచిరునగవుల మముబ్రోవుమా
చిత్తమునందే కొలువుండుమా
చింతలుబాపి మముకావుమా

చిందముదాల్చి రణమందునా
చందమునిల్పిన పురుషోత్తమా
చింత్యము నామము క్షణక్షణమునా
చింతామణివై వెతతీర్చుమా

చిక్కములో వెన్న కడునేర్పుగా
చిక్కించుకొన్న చినిబాలుడా
చికమక తీర్చి మా జన్మకు
చిన్మయముక్తిని నీవొసగవా

చినిచినిపూజలు నేసేతురా
చిల్కలపల్కుల నినుకొలతురా
చిహ్నము భక్తియే మధుసూదనా
చివ్వున కృపచూడు నిరంజనా

*–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,*
*99103 45794*

## అంతరార్థం ఏమిటంటే...

మానవశరీరమనే పుట్టలో నిదురిస్తున్న నాగుపాము మరింత ప్రమాదకరమని చెప్తారు. ఈ మానవశరీరమనే పుట్టకు తొమ్మిదిరంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటాం. మానవశరీరంలో నాడులతో నిండిఉన్న వెన్నెముకను "వెన్నుబాము" అంటారు. అందులోని కుండలినీశక్తి మూలాధార చక్రంలో 'పాము' ఆకారంవలె చుట్టలు చుట్టుకుని ఉంటుందని "యోగశాస్త్రం' చెబుతోంది. ఇది మానవశరీరంలో నిదురిస్తు న్నట్లు నటిస్తూ! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యా లనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో 'సత్త్వగుణ' సంపత్తిని హరించివేస్తూ ఉంటుంది. అలా నాగులచవితిరోజున ప్రత్యక్షంగా విషసర్పపుట్టను ఆరాధించి పుట్టలో పాలుపోస్తే మానవునిలో ఉన్న విషసర్పంకూడా సత్త్వగుణం పొంది, మన హృదయాల్లో నివశించే 'శ్రీమహావిష్ణువు'నకు పాన్పుగా ఉండే ఆదిశేషువుగా మారి 'కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యా లను దరిచేరనీయదు. ఇదే నాగులచవితి పండుగ ఆంతర్యమని చెప్తారు.

పాహి పాహి సర్పరూప నాగదేవ దయామయ
సత్సంతాన సంపత్తిం దేహిమే శంకరప్రియ!
అనంతాది మహానాగ రూపాయ వరదాయచ
తుభ్యం నమామి భుజగేంద్ర సౌభాగ్యం దేహిమే సదా!

నాగాభరణసహిత అలంకారంలో ఉన్న ఆ శ్రీవేంకటే శ్వరస్వామికి నిత్యం శరణాగతి చేస్తూ సకలసంతోషాలతో, ఆరోగ్యాలతో మన జీవితాలను గడుపుదాం.

# శ్రావణపౌర్ణమి విశిష్టత

- డా॥ నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి,
82475 78748

**30-08-2023న శ్రావణపూర్ణిమ,
31-08-2023న శ్రీహయగ్రీయ జయంతి సందర్భంగా..**

పౌర్ణమినాడు శ్రవణానక్షత్రంలో చంద్రుడు ఉన్నప్పుడు శ్రావణ మాసం అని అంటారు. ఈరోజు యజుర్వేదీయులు ఉపాకర్మ జరుపుతారు. కొత్తగా ఉపనయనం చేసుకున్నవారు ఈనాడు మౌంజీవిమోచనం అనగా ఉపనయనంనాడు ముంజగడ్డితో నడుముకు కట్టిన తాడును విప్పి కొత్త యజ్ఞోపవీతం ధరిస్తారు. మరునాడు పాడ్యమినాడు బ్రహ్మచారులు, గృహస్థులుకూడా గాయత్రిజపం చేస్తారు.

భారతీయసంప్రదాయంలో తరతరాలుగా శ్రావణ పూర్ణిమకు ఓ ప్రత్యేకస్థానం ఉంది. శ్రీమహావిష్ణువును స్మరిస్తూ ఆయనశక్తి అందరినీ రక్షిస్తోందని భావించుకుంటూ ఈ పండుగను జరుపుకోవడం కనిపిస్తుంది.

ఇక శ్రీమహావిష్ణువు విజయగాథాపరంపరలలో హయ గ్రీవావతారంలో జరిగిన విజయంకూడా విశేషంగా చెబుతారు. పూర్వం ఓసారి హయగ్రీవుడు అనే ఓ రాక్షసుడు దేవినిగురించి తీవ్రంగా తపస్సుచేశాడు. ఆ తపస్సుకు మెచ్చిన దేవి వరం కోరు కొమ్మన్నప్పుడు తనకు మరణం లేకుండా చూడమన్నాడు. అయితే అది ఆమె సాధ్యపడదని చెప్పి నప్పుడు హయగ్రీవం (గుర్రపు తల) ఉన్నవాడిచేతిలో మాత్రమే తనకు మరణం వచ్చేలా అను గ్రహించుమన్నాడు. ఆమె ఆ రాక్ష సుణ్ణి అనుగ్రహించి అంతర్థానమైంది. ఆ వరంతో ఆ రాక్షసుడు దేవతలను ముప్పుతిప్పలు పెడుతుండేవాడు. విష్ణు మూర్తి ఆ రాక్షసుణ్ణి యుద్ధంలో నిరంతరం ఎదిరిస్తున్నా ఫలితం లేకపోయింది.



చివరకు శివుడు ఓ ఉపాయాన్ని పన్నాడు. శ్రీమహా విష్ణువు ధనుస్సుకు బాణాన్ని సంధించి ఉంచి విపరీతమైన అలసటతో దాని అగ్రభాగాన వాలి నిద్రపోయాడు. ఆయనను నిద్రలేపటానికి దేవతలెవరికీ ధైర్యం చాలలేదు. అయితే ఆ దేవతలంతా ఓ ఆలోచనకు వచ్చి వమ్రి అనే ఓ కీటకాన్ని పంపి ధనుస్సుకున్న అల్లెత్రాడును కొరకమని చెప్పారు. అలా చేస్తే తాడు వదులై విల్లు కదలి విష్ణువుకు మెలకువ వస్తుందన్నది వారి ఆలోచన. అయితే ఆ పురుగు తాడును కొరకగానే దేవతలు ఊహించనివిధంగా వింటికిఉన్న బాణం విష్ణువుమెడకు తగిలి ఆ దెబ్బకు విష్ణువుతల ఎగిరి ఎటో పడిపోయింది. దేవతలు అంతటా వెదికారు కానీ ఆ తల కనిపించలేదు. బ్రహ్మ దేవుడు వెంటనే దేవినిగురించి తపస్సు చేశాడు. అప్పుడామె ప్రత్యక్షమై ఒక గుర్రపుతలను తెచ్చి విష్ణుమూర్తిశరీరానికి అతికించుమని చెప్పింది. దేవతలు అలాగే చేశారు. ఆ హయగ్రీవం అతికిన విష్ణు మూర్తిలో మళ్ళీ జీవం వచ్చి లేచాడు. ఆ లేచినరోజే శ్రావణపూర్ణిమ. ఆ తర్వాత హయగ్రీవుడుగా మారిన విష్ణుమూర్తి రాక్షసుణ్ణి సులభంగా జయించాడు. దేవీ శక్తిమహిమను, శ్రీమహావిష్ణు తత్త్వాన్ని ఈ కథ తెలియ చెప్తుంది. అందుకే శ్రావణ పూర్ణిమనాడు హయగ్రీవ జయంతికూడా జరపడం కని పిస్తుంది.

యజ్ఞోపవీతం పరమపవిత్రం
ప్రజాపతే ర్యత్స హజం పురస్తాదా
యుష్యమగ్ర్యం ప్రతిముంచ శుభ్రం
యజ్ఞోపవీతం బలమస్తు తేజః ॥

బ్రాహ్మణులు యజ్ఞోపవీతంకు పూజచేసి నూతన యజ్ఞోపవీతం ధరిస్తారు. ఇలా శ్రావణపూర్ణిమను ఎన్నెన్నో రకాలుగా పండుగగా, ఉత్సవంగా జరుపుకోవడం తరతరాలుగా వస్తోంది.

# జనమేజయ– సర్పయాగ పరిణామశీలత

– శ్రీ యం.వి.యస్.రామశేషు,
99089 92602

"పాములు విషజంతువులయినా
పాలుపోసి పూజలుచేసి
మనసులోని కోర్కెలను తీర్చుకొనే
సంస్కృతే మన భారతీయసంస్కృతి"

నాగులగురించి మహాభారతం ఆదిపర్వంలో చెప్పబడింది. జనమేజయుడు తనతండ్రి పరీక్షిత్తు మరణానికి తక్షకుడను నాగరాజు కారణమని తెలుసుకొని సర్పయాగం చేసి నాగజాతిని సమూలంగా నాశనం చేయాలని యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఇక నాగజాతి పుట్టుక, తరువాత జరిగిన పరిణామాలే సర్పయాగఫలితం.

సత్యయుగంలో దక్షప్రజాపతి తన కుమార్తెలైన కద్రువ, వినతలను కశ్యపప్రజాపతికిచ్చి వివాహం చేశాడు. వారితో సుఖాలననుభవించిన కశ్యపుడు సంతానంకోసం పుత్రకామేష్టి చేశాడు. అప్పుడు కద్రువ అత్యంత వేగం, బలం కలిగిన వేయిమందినాగులు తనకు పుత్రులుగా కావాలని కోరింది. వినత వారికంటే అధికబలవంతులైన ఇరువురు కుమారులను కోరుకున్నది. వేయిమందినాగులు కద్రువకు పుత్రులుగా జన్మించారు.

కద్రువ ఒకానొకసందర్భంలో నా మాటను మీరు ఒప్పుకోనికారణంగా మీరందరూ "జనమేజయుడు చేసే సర్పయాగంలో అగ్నిలో పడి భస్మమవుతారు" అని శపించింది. కద్రువశాపానికి కారణం దైవసంకల్పమే. విషసర్పాలు అధికమైతే ప్రాణహాని అధికంగా ఉంటుంది. ఎవరివలన ఇతరులకు కీడు జరుగుతుందో వారికెప్పుడూ విధివల్ల ప్రాణాంతకమైన శిక్ష పడుతుంది. విషపూరితమైన నాగులు ఎక్కువైతే జరిగేది అదేకదా. అందుకే దైవం కద్రువనోటివెంట అలా పలికించింది.



దాని ఫలితమే ఈ సంఘటనం. అర్జునుని మనుమడైన పరీక్షిత్తు చచ్చిపడి ఉన్న ఒక పామును తీసి ముని మెడలో వేసిపోయాడు.

తర్వాత శమీకుడి కుమారుడైన శృంగి తన తండ్రిమెడలో సర్పాన్ని వేసినవాడు ఏడురోజుల్లో తక్షకునికాటుకు గురై మరణిస్తాడని శపించాడు. శృంగిశాపప్రభావం కారణంగా ఏడవరోజు బ్రాహ్మణవేషం ధరించిన సర్పాలు రాజుకు నిమ్మపండ్లను కానుకగా ఇచ్చాయి. తక్షకుడు సూక్ష్మరూపంలో ఆ నిమ్మపండులో చేరి పరీక్షిత్తును కాటువేయగా శృంగిశాపం సత్యమయ్యింది.

తరువాత జనమేజయుడు తండ్రిమరణానికి తక్షకుడు కారణమని తెలుసుకొని సర్పజాతిపై ఆగ్రహించాడు. నాగజాతిని సమూలంగా నాశనంచేయదలచి "సర్పయాగం" చేయ సంకల్పించాడు.

జనమేజయుడు ఋత్విక్కులను పిలిపించగా, వారు వారివారికార్యాలలో నిమగ్నులయ్యారు. నల్లనివస్త్రాలు ధరించి మంత్రోచ్చారణపూర్వకంగా హోమాన్ని ప్రారంభించారు. ఋత్విక్కులమంత్రాలకు ఎక్కడెక్కడో ఉన్న నాగులన్నీ ఆ బాల వృద్ధాదిగా హోమాగ్నిలో పడి భస్మం కాసాగాయి. యజ్ఞం నిరాఘాటంగా జరిగిపోతోంది. నాగులన్నీ భస్మీభూతమవుతున్నాయి. తక్షకుడు భయంతో ఇంద్రుణ్ణి శరణుకోరాడు. తక్షకుణ్ణి తన భవనంలోనే ఉండుమన్నాడు ఇంద్రుడు. సర్పాలన్నీ నశించిపోతున్నాయి. వాసుకి బాధతో, భయంతో తల్లడిల్లుతూ చెల్లెలైన జరత్కారువుతో సర్పయాగంగురించి చెప్పాడు. నీ కుమారుడైన ఆస్తీకుడు మాత్రమే యజ్ఞాన్ని ఆపగలడు అన్నాడు. బాలుడైన

ఆస్తీకుడు వేదవేత్త. పెద్దలకు సైతం పూజనీయుడు. ఆతణ్ణి జనమేజయునివద్దకు పంపి యజ్ఞాన్ని ఆపించుమని చెప్పాడు. తన పుట్టినింటివారిని రక్షించటానికి జరత్కారువు ఆస్తీకుణ్ణి యజ్ఞశాలకు పంపింది. యజ్ఞంవద్దకు వచ్చిన అతణ్ణి రాజాజ్ఞ మేరకు యజ్ఞశాలలోనికి పోనివ్వలేదు. కాని ఆతడు యజ్ఞస్తుతి చేశాడు. ఆ స్తుతిని విన్న జనమేజయుడు ఈ బాలకుడు అనుభవజ్ఞుడైన జ్ఞానిలా మాట్లాడుతున్నాడు. ఆ బాలకునికోరిక తీర్చటానికి, అతనికి నేనొకవరం ఇద్దామనుకొంటున్నానన్నాడు జనమేజయుడు. బ్రాహ్మణుడు బాలకుడే అయినా రాజుకు పూజనీయుడే కనుక మాకేమీ అభ్యంతరం లేదన్నారు ఋత్విక్కులు.

జనమేజయుని మాటలను విన్న ఆస్తీకుడు సమయాన్ని సద్వినియోగం చేసుకొని రాజా! ఈ యజ్ఞగుండంలోపడే పాములు రక్షింపబడాలి కనుక నీవు ఈ యజ్ఞాన్ని ముగించు, అదే నా కోరిక అన్నాడు. అప్పుడు జనమేజయుడు నా ప్రధాన శత్రువు నా తండ్రి మరణానికి కారకుడైన తక్షకుడు యజ్ఞగుండంలో భస్మంకావలసిందే అన్నాడు. కానీ అప్పటికే తక్షకుడు



ఇంద్రుని శరణు వేడి ఆతని సింహాసనాన్ని చుట్టుకుని ఉన్నాడు. ఋత్విక్కుల మంత్రోచ్చారణములతో తక్షకునితోపాటు ఇంద్ర సింహాసనం కదులుతోంది. ఆతని మరణం నాకు తప్పనిసరి. నీవేదైనా మరొకవరం కోరుకోమన్నాడు. ఆస్తీకుడపుడు నా మాతృ వంశరక్షణమే నా కర్తవ్యం. యజ్ఞం పరిసమాప్తి మాత్రమే నా కోరికగాని వేరుకాదన్నాడు. వెంటనే వేదవేత్తలందరూ అతడేది కోరాడో అది ఇవ్వటమే శ్రేష్ఠం అన్నారు. వారి మాటలతో, రాజు ఇచ్చినవరంతో యజ్ఞం ఆగిపోయింది. తక్షకుడు సంరక్షింపబడ్డాడు.

ఆస్తీకునికారణంగా నాగజాతి సమస్తమూ సంరక్షింపబడింది. అప్పుడు వాసుకి నీవు మృత్యుముఖంనుండి మా జాతినంతటిని రక్షించావు కనుక నీకు మేము ఏ ఉపకారాన్ని చేయగలము అని కోరాడు. అయితే ఆస్తీకుడు వాసుకితో ఎవరైతే సాయంప్రాతఃకాలాల్లో ఈ ఉపాఖ్యానాన్ని చదువుతారో వారికి సర్పాలవల్ల ఎటువంటి భయం కలుగకుండా ఉండేట్లు నాకు వరాన్ని ఇమ్మన్నాడు. తద్వారా లోకక్షేమాన్ని కాంక్షించాడు ఆస్తీకుడు. నీవు కోరివరాన్నిస్తున్నామని చెప్పాడు వాసుకి.

**యోజరత్కారుణా జాతో జరత్కారే మహాయశాః**
**ఆస్తిక సర్పసత్రేవః పన్నగాన్ చ్ఛ రక్షత ॥**
**తంస్మరంతం మహాభాగా నమాం హింసితుమర్హథ**

జరత్కారుడు మరియు అదే పేరున్న నాగకన్య అయిన జరత్కారువుకు జన్మించిన ఆస్తీకుడు సర్పయాగంనుండి మిమ్మల్ని రక్షించాడు. మేము అతణ్ణి స్మరిస్తున్నాం. మమ్ము కాటువేయకండి.

**సర్పాపసర్ప భద్రం తేగచ్ఛ సర్ప మహావిష**
**జనమేజయస్య యజ్ఞాంతే ఆస్తీకవచనం స్మర ॥**

ఓ విషసర్పమా! నీవు తొలగిపో! నీకు శుభమగుగాక! నీవు వెళ్ళిపో! జనమేజయుని యజ్ఞపరిసమాప్తిసమయంలో ఆస్తీకుని మాటలను స్మరించండి.

ఈ మాటలవల్ల, ఆస్తీకమహర్షి నామోచ్చారణవల్ల భూలోకంలో మానవులు సర్పభయాన్నుంచి రక్షణ పొందారు.

అంతేకాక మానవులకు నాగులను పూజించటంకూడా ఒక ఆచారమైంది. శ్రావణమాసంలో వచ్చే నాగపంచమి, కార్తిక మాసంలో వచ్చే నాగులచవితిరోజున పుట్టలోని పాములకు పూజలుచేసి పాలుపోసి ఒక పండుగలాగా జరుపుకుంటారు.

# సందేహాలు సమాధానాలు



- శ్రీమతి యం. గీతాకుమారి

**ప్ర) ద్వాపరయుగంలోని యశోదాదేవియే కలియుగాన వకుళమాతగా శ్రీవేంకటేశ్వరునికల్యాణం చేయటానికిగల కారణం ఏమిటి?**

**జ)** "దేవకివసుదేవుల పుత్రుడైన శ్రీకృష్ణుడు యశోదానందుల ఇంట పెరిగాడు. కాని 12సంవత్సరాలవయస్సులో కంససంహారానికై మధురానగరానికి వెళ్లిన కృష్ణుడు విద్యాభ్యాసం, వివాహాలు అయిన తర్వాత భార్యలతో కలిసి తిరిగి వ్రేపల్లెకు వచ్చాడు. అలా అష్టభార్యలతో కలిసి వచ్చినకృష్ణుణ్ణి చూసిన యశోద నేను పాలిచ్చి పెంచిన తల్లినే! ముద్దుముచ్చటలన్నీ చూశానే! కానీ ఒక్కవివాహం చూడటానికైనా నన్ను పిలవలేదే! ఏమయ్యా? కృష్ణయ్యా! అని అడిగింది. అప్పుడు పరమాత్మ తల్లీ! నీవు నా వివాహం చూడటం కాదు. సంధానకర్తగా మారి దగ్గరుండి జరిపించే భాగ్యం నీకు కలుగుతుంది. కలియుగంలో నేను శ్రీనివాసుడిగా భూలోకాన అవతరించినప్పుడు, నీవు వకుళమాతగా నాతల్లివై దగ్గరుండి నా వివాహాన్ని జరిపించగలవు అన్న వరాన్ని ప్రసాదించాడు. అందువల్ల ద్వాపర యుగంనాటి యశోదాదేవియే కలియుగాన శ్రీనివాసునికి తల్లి వకుళమాతగా దగ్గరుండి పద్మావతిశ్రీనివాసులకల్యాణం జరిపించిన భాగ్యశాలిని.

**ప్ర) శ్రీవేంకటేశ్వరునికి ప్రతినిత్యం క్రొత్త మూకుడులో ఎందుకు నైవేద్యం పెడతారు?**

**జ)** ఒకప్పుడు భీముడు అనే కుమ్మరివాడు మట్టితోచేసిన తులసీదళాలతో ప్రతినిత్యం స్వామిని అర్చించేవాడు. తొండమానుడనే రాజు స్వామిని బంగారుతులసీదళాలతో పూజించేవాడు. ఒకసారి బంగారుదళాల క్రిందఉన్న మట్టిదళాలను చూసిన రాజు స్వామితో నేను బంగారుదళాలతో పూజ చేస్తుంటే ఈ మట్టిదళాలతో పూజచేస్తున్న వారెవరు అని అడిగాడు. అందుకు స్వామి తనకు పరమభక్తుడైన భీముడు అనే కుమ్మరి అర్పించే ఈ మట్టితులసీదళాలు నాకు అత్యంత ప్రీతిపాత్రము, పవిత్రమైనవి అన్నాడు. భీమునిభక్తిని పరీక్షింపగోరిన రాజు అతనినివాసానికి వెళ్లాడు. అక్కడ భీముడు వేరేధ్యాసలేక స్వామిపైనే మనసు నిలిపి గోవిందా! అని నామస్మరణ చేస్తూ కుండలు చేయటానికి ముందుగా స్వామిపాదాలచెంత మట్టితోచేసిన తులసీ దళాలనుంచాడు. తనశక్తికి, భుక్తికి స్వామే కారణమని నమస్కరించి పనిని ప్రారంభించాడు. అంతేకాక ప్రతిరోజు తాను అన్నం తినబోయేముందు ఒక క్రొత్త మూకుడులో స్వామికి ఆహారాన్ని నివేదన చేసి ఆ తర్వాత తాను భుజించేవాడు. భీమునిభక్తికి మెచ్చిన స్వామి ప్రత్యక్షమై సశరీరంగా అతనికి మోక్షాన్ని ప్రసాదించాడు. అందువలన నేటికీ ఆనంద నిలయంలో స్వామికిపెట్టే మొట్టమొదటి నైవేద్యం క్రొత్తమూకుడులో పెట్టటం సంప్రదాయమైంది. దానినే స్వామి ప్రధానంగా ప్రీతితో స్వీకరిస్తాడని భక్తులు నమ్ముతారు.

**ప్ర) 'వాతాపి జీర్ణం! వాతాపి జీర్ణం!!' అని ఎందుకంటారో తెల్పండి?**

**జ)** పూర్వం వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులుండేవారు. వారు అరణ్యాల్లో నివసించేవాళ్ళు. ప్రతిరోజూ నరమాంసం తినాలనేది వాళ్ళకోరిక. ఐతే వాతాపికి కామరూపవిద్య, ఇల్వలుడికి మృతసంజీవని విద్య తెలుసు. దాంతో వారు ఒక ఉపాయాన్ని ఆలోచించారు. ఇల్వలుడు ప్రతినిత్యం ఆ అడవిమార్గానవెళ్ళే వారివద్ద కెళ్ళి తమతండ్రి ఆబ్దికమని భోక్తగా రావాలంటూ వారిని కోరేవాడు. ఈలోపల వాతాపి కామరూపవిద్యద్వారా ఒకమేకగా మారేవాడు. ఇల్వలుడు తనతో వచ్చిన వారికి భోజనంతోపాటుగా మేకను కూడా వండిపెట్టేవాడు. వారు భుజించిన తర్వాత మృతసంజీవనివిద్యద్వారా వాతాపిని బ్రతికించి వాతాపీ రా! వాతాపీ రా!అని పిలిచేవాడు. వాతాపి వారిపొట్టను చీల్చుకుని బయటకు వచ్చేవాడు. ఆ మరణించిన వాణ్ణి వీరిద్దరూకలిసి భుజించేవారు. ఇలా జరుగుతుండేది ప్రతిరోజూ. ఓనాడు అగస్త్యుడు ఆ దారినే వెళ్తూండగా భోజనానికి పిలిచిన ఇల్వలుడు. యథావిధిగా వాతాపిని వండిపెట్టాడు. తన దివ్యదృష్టి ద్వారా విషయాన్ని తెలుసుకున్న అగస్త్యుడు భోజనం తర్వాత వాతాపి జీర్ణం! వాతాపి జీర్ణం! అన్నాడు. తర్వాత ఇల్వలుడు వాతాపిని బయటికిరా! అన్నాడు. ఇంకెక్కడి వాతాపి. జీర్ణమైపోయాడు కదా నా పొట్టలో అన్నాడు అగస్త్యుడు. ఆగ్రహించిన ఇల్వలుడు తన రాక్షసాకారాన్ని చూపగా అగస్త్యుడు చేసిన హుంకారంతో అతడు భస్మమైపోయాడు. అందుకనే చిన్నపిల్లలకి ఏదైనా ఆహారం పెట్టినపుడు వారిపొట్ట మీదరాస్తూ వాతాపి జీర్ణం! వాతాపి జీర్ణం!! అంటారు మన పెద్దలు. ఎందుకంటే రాక్షసుడంతటివాడే అగస్త్యునిమాటకు అరిగిపోయాడు కదా. అందుకని పిల్లలు తిన్న ఆహారం త్వరగా జీర్ణమై వాళ్ళు బలంగా ఉండాలనేదే పెద్దలకోరిక. బలంగా ఉంటారన్నదే ఈ మాటలోని పరమార్థం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి...**

మహావిష్ణువు హిరణ్యాక్షుని సంహరించాక, తాను భూపతితో కొంతకాలం భూలోకంలోనే ఉండడానికి స్థిరనిశ్చితుదయ్యాడు. భూలోకంలో ఎక్కడ వాసం చేయాలో అని పరిశీలించి స్వామి పుష్కరిణీతీరాన్ని ఎన్నుకొన్నాడని సూతుడు శౌనకాదులకు చెప్పగా వారు స్వామిపుష్కరిణీప్రభావం చెప్పవలసిందిగా కోరారు.

మునులారా! మీ కుతూహలాన్ని గుర్తించాను. స్వామిపుష్కరిణిప్రభావాన్ని తప్పక చెబుతాను.

విష్ణునివాసం వైకుంఠం. ఆ వైకుంఠంలోనే శ్రీదేవితో విష్ణువు విలాసార్థం సంచరించే క్రీడాచలముంది. ఆ కొండ నుండి జాలువారేదే స్వామిపుష్కరిణి. భూలోకవాసులు సులభంగా చేరగల్గిన ప్రదేశమూ కాదు. ఆ తీర్థం అప్రాకృత పరిమళోదకతీర్థం.

ఆ పుష్కరిణిలోనే మహావిష్ణువు శ్రీభూనీళాదులతో వేడుకతో విహారం సలుపుతుంటాడు. అలాంటి క్రీడాద్రిని శ్వేతవరాహమూర్తి భూతలానికి తీసుకొని రావలసిందిగా ఆదేశించినప్పుడు గరుత్మంతుడు శ్రీదేవితో సంప్రదించి క్రీడాద్రిని భూమికి చేర్చాడు. ఆ క్రీడాద్రితో పుష్కరిణికూడా భూతలం చేరింది.

మునులారా! స్వామిపుష్కరిణిని సామాన్యపుష్కరిణిగా తేలికభావంతో చూడకండి. ఆ పుష్కరిణి విరజానదిలాగ పుణ్యప్రదాయకం. భరతఖండంలో ప్రవహించే గంగాది పుణ్యనదులకు మాతృదేవతలాంటిది. భూలోకవాసుల పాపరాశిని హరించగలిగిన సామర్థ్యం కలది. భక్తుల తాపాలను ఉపశమింపజేయగల సామర్థ్యం ఆ పుష్కరిణికే ఉంది. అంతే కాదు ఎవరెవరు ఏ ఏ కోరికలతో ఆ పుష్కరిణిలో మునకలు వేస్తారో వారి వారి కోరికలన్నీ తప్పక నెరవేరుతాయి. పుణ్యపురుషులదర్శనంలాగే పుష్కరిణిదర్శనం కూడా పుణ్యదాయకం. పుష్కరిణీజలపానం చేసే స్త్రీలకు సమస్తమూ ప్రసాదించేది అదే. అన్నివర్గాలవారు ఈ పుష్కరిణిలో స్నానమాడడానికి అర్హులే సుమా! అగ్రవర్ణులుగా గుర్తింపబడేవారుకూడా ఈ పుణ్యోదకంలో నిత్యనైమిత్తిక కర్మాచరణ చేస్తుంటారు. వారికి దక్కే పుణ్యఫలం అనంతం.

అంతేకాదు. తిథులలో ఏకాదశీ వ్రతానుచరణ. అలాగే సద్గురుపాద సేవనం, పుష్కరిణీస్నానం సామాన్యులకు దుర్లభం. మానవజన్మ 84లక్షలజన్మల తర్వాత పుణ్యపాకం కారణంగా లభించేది. అలాంటి మానవజన్మ, స్వామిపుష్కరిణీ స్నానం, వెంకటాద్రినివాసం ఎవరికంటే వారికి సమకూడేవి కావు. ఒక మాటలో చెప్పాలంటే వేంకటాద్రిమాహాత్మ్యం, పుష్కరిణిప్రభావం మాటలకు అందనివి. ఆ కారణాన నేను సంగ్రహంగా చెప్పాను. ఈ సందర్భంలోనే మీకు ఒక చిన్నవృత్తాంతాన్ని విశదంగా చెబుతా..

ఒకానొకకాలంలో తారకాసురుడనే లోకకంటకుడు విజృంభించాడు. దేవేంద్రులు తారకాసురుని ఎదిరించలేక పోయారు. అలాంటి అసురుని కుమారస్వామి సంహరించాడు. దేవతలు సంబరంలో మునిగితేలారు. త్రిలోకవాసులు హాయిగా ఊపిరిపీల్చారు.

అంతాబాగుంది. కాని తారకాసుర సంహారంవలన కుమారస్వామికి బ్రహ్మహత్యాదోషం అంటుకొంది. ఏం చేయాలో పాలుపోలేదు. తనకు అంటిన బ్రహ్మహత్యాదోషనివారణకు ఉపాయం సూచించవలసిందిగా షణ్ముఖుడు తన జన్మకు కారకుడైన మహాదేవుని అడిగాడు. ఆ భక్తవత్సలుడు తడుముకోకుండా భూలోకంలో

వేంకటాద్రిదర్శనం మరి ఆ ప్రాంతంలోని స్వామిపుష్కరిణీ స్నానమొకటే పరిహారసూచకమని సూచించాడు. తండ్రి సూచన మేరకు సుబ్రహ్మణ్యుడు వేంకటాద్రి చేరడానికి పయనమయ్యాడు. ఆ పుణ్యశైలంకేసి అడుగులు వేస్తూండగానే తారకాసురసంహారికి బ్రహ్మహత్యాదోషం తొలగిపోయింది.

కుమారస్వామి ఈ సంఘటనకు నివ్వెరపోయాడు. ఆపై ఆరుమొగములస్వామి భక్తితో వేంకటాద్రిలో అడుగుపెట్టాడు. స్వామిపుష్కరిణిని దర్శించాడు. ఆ పుష్కరిణి పుణ్యోదకాలలో ముమ్మార్లు మునకలు వేశాడు. తదనంతరం పుష్కరిణిగట్టున గల వరాహస్వామిని దర్శించి మనసారాసేవించి ధన్యుడయ్యాడు. కుమారస్వామి అంతటివాని బ్రహ్మహత్యాదోషనివారిణి వేంకటాద్రి. అలాగే పుణ్యోదకం, సేనానులలో నేను స్కందుడనని శ్రీకృష్ణపరమాత్మ విభూతియోగంలో తన్నుగుర్తించేవారిలో కుమారస్వామిని చేర్చాడు. ఈ నెపంవల్లకూడా స్వామిపుష్కరిణీ ప్రాశస్త్యం పెరిగింది.

స్వామిపుష్కరిణిలాగా వేంకటాచలం సామాన్యమైనది కాదు. పాపహారి ఆ భూధరం. పరమపవిత్రం ఆ పర్వతం. సువర్ణమణికాంతులతో శోభితమైనది ఆ శైలం. అగ్రవర్ణులని గుర్తింపబడేవారికి జీవనాధారం ఆ అచలం. తాపసజనానికి అనుకూలమైన తపఃస్థలి. ఆ నగం. సృష్టికర్త బ్రహ్మ, భక్తవత్సలుడైన రుద్రుడు, త్రిలోకాధిపతి అయిన దేవేంద్రాదులు సదా సేవించి తరించే పుణ్యనగం. ఆబాలగోపాలానికి సర్వమంగళదాయిని. అనంతశిఖరాల కులాచరం. వేంకటనాయకుని కల్యాణ గుణాలన్నీ రాశీభూతంగా కనిపించేది ఈ వేంకటాద్రి. ఇంతకంటే పరమార్థం మరొకటి లేదు.

వేంకటాచలం సామాన్యులకైతే రాళ్లగుట్ట. కాని పవిత్రులకు పర్వతరాజు. ఇంతటి మహిమగల కొండల్లో మొదట స్థిరనివాసుడైనవాడు వరాహదేవుడు. ఆ స్వామి సామాన్యులకు అదృశ్యుడు. పుణ్యోపేతులకు కనులవిందు చేసే కమనీయ రూపం. ఈ పర్వతాన్ని దర్శిస్తేనే చాలు జీవులకు జీవనమరణాదులు లేని ఉన్నతస్థాయి అలవోకగా సిద్ధిస్తుంది. ఇందుకు ఏ మాత్రమూ సందేహం లేదు' అని సూతుడు పరవశించి చెబుతుంటే మునులు...

"పౌరాణికమణీ! వేంటాద్రిని వాసంగ చేసుకొన్న వరాహదేవుడు ఆ కొండను నివాసంగా చేసుకొని ఏం చేస్తున్నాడు? ఎవరిని కటాక్షిస్తున్నాడు? ఇవన్నీ దయతో సెలవీయండని కుతూహలంతో ప్రశ్నించారు. మునుల ఆకాంక్షను గుర్తించిన సూతుడు...

'మునులార! మీరడిగిన ప్రశ్న సరి అయినదే. ఎవరికైనా సందేహం కలిగించేదే. వరాహదేవుడు కొండల్లో కోనల్లో కనిపిస్తూ కాంతామణులతో సప్తగిరుల సొగసులను కనులార చూస్తూ కాలక్షేపం చేయలేదు. అధర్మపరులైన పాపులను నిగ్రహిస్తూ ధార్మికుల విశ్వాసానికి బలం చేకూరుస్తూ కాలం గడిపేవాడు. అయినా ఇవన్నీ స్వామి నైజగుణాలు. దుష్టశిక్షణ, శిష్టరక్షణలకు అతడే ధర్మకర్త.

మహావిష్ణువు పాలితుడు. పాలకుడు కూడా. బ్రహ్మ సృష్టి చేస్తూంటే అతడు విశ్రమించేవేళ రక్షించేవాడు విష్ణువే. తదుపరి బ్రహ్మ మేల్కొనగానే అతనికి మరల బాధ్యత అప్పగిస్తాడు. ఆయాకాలాలబట్టి వరాహాదిరూపాలతో దుష్టనిగ్రహమూ, శిష్టరక్షణమూ చేస్తాడు.

ఇలా వరాహకల్పం గడుస్తుంటే బ్రహ్మదేవుడు ఒక ప్రశ్న వేశాడు. ***(ఇంకా ఉంది)***

## వైకుంఠపాళి
## :: 91 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 క | 2 శ్య | ప | 3 ప్ర | జా | ప | తి | |
| 4 లిం | | మం | | హ్లా | | | | 5 అ |
| గ | | త | | 6 దు | ర్యో | 7 ధ | ను | దు |
| ము | | క | | డు | | ర్మ | | గు |
| | 8 ఆ | మ | ని | | 9 త | రా | జు | |
| 10 కా | | ణి | | 11 ద్రా | | జు | | 12 అం |
| 13 మో | ము | | 14 క | ప | ర్ది | | 15 శి | బి |
| ద | | 16 పా | | ది | | 17 రు | | క |
| 18 కి | రీ | ట | ము | | 19 రు | క్మి | ణి | |


నేటి మాధుర్యాన్ని చవిచూడాలంటే గతాన్ని మరచిపోవాలి

(09-08-2023 న ఆడికృత్తిక సందర్భంగా...)

# పళనిస్వామిక్షేత్రం

– శ్రీమతి వావిలాల నాగవల్లి, 93912 97650



దేవాది దేవసుత దేవగణాధినాథ।
దేవేంద్ర వంద్య మృదుపంకజ మంజుపాద।
దేవర్షి నారద మునీంద్ర సుగీతకీర్తే।
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

అని ప్రార్థనలందుకునే స్వామి సుబ్రహ్మణ్యస్వామి. దక్షిణాదిలోని తమిళనాడులో పళని, తిరుచెందూర్, తిరుత్తణి, స్వామిమలై, తిరుప్పరకున్రమ్, పలముదిరేచోలై అని ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలున్నాయి. వీటిలో నాలుగవది అయిన పళని క్షేత్రం అత్యంత ప్రసిద్ధిచెందింది. ఎక్కడైనా విగ్రహాలు శిల లేదా పంచలోహాలతో చేస్తారు. కాని ఇక్కడి స్వామివిగ్రహం నవ పాషాణాలతో చేయబడిందని ప్రసిద్ధి. పాషాణం అంటే విషం, ఖనిజం అనే అర్థాలుకూడా ఉన్నాయి.

పూర్వం భోగర్ అనే సిద్ధుడు ఆ కొండప్రాంతంలో ఉన్న రకరకాల మూలికలను సేకరించి వానిలో అత్యంత శ్రేష్ఠ మైన తొమ్మిదిరకాల మూలికలతో ఈ విగ్రహాన్ని తయారు చేశాడని ప్రతీతి. రాత్రిసమయంలో మూలవిరాట్టుకు గంధం పూస్తే తెల్లవారేసరికి చెమటతో తడిసినట్లుగా తడితడిగా ఉండే దని పండితులవాక్కు. రాత్రిసమయంలో స్వామి పాదాలవద్ద గిన్నె ఉంచితే అందులో పడిన నీటిచుక్కలను తీర్థంగా, గంధాన్ని ప్రసాదంగా భక్తులకు పంచుతారు. ఈ తీర్థాన్ని స్వీకరిస్తే వ్యాధినివారణ జరుగుతుందని భక్తులనమ్మిక. ఇక్కడ స్వామి వారికి నిత్యము షట్కాలఅర్చనలు జరుగుతాయి.

అంతేకాక ఇక్కడి పంచామృతప్రసాదం, విభూతికూడ అత్యంత శ్రేష్ఠమైనవి. విభూతి సువాసనలు వెదజల్లుతూ ప్రత్యేకంగా ఉంటుంది. ఇక స్వామికి నివేదించే పంచామృత ప్రసాదాన్నిగురించి ఎంతో గొప్పగా చెబుతారు అందరూ. తిరుపతిలడ్డు అనగానే వేంకటేశ్వరుడు గుర్తుకు వచ్చినట్లు పళని అంటేనే పంచామృతప్రసాదమే గుర్తుకు వస్తుంది. ఈ ప్రసాదపు రుచికూడా అమోఘంగా ఉంటుంది. పళనికొండల్లో దొరికే విరుప్పాచ్చి అనే పేరున్న అరటిపండ్లను ఇందులో ఉపయోగిస్తారు. అవి బొటనవేలంత చిన్నవిగా ఉండి రుచిగా ఉంటాయి. వాటి రుచి ఎంతో మధురంగా ఉంటుంది. ఆ అరటిపండు, అక్కడ కంజీయప్రాంతాల్లో పండిన చెరకుతో చేసిన పంచదారను పంచామృతానికి వాడతారు. అలా అరటిపండ్లు, పంచదార, ఖర్జూరాలు, ఆవునెయ్యి, తేనె అన్నీ సమపాళ్ళలో కలిపి ఈ పంచామృతాన్ని తయారుచేస్తారు. స్వామికి నివేదించిన తరువాత ఈ పంచామృతప్రసాదాన్ని డబ్బాలలో పెట్టి సీలు వేస్తారు. ఆరునెలలైనా సరే ఈ ప్రసాదం రుచి, వాసన చెడదు. ఈ పంచామృతప్రసాదం "జి1 ట్యాగ్"ని పొందిన మొదటి ఆహారపదార్థం అని చెబుతారు. ఇదీ పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రసాదప్రాముఖ్యత. ఈ ప్రసాదంవల్ల అనారోగ్యసమస్యలు తీరిపోతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. ఎక్కడెక్కడినుంచో భక్తులు ఈ ప్రసాదస్వీకరణకు వస్తూంటారు.



అంతేకాక ఈ స్వామికి నెమలివాహనం, కుక్కుటం ధ్వజం, బల్లెం ఆయుధంగా కావడానికి స్కాందపురాణంలో ఈవిధంగా చెప్పబడింది. ఒకప్పుడు శూరపద్ముడనే రాక్షసుడు బ్రహ్మగురించి తపస్సుచేసి శివకేశవులచేతిలో మరణం లేకుండా ఈశ్వరపుత్రునిచేత మాత్రమే తనకు మరణం కలిగేట్లు వరం కోరాడు. ఆ వరగర్వంచేతదేవతలను బాధిస్తూండేవాడు. దేవతలు బ్రహ్మను శరణువేడగా శివకుమారునిచేతనే వాని మరణం సంభవిస్తుందన్నాడు. అపుడు వారు ఈశ్వరుని ప్రార్థించగా శివతేజస్సుతో ఉద్భవించిన కుమారస్వామిని దేవతల సేనకు నాయకుడిగా చేసుకొని యుద్ధానికి బయలుదేరారు.

ఆ సమయంలో పార్వతీదేవి తనశక్తినంతా మనస్సు నందు కేంద్రీకరింపచేయగా మనస్సునుండి ఒక ఆయుధం ఉద్భవించింది. దానిని పుత్రునికిచ్చి శరణువేడినవారినికాక, శత్రువులను సంహరించమన్నది. అదే స్వామిచేతిలోని 'శక్తి' అను పేరుగల బల్లెం. దీనిని తమిళంలో 'వేల్' అని అంటారు.



'వేల్‌మురుగన్, వేలాయుధన్' అనేపేర్లతో స్వామిని కీర్తిస్తారు. అలా యుద్ధానికి వెళ్ళినసమయంలో దేవతలు ఎందరో మరణించారు. శూరపద్ముడు స్వామి శక్తిని తట్టుకోలేక మాయాయుద్ధం చేశాడు. కుమారస్వామికూడా మాయాయుద్ధం చేస్తుండగా, శూరపద్ముడు అడవిలోకి పారిపోయి పళ్ళున్న మామిడిచెట్టుగా మారిపోయాడు. అడవిలో పళ్ళమామిడిచెట్టును చూసిన స్వామి తనచేతిలోని బల్లెంను ఆ చెట్టుపైకి విసిరివేశాడు. ఆ చెట్టు మధ్యకు చీలిపోయి ఒకభాగం నెమలిగా, మరొకభాగం కోడిగా మారిపోయాయి. అవి రెండూ కార్తికేయుని శరణుకోరాయి. శరణు కోరినవారిని సంహరించవద్దని తల్లి చెప్పిన మాట మేరకు వానికి శరణు ప్రసాదించి నెమలిని వాహనంగా, కుక్కుటము(కోడి)ను తన ధ్వజంపై గుర్తుగా నిలుపుకున్నాడు స్వామి. ఈ విధంగా జగన్మాత మనోశక్తి చేతిలో బల్లెము (వేల్)గా, శూరపద్ముని ఒకభాగమైన నెమలిని వాహనంగా, మరొకభాగమైన కుక్కుటంను ధ్వజానికి గుర్తుగా నిలుపుకొని భక్తులకు దర్శనమిస్తూ కాపాడుతున్నాడు. వేల్‌మురుగన్‌ను కొలిచినవారికి సర్వసుఖాలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం.

ఇక్కడ స్వామికి అభిషేకం చేసిన జలాన్ని తీర్థంగా తీసుకుంటే సకలవ్యాధులు నివారణ అవుతాయని ప్రతీతి. ఈ క్షేత్రం మధురైకి 120 కి.మీ. దూరంలో ఉన్నది. శివగిరి అనే కొండమీద ఈ ఆలయం ఉంది. కొండపైకి వెళ్ళటానికి రోప్‌వే, నడకమార్గం రెండూ ఉన్నాయి. "పళని" అంటే "జ్ఞానఫలం" అని అర్థం.

ఒకసారి బ్రహ్మదేవుడు ఒక పండును తెచ్చి ఇది బ్రహ్మజ్ఞానంతో నిండిన పండు అని చెప్పి పరమేశ్వరునికి ఇచ్చాడు. తనచెంతనే ఉన్న ఇద్దరు కుమారులలో ఎవరికి ఇవ్వాలా? అని ఆలోచించి ఎవరైతే ముందుగా ఈ విశ్వానికి ప్రదక్షిణం చేసి వస్తారో వారికే ఈ ఫలం అన్నాడు ఈశ్వరుడు. అపుడు కుమారస్వామి నెమలివాహనం అధిరోహించి ప్రదక్షిణానికి వెళ్లాడు. కాని వినాయకుడు తల్లిదండ్రు





లకే ముమ్మారు ప్రదక్షిణం చేశాడు. అపుడు ఈశ్వరుడు వినాయకునికి ఆ ఫలాన్ని ఇవ్వగా ఆయన దానిని భుజించాడు. ఆ విషయం తెలుసుకొని కోపించి కూర్చున్న కుమారస్వామిని చూచిన శివుడు "బ్రహ్మజ్ఞానం సమస్తము నీలోనే ఇమిడి ఉన్నది". నీకు జ్ఞానం చేకూర్చే మరోఫలం ఎందుకు అన్నాడు. "బ్రహ్మజ్ఞాన ఫలానివి సాక్షాత్తు నీవే అన్నమాటలకు "ఫలాలన్నీ నీవే". "పళం" అంటే పండు. "నీవే" అంటే 'ని' అదే కాలక్రమేణా 'పళని' అనే పేరుతో ప్రసిద్ధి పొందిన క్షేత్రం అని పెద్దలు చెబుతారు. జ్ఞానస్వరూపుడైన ఈ స్వామికి "తేనె, పాలు, పంచదార, అరటిపళ్ళుగుజ్జు కలిపిన ద్రవంతో అభిషేకాలు చెయ్యటం ప్రశస్తం. అలాచేస్తే పిల్లలకు జ్ఞానవృద్ధి కలిగి విద్యావంతులవుతారని ఒక నమ్మిక.

షణ్ముఖుడయిన సుబ్రహ్మణ్యేశ్వరుని జననము అత్యంత విశేషమయినది. అతడే పార్వతీపరమేశ్వరుల పుత్రుడైన కుమార స్వామి. శరవణోద్భవుడైన ఆ బాలుని ఆరుగురుకృత్తికలు స్తన్యమునిచ్చి పెంచారు. వారివద్ద పాలుత్రాగటానికి ఆరుముఖములు ధరించి షణ్ముఖుడుగా ప్రసిద్ధిగాంచాడు. అలా కృత్తికలచే పెంచ బడి కార్తికేయుడుగా ప్రసిద్ధి పొందాడు. (బ్రహ్మపురాణం).

అందుకే ఏ మాసమునందైనా కృత్తికానక్షత్రమున్న దినము సుబ్రహ్మణ్యునికి ప్రీతిపాత్రం. ఆషాఢమాసం కృత్తికా నక్షత్రం వచ్చినరోజుని "ఆడికృత్తిక" అంటారు. ఆరోజు స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైనరోజు. ముఖ్యంగా తమిళనాడులో "ఆడికృత్తిక" పర్వదినాన్ని విశేషంగా జరుపుకుంటారు. ఈ రోజు స్వామిని ఆరాధిస్తే విశేషఫలితం ఉంటుందని భక్తులనమ్మకం.

కృత్తికానక్షత్రం ఉన్నరోజు ఉపవాసమాచరించి, బియ్యపుపిండితో చలిమిడి చేసి ఆ చలిమిడితో చేసిన ప్రమిదలో ఆవునేతితో దీపారాధన చెయ్యాలి. పండ్లు, పచ్చిపాలు, వడపప్పు వంటివి నైవేద్యంగా పెట్టాలి. సాయంత్రందాకా ఉపవాసముండి నక్షత్రదర్శనం చేసుకుని ఈ నైవేద్యం ఆహారంగా తీసుకోవాలి. వండినపదార్థాలు పనికిరావు. బ్రహ్మచర్యాన్ని పాటించితీరాలి. ఈ నియమాలతో స్వామిని సేవిస్తే స్వామివారి విశేషానుగ్రహం కలిగి పిల్లలు వృద్ధిలోకి వస్తారు. సంతానంలేనివారికి సంతాన ప్రాప్తి కలుగుతుంది. మందబుద్ధులు, చెవి, ముక్కు, కన్ను బుద్ధిమాంద్యంవంటి వ్యాధులన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఇదే నియమాన్ని నాగులచవితినాడుకూడా ఆచరి స్తారు. సుబ్రహ్మణ్యుని మాతృకలైన కృత్తికనక్షత్రం ఉన్నరోజున స్వామిని ఎవరైతే ఆరాధిస్తారో వారికి స్వామి సంపూర్ణ అను గ్రహం కలుగుతుందని పార్వతీదేవి వరం ప్రసాదించిందట. ఆ జగన్మాతవాక్కు ఎల్లరకు శిరోధార్యమే కదా!

ఆషాఢమాసంనుండి దక్షిణాయనానికి ముందు వచ్చే కృత్తిక గనుక దీనిని ఆదికృత్తిక అని, ఆషాఢమాసంలో వచ్చేది కనుక ఆడికృత్తిక అనికూడా అంటారు. ఆషాఢమాసంలో వచ్చే కృత్తికనాడు సుబ్రహ్మణ్యారాధన అత్యంత శ్రేయోదాయకం.

పళనిలో ఆడికృత్తికతోపాటుగా కావడిఉత్సవంకూడా ప్రసిద్ధి వహించింది. దేవదానవసంగ్రామంలో రాక్షసరాజు

## 2023, సెప్టెంబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 06 | శ్రీకృష్ణాష్టమి |
| 07 | గోకులాష్టమి |
| 17 | శ్రీబలరామజయంతి, శ్రీవరాహజయంతి |
| 18 | వినాయకచవితి |
| 18-26 | తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం |
| 22 | తిరుమల శ్రీవారి గరుడసేవ |
| 26 | శ్రీవామనజయంతి |
| 26-29 | తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి పవిత్రోత్సవం |
| 30 | మహాలయపక్షప్రారంభం |



లందరూ దేవతలచేతుల్లో చనిపోతున్నారు. అది చూసిన ఇడుంబుడు అనే రాక్షసుడు తమప్రాణాలు కాపాడుమని అగస్త్య మహర్షిని ప్రార్థించాడు. అపుడు అగస్త్యుడు కుమారస్వామి సలహామేరకు కైలాసంనుంచి రెండుకొండలను భూమిమీదకు తీసుకురమ్మని ఇడుంబుడితో చెప్పాడు. అంత ఇడుంబుడపుడు శివగిరి, శక్తిగిరి అనే రెండుపర్వతాలను ఒక కావడిలో పెట్టుకొని భూలోకానికి తీసుకువచ్చాడు. పళని సమీపానికి రాగానే కావడి బరువెక్కడంతో దానిని క్రిందపెట్టి అలసట తీర్చుకున్నాడు. తరువాత కావడిని ఎత్తబోతే అది పైకి లేవలేదు. ఆ సమీపాన బాలుడిరూపంలో ఉన్న షణ్ముఖుడు నవ్వాడు. ఆ నవ్వుకు ఆగ్రహించిన ఇడుంబుడు బాలుణ్ణి చంపబోయాడు. అప్పుడాబాలుడు నవ్వుతూ కొండమీదకు పరుగెట్టాడు. అదే నేడు షణ్ముఖుడు కొలువైన పళనిక్షేత్రంలోని శివగిరి. ఆ బాలుడే కుమారస్వామి అని గ్రహించిన ఇడుంబుడు తనని మన్నించుమని వేడుకున్నాడు. ఆర్తత్రాణపరాయణుడైన స్వామి అతణ్ణి మన్నించటమేకాకుండా నీవలె "కావడి"తో ఎవరైతే కొండమీదకు వస్తారో వాళ్ళకు యజ్ఞఫలం దక్కుతుందని వరమిచ్చాడు. నీవల్లనే కావడిసంప్రదాయం మొదలైంది. కనుక భక్తులు నిన్ను దర్శించినతరువాతే నన్ను కొలుస్తారని చెప్పాడు. ఈ కావడిలో పాలు, నెయ్యి, తేనె, విభూతి, పూలు, పళ్ళువంటివి పెట్టుకొని స్వామి నెలవైన కొండపైకి వచ్చి స్వామిదర్శనం చేసుకుని, వానిని స్వామికి సమర్పిస్తే దాంపత్యదోషాలు తొలుగుతాయని, సత్సంతానం కలుగుతుందనీ భక్తుల ప్రగాఢవిశ్వాసం.

ఈ విధంగా పళనిలో జరిగే "ఆడికృత్తిక, కావడి" ఉత్సవాలు అత్యంత మహిమాన్వితమైనవి. కోరికలు ఈడేరే ఈ ఉత్సవాలకు అన్ని ప్రదేశాలనుండి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామికి తమమొక్కులు చెల్లించుకుని స్వామికృపకు పాత్రులవుతారు.

ఇక్కడి స్వామిచేతిలో దండం పట్టుకొని, 'కౌపీన ధారియై, చిరునవ్వులొలికిస్తూ ఆరేళ్ళబాలునివలె నిలుచుని దర్శనమిస్తాడు'. నన్ను చేరుకోవాలంటే సమస్తము వదిలేసి, నన్ను ఆశ్రయించుమన్నదే స్వామి తత్త్వోపదేశం. ఆ సుబ్రహ్మణ్యుని నమ్మి సేవించినవారికి సకలదోషాలు తొలగిపోయి ఇహంలో పిల్లాపాపలతో ఆనందాలను అనుభవించి పరంలో స్వామిని చేరుకుంటారన్నది సత్యం.

నమః కల్యాణ రూపాయనమస్తే విశ్వమంగళ ।
విశ్వబంధో నమస్తేఽస్తు నమస్తే విశ్వభావన ॥

**51వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**





# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

తిరుమల బ్రహ్మోత్సవము మొదటిదినమున ప్రాతఃకాల మందును సంధానములేదు. రాత్రి మొదటితిరువంతాది, రెండవ ఉత్సవదినమున ప్రాతస్సాయంకాలములందు రెండవ తిరువంతాది, మూడవదినమున ప్రాతస్సాయంసమయము లందు మూడవతిరువంతాది. నాలుగవదినమందు ప్రొద్దున, సాయంకాలమున నాన్ముగన్‌తిరువంతాది, ఐదవదినమందు ప్రొద్దుట తిరువిరుత్తం ఒకపర్యాయము అనుసంధింపవలెను. పిదప ముదలాయిరమ్ ఆరంభింపవలెను. రాత్రికూడ తిరు విరుత్తం ఒకసారి అనుసంధించి ముదలాయిరమ్ మిగిలిన భాగములను అనుసంధింపవలెను. ఆరవదినమున ప్రాతః సాయంకాలములందు పెరియతిరువంతాది ఒకపర్యాయ మనుసంధానముచేసిన పిమ్మట ముదలాయిరమ్ శేషమను సంధేయము. ఏడవదినమందు ప్రొద్దుట (పెరియ) తిరుమొళి యారంభము. తోటఉత్సవము సంచారసమయమందును రాత్రి వేళయు తిరుమొళియే అనుసంధేయము. ఎనిమిదవదినమందు రథము స్థాపరమందును తిరుమొళియే రెండవఆవృత్తిగా అను సంధింపవలెను. రథము స్థానమునకు చేరిన తరువాత తేరువద్ద విజయము చేసియుండునపుడు పెరియాళ్వార్ తిరుమొళియు, పెరియతిరుమొళియు సమాప్తి చేయవలయును. తిరుమొళి సమాప్తి యనంతరము తిరువెళుకూత్తిరుక్కై, శిఱియతిరుమడల్, పెరియతిరుమడల్– ఈ మూడింటిని అనుసంధింపవలెను. రథమునుండి దిగి కోవెలకు విజయము చేయునపుడు తిరువా శిరియము, రాత్రి ముదలాయిరము శేషము అనుసంధింపవలెను. తొమ్మిదవదినమున ప్రొద్దుట ముదలాయిరము శేషము, తిరుక్కు ఱుందాండకము, తిరునెడుందాండకము, మధ్యాహ్నమున చూర్ణాభిషేకసమయమున (గందపొడిఉత్సవము) శ్రీవీథిలో గోష్ఠిలో తిరుచ్చందవిరుత్తమ్ రాత్రి నూత్తందాది అవకాశమున్నచో ఆవృత్తి చేయవలెను. తరువాత శ్రీస్వామివారియెదుట సమాప్తి. పదవనాడు శ్రీపుష్పయాగసమయమున ద్వాదశారాధన సందర్భ మున తిరువాయ్‌మొళి అనుసంధేయము. ఆరవయుత్సవమున సాయంకాలమున వసంతోత్సవాంగముగ చూర్ణాభిషేకోత్సవము జరిగి వీథిలో విజయము చేయునపుడు అనుసంధానము లేదు.

### తిరుమలయందు ఇయఱ్పాకాకుండ మూడువేల ప్రబంధమున శ్రీవేంకటేశ్వరవిషయకమయిన పాశురములను రెండుసార్లు అనుసంధించుటకును, ఇయఱ్పాపాశురములు రెండుసార్లు అనుసంధింపకుండుటకును కారణము

శ్రీభగవద్రామానుజులు, శ్రీమన్నాథములతో మొదలైన సంప్రదాయముఖమున 'చెందమిశము పాడెదువారు (మొదలా ళ్వారులు) మ్రొక్కులిడెడు దేవడితడు' అని వినిన చొప్పుననే ముదలాళ్వారులు ముగ్గురి యాశయములను బాగుగ నెరిగి యుండుటచేత తిరువంతాదుల మూడిటను శ్రీవేంకటేశ్వరుడే ప్రతిపాద్యుడనియు, తిరుమంత్రమున (అష్టాక్షరీమంత్రమున) 'నారాయణాయ' అను పదమునందలి వ్యక చతుర్థీవిభక్త్యర్థమగు కైంకర్యద్వారమున ఈ తిరువంతాదులతోడ సమానార్థకమగు ఇయిఱ్పా శేషమునకును ఈయనే ప్రతిపాద్యుడనియు నిర్ణయించిరి.

(ఇంకా ఉంది)



2023, ఆగష్టు, 31న గాయత్రిజపం సందర్భంగా...

# న గాయత్ర్యాః పరోమంత్రః

– శ్రీ మల్లాది నరసింహమూర్తి, 98662 69468

శ్రీగాయత్రిమంత్రం అన్ని మంత్రాలకుకూడ మూల మంత్రం మరియు గొప్పదైన మంత్రం.

పూర్వం స్వర్గంనుండి యజ్ఞం చేయటానికి "సోమలత' (ఓషదీవిశేషం)ను భూలోకం తీసుకురావడానికి అన్నిరకాల ఛందస్సులు (గాయత్రి మినహా) వెళ్లాయి. కాని వాటి ప్రయత్నం కాస్త బూడిదలో పోసిన పన్నీరయింది. సోమలత మాత్రం భూమిపైకి రాలేదు. ఆ సమయంలో గాయత్రీఛందస్సు స్వర్గం చేరగానే ఆమె మహిమవల్ల సోమలత భూమిపైకి దిగి వచ్చింది. దాంతో ఇక సకలఛందస్సులతో కూడిన మంత్రాలను ప్రయోగిస్తూ యజ్ఞం చెయ్యడంవల్ల సకలదేవతలూ సంతోషించారు. వారి అనుగ్రహంతో జగత్కల్యాణం జరిగింది. ఇంతమహిమ కల్గిన ఇరవైనాల్గక్షరాలు (24) గల్గిన గాయత్రిమంత్రమునకు సావిత్రి అను పేరుకూడ లోకంలో ప్రసిద్ధిచెందింది. ఈ మంత్రానికి అధిష్ఠానదేవత సావిత్రి.

## శ్రీగాయత్రి మాతృస్తుతి

**వందనకోటి యోగినికి వందనకోటులు మంత్రమూర్తికిన్**
**వందనకోటి భారతికి వందనకోటులు యంత్రమూర్తికిన్**
**వందనకోటి వైష్ణవికి వందనకోటులు యంత్రమూర్తికిన్**
**వందనకోటులా సకలప్రాణి హృదంతర తత్త్వమూర్తికిన్॥** 1

**కనులన్నిండుగ నిల్చి పద్మముఖివై గాయత్రివై నీవు, నా**
**తనువున్‌తాకి, సుధాదయాబ్జవదనా! తత్త్వార్థవర్ణాత్మికా!**
**శనిపీడల్ తొలగించినావు ఇలలో సామ్రాజ్ఞివై నిల్చుచున్**
**నిను సేవించిన సిద్ధినిచ్చెదవు నీ నెయ్యంబు సామాన్యమే॥** 2

**అభయంబిచ్చెడు నీరజాక్షివి సదా ఆహ్లాదరూపంబుతో**
**శుభముల్ కూర్చిన బిందువైతివిగదా! సూక్ష్మాతిసూక్ష్మంబుగా**
**ప్రభవించంగదె భక్తితో ప్రజలు నీప్రాగల్భ్యమున్ చూడగా**
**నభమున్ మించెడు కీర్తిచంద్రికలగానంబయ్యె లోకంబులో॥** 3

**అమ్మను నమ్ముకొంటిని అహమ్ము ఇహమ్మును మాని పూనికన్**
**అమ్మల గన్నయట్టిముగురమ్మల మూలపుటమ్మవై సుగీ**
**తమ్ముల సత్కవిత్వములధారలు దారత ఉగ్గుపాలుగా**
**గొమ్మని పోసినావు రసఘూర్ణ వికీర్ణ సువర్ణమూర్తివై॥** 4

**కంటిని దివ్యమంగళను కంటిని పూజిత కోమలాంగినే**
**కంటిని శ్రీనికేతనను కంటి విలక్షణమూలమూర్తినే**
**కంటిని భానునేత్రవరగాత్రను శబ్దశివస్వరూపనే**
**కంటిని వేదమాతను అకార ఉకారమకార సంధిలోన్॥** 5

**భువనక్లేశము లెల్లమాన్పఇలలో పూర్ణేందుబింబాననా!**
**వివిధక్రీడలఁ బ్రోడవైజనులకున్ విశ్వాసమందించుచున్**
**సవరింపగన్ బాధలన్నియును ఆసాంతంబు తీరంగనే**
**భవదీయంబగునాజ్ఞచే నడవగా భాగ్యంబులేకల్గెనే॥** 6

**ఉత్తమభక్తితో కొలువ ఉత్థిత మౌనురకుందలీంద్రవై**
**ఉత్తమభక్తితో కొలువ ఊర్జము నిచ్చును పద్మనేత్రయై**
**ఉత్తమభక్తితో కొలువ ఉత్తము లింట రమాలలామయై**
**ఉత్తమభక్తితో కొలువ ఉన్నత మార్గము చూపుచుండురా॥** 7

**యోగులు నిన్నెరంగుదు రయోగ్యులెఱుంగకపాపులైరిగా**
**భోగములిచ్చినావు పరిపూర్ణమనస్సున కొల్చినంతనే**
**త్యాగముచూపినావు మమతాలసితాత్మమనోజ్ఞమూర్తివై**
**రోగములంతు చూసితివి రోదసి నిండుచు భద్రకాళివై॥** 8

**మనసేమందిరమయ్యె లక్షణముగా మాతంగి! నీవాక్కులే**
**వినసొంపయ్యెను మాట మంత్రమగుచున్ వీచెన్ దయాసింధువై**
**వెనుకన్‌నిల్చి మదీయబుద్ధికి సదావిజ్ఞానమందించగా**
**తనువుంబొల్చె సుషుమ్న ప్రాణమొనరన్ తత్త్వంబు శోధించుచున్॥**9

**లలితాదేవిగనిన్నుకొల్చితిని నీలాబ్జాక్షివై నిల్వగా**
**మలినంబంతయుపోయి, నామనసు నిర్మాల్యంబుగామారెగా**
**అలివేణీ! సురపూజితా! మదఖిలాహంకారముల్‌తీసి, నా**
**తలపై వ్రాసిన వ్రాతన్ చెఱుప నీస్థానంబుకేవచ్చెదన్** 10

శుభం భూయాత్

వ్యక్తిత్వ వికాసం



# నీ విధికి నీవే శిల్పివి!

– ఆచార్య ఆంధ్రరత్న జి.వి. శేషారెడ్డి, 94404 24322

సత్యయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం, కలుషితయుగం. వేలసంవత్సరాల కలియొక్క యుగం. కాలమేదైవం. జీవితమంటే భూతభవిష్యత్‌వర్తమానాల సమాహారం. ప్రతిమనిషి జీవితంలో గతం ఉంటుంది. గతం బంగారుమయమై చరిత్రను సృష్టించాలంటే ఆలోచనలే మానసిక శారీరక ఆరోగ్యానికి కారణాలు. దురాలోచనతో దుఃఖం, దూరాలోచనతో ఆనందం. మానవజన్మ ఉత్కృష్టమైనది. మానవుని మది విచక్షణాజ్ఞాననిధి. మంచి, చెడులప్రభావం, ధర్మఅధర్మాలఫలితం తెలుసుకోగల శక్తే విచక్షణా జ్ఞానం.

ప్రతిమనిషి మెదడు ఆలోచనల పుట్ట. ఆలోచనలన్నింటినీ విచక్షణా జ్ఞానంతో మెరుగుపెట్టాలి. అపుడు ప్రతి మనిషి జీవితం నందనవనంగా మారుతుంది. పాలలో నెయ్యి దాగిఉందని తెలుసు. ఆ నెయ్యి తయారు చెయ్యడానికి ప్రక్రియకూడా తెలుసు. మానవఆలోచనలను విచక్షణ అనే కవ్వంతో చిలికితే ధర్మం, న్యాయం, మంచి వెలువడతాయి. జ్ఞానంతోటి విజ్ఞానం చోటు చేసుకుంటుంది. ప్రతిమనిషి జీవితం విజ్ఞానాన్ని ఉపయోగించుకొంటే వికసించినకలువలాగ అందంగా ఉంటుంది. ఆలోచనలే ఆనందానికి నాంది. ఆలోచనలే ఆందోళనకు, ఆవేదనకు కారణాలు. కలుషితమైన వాతావరణం మానవునికి అన్నివిధాల చేటు. వాతావరణకాలుష్యం మానవుని మానసిక శారీరకఆరోగ్యాన్ని క్షీణింపచేస్తాయి. అదేమాదిరి కలుషిత ఆలోచనలు మనిషిని మృగంగా మార్చుతాయి. నేడు నీరు, గాలి, భూమి, శబ్దం అన్నీ కలుషితమే. పంచభూతాల కలుషితం మానవతప్పిదం. అనాలోచిత నిర్ణయాలు అశాశ్వతఆనందం. నిజమైనఆనందం బ్రహ్మానందం. బ్రహ్మానందం నిత్యమైనది. శాశ్వతమైనది. మానవుడు శాశ్వతానందంకోసం మార్గాన్ని అన్వేషించి కనుగొన్నాడు. అయినా, ఆ మార్గం ఎంతో గొప్పదైనా, మహిమాన్వితమైనదైనా కనుగొనలేక మావితో కప్పబడిన శిశువులాగా, అమాయకత్వం, అహంకారం అనే మాయతో కప్పబడి సత్యాన్ని తెలుసుకోలేక పోతున్నాడు.

ధర్మం ప్రామాణికంగానే ఆలోచనలు ఉద్భవించాలి. 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది. అధర్మంగా ఆర్జించేది పాపాహారం. అన్నం పరబ్రహ్మస్వరూపం. పాంచభౌతికమైన ఈ శరీరం ధర్మాహారాన్ని భుజించాలి. "యద్భావం తద్భవతి". అందుకే ధర్మంగానే ఎప్పుడైతే ఆలోచిస్తామో అపుడు ప్రతిక్రియ, ప్రక్రియ ధర్మబద్ధంగానే ఉంటాయి. భరతఖండం వేదభూమి. ఈ భూమిలో పుట్టిన ప్రతిప్రాణి, ప్రతిచెట్టు, ప్రతిపుట్ట అంతెందుకు ప్రతిఅణువు అదృష్టమయం. భగవద్గీత పుట్టిన ఈ భరతఖండం ప్రపంచదేశాలకు ఆదర్శం. ఇటువంటి మహోన్నతదేశంలో పుట్టిన భారతీయులుకూడా ప్రపంచదేశాల విభిన్నవ్యక్తులకు ఆదర్శంకావాలంటే మన ఆలోచనలు అత్యున్నతంగా విశాలదృక్పథం కలిగి ఉండాలి కదా!

'నీ వాస్తవానికి నీ ఆలోచనలే కారణాలు'. 'నీ విధికి నీవే సృష్టికర్తవు'. 'నిన్ను నీవు ఉద్ధరించుకో'. 'నీలోకి నీ ప్రయాణం'. 'నీ నోటి మాటలే నీ ఆలోచనలసమాహారం'. ఈ సూక్తులన్నిటిని పరిశీలిస్తే, పరిశోధిస్తే మనం ఆలోచించేవిధానమే అన్నది నిర్వివాదాంశం.

కలుషితంలేని, కల్మషంలేని ఆలోచనలు మనిషిని మహనీయునిగా మారుస్తాయి. మానవత్వాన్ని దైవత్వంగా మార్చుతుంది.

కామపుఆలోచనలతో రావణాసురుడు లంకకు చేటు తెచ్చాడు. క్రోధపుఆలోచనలతో విశ్వామిత్రుడు తపోశక్తిని చేజార్చుకున్నాడు. అహంకారం, అభిమానపుఆలోచనలతో దుర్యోధనుడు కురుక్షేత్రధర్మయుద్ధానికి కారకుడయ్యాడు. ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలకుల ఆలోచనలు ఉండి తీరాలి. అదను తప్పితే ఫలితముండదు. అనుభవం ఆలోచనకు జీవం పోస్తుంది. అవసరాన్ని బట్టి ఆలోచన వస్తుంది. అవసరం ప్రతికార్యానికి తల్లిలాంటిదిగా భావించి మన విధికి మనమే శిల్పులుగా రూపు దిద్దుకుందాం.

# నైమిశారణ్యంలో చక్రతీర్థం

- శ్రీ శ్రీరాముల హేమంత్‌కుమార్

నైమిశారణ్యం ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌జిల్లాలో లక్నోకు 94కి.మీ.ల దూరంలో ఉంది. పవిత్ర గోమతీనదీతీరాన ఉన్న ఈ ప్రాంతం గోమతీజలాలతో పవిత్రమై అలరారుతోంది. ఈ ప్రాంతం వేలాది సాధుసన్యాసులు తపమాచరించి తరించిన పవిత్రక్షేత్రం. నిరంతర యజ్ఞాలవల్ల పవిత్రమైన యజ్ఞభూమిగా ప్రసిద్ధి చెందింది ఈ క్షేత్రం. వేదవ్యాసుడు ఈ క్షేత్రంలోనే మహాభారతాన్ని రచించినట్లు పెద్దలు చెబుతారు. వేదవ్యాసుడు అన్నిపురాణాలను తన శిష్యులకు బోధించిన పరమపావనప్రదేశం ఈ నైమిశారణ్యం. 108 వైష్ణవదివ్యదేశాల్లో ఒకటి నైమిశారణ్యం.

సర్వతీర్థాల్లో అత్యంతపవిత్రమై, పాపపరిహారికమై శివునికి ప్రీతికరమైనది నైమిశక్షేత్రం. త్రిమూర్తులు, ఇంద్రాదిదేవతలు, మునిసిద్ధగణములు ఇక్కడే నివసిస్తూ లోకరక్షణ చేస్తూండేవారట. అనిమిషులైన దేవతలు నివసించటంవల్ల ఈ ప్రాంతానికి నైమిషమని పేరొచ్చింది. దేవతలు నడయాడిన ఈ ప్రదేశంలో ప్రతీచోట దేవత లుంటారని ప్రజలనమ్మకం.

నేమి అంటే చక్రపుఅంచు అని అర్థం. చక్రం అంచు ఆగినచోటు నైమిషం. ఈ ప్రదేశంలో కలిపురుషుడు కాలు పెట్టలేడు. కలికల్మషంలేని పవిత్రక్షేత్రం ఈ నైమిశారణ్యం. మహాభారతం, రామాయణం, శివ, వాయు, వరాహాదిపురాణాల్లో ఈ క్షేత్రమహిమలను తెలియజేసే వృత్తాంతాలనేకం ఉన్నాయి.

ఈ ప్రాంతం మొదట కీకారణ్యంగా ఉండేది. ద్వాపరయుగాంతంలో 88,000మంది ఋషులు బ్రహ్మదేవుని సమీపించి కలియుగం ప్రారంభం కాబోతున్నందున కలిపురుషుడు ప్రవేశించని పవిత్రప్రదేశాన్ని చూపించుమని కోరారు. తాము నిరాటంకంగా తపస్సుచేసుకోడానికి అనువైనప్రదేశం చూపిస్తే అక్కడే తపస్సు చేసుకుంటూ జీవితాలను సార్థకం చేసుకుంటామని ప్రార్థించారు. ఆ మునుల ప్రార్థనలలాలకించిన బ్రహ్మదేవుడు సుమనోమయచక్రమును సృష్టించి ఆ చక్రమే మునులతపస్సుకు అనువైనప్రదేశాన్ని చూపుతుందనీ, ఆ చక్రం ఆగినచోటే మునుల తపస్సుకు అనువైనప్రదేశమనీ చెప్పి ఆ చక్రాన్ని అలా దొర్లించాడు.

ఆ చక్రం అలా దొర్లుకొంటూ ముందుకు సాగుతూ ఉండగా మునులు, దానిని అనుసరించి వెళ్ళారు. ఆ చక్రం పదునాలుగులోకాలు తిరిగి భూలోకంలో ఈ ప్రాంతానికి వచ్చి ఇది భూలోకానికి కేంద్రస్థానమని తలచి అక్కడ ఆగి ఈ ప్రదేశం తపస్సులు, యజ్ఞయాగాదులు చేయడానికి అనువైనదని చెప్పి అక్కడే భూమిని తొలుచుకొంటూ భూమిలోనికి చొచ్చుకొని వెళ్ళుతూ $6\frac{1}{2}$ పాతాళాలు ఛేదించేసింది. ఇంక $\frac{1}{2}$ పాతాళం ఉండగా ఆ మహర్షులు భయపడి మళ్ళీ బ్రహ్మను వేడుకున్నారు. అప్పుడు బ్రహ్మ ఆదిశక్తిని రప్పించి ఆ చక్రభ్రమణాన్ని నిరోధించు మని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆ ఆదిశక్తి భువియందు ఉద్భవించి ఆ చక్రభ్రమణాన్ని నిరోధించింది. అలా బ్రహ్మ ఆదేశాను సారం భువియందుద్భవించిన ఆదిశక్తి రూపమే శ్రీలలితాదేవిరూపం. ఇది పర మాత్మకు మూలమైన జ్యోతిరూపమని, ఇదే సర్వప్రపంచప్రకాశమునకు మూలమని చెప్పబడింది.





రాతిపైన గీతలాగా మూర్ఖునియందు శతృత్వం చిరకాలముంటుంది

## చక్రతీర్థం

అలా ఆ చక్రం వచ్చి ఆగిన ఆ పుణ్య భూమియే నైమిశారణ్యం. ఆ చక్రంచే తొలచ బడిన ఆ సొరంగం ఒక జలాశయంలా ఏర్ప డింది. అదే చక్రతీర్థం. ఈ తీర్థానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ప్రపంచంలోని సర్వతీర్థాలు, నదులు, సముద్రాలు ఈ క్షేత్రానికి వచ్చి ఈ చక్రతీర్థంలో నిమేషకాలం ఉండి సర్వశక్తులు సంపాదించుకొనిపోతాయట. ఈ తీర్థంలో స్నానం, దానం, పూజలు చేసినవారికి సర్వ శుభాలు లభిస్తాయని భక్తులనమ్మకం. ఈ చక్ర తీర్థంలో స్నానం చేయడంవల్ల అన్ని రుగ్మతలూ తొలగిపోతాయని ప్రజలనమ్మకం. ఈ చక్ర తీర్థంలో స్నానం గ్రహణకాలంలో కురుక్షేత్రంలో స్నానంచేసినంత ఫలప్రదమని శివుడు పార్వతితో చెప్పినట్లు పురాణాలవాక్కు. నైమిశారణ్యంలో చేసిన ఒక్కదానం ఇతరప్రదేశాల్లో చేసిన లక్షదానాల ఫలితాన్నిస్తుందనికూడా పురాణాలమాట. ఈ చక్రతీర్థంలో స్నానమాచరించి దానాలు చేస్తే పదితరాల పితృ, మాతృవర్గాలవారు పాప విముక్తులై పుణ్యలోకాలు పొందుతారట.



ఈ చక్రతీర్థానికి మరో విశిష్టతకూడా ఉంది. ఈ తీర్థంలో అరటి పండ్లు, జామపండ్లు(ఏ పండ్లైనా) పువ్వులువంటివి వేస్తే, అందులో అవి తేలితే అవి వేసినవారికి మంచివ్యక్తిత్వం, గొప్పగుణాలు ఉన్నట్లుగానూ; అవి తేలకుండా మునిగిపోతే వారికి మంచివ్యక్తిత్వంగాని, మంచిగుణాలుగాని లేనట్లుగానూ ప్రజల్లో ఒకనమ్మకం ఉంది. అందువల్ల ఇక్కడకు వచ్చిన వారందరూ ఈతీర్థం నీటిలో పువ్వులు, పండ్లు వేసి వారి వ్యక్తిత్వం పరీక్షించుకొంటూ ఉంటారు.

## పంచపాండవుల మందిరం

పంచపాండవులు ఈ నైమిశారణ్యంలో తపస్సు చేసినందుకు గుర్తుగా ఇక్కడ పాండవులమందిరం నిర్మించబడింది. పాండవులు ఈ అరణ్యంలో పన్నెండుసంవత్సరాలు తపస్సుచేశారు. ఆ కాలంలో వారు అమావాస్యరోజున ఇక్కడ గోమతీనదిలో స్నానం చేయాలని కోరుకున్నారు. కానీ ఆ పన్నెండు సంవత్సరాల్లోనూ అమావాస్యే రాలేదట. అందుకని వారు కలియుగంలో 30రోజులకొకమారు అమావాస్యరావాలని, ఆ రోజున ప్రజలు ఆ నదిలో స్నానంచేసి పునీతులవ్వాలని నియమం చేశారు. అందువల్లనే ఉత్తరభారత దేశంలో ప్రతి అమావాస్యకు, సంక్రమణము, గ్రహణములు సంభవించి నప్పుడు, సర్వపర్వరోజుల్లోనూ ఎక్కువసంఖ్యలో భక్తులు తమ సమీపంలో ఉన్న నదుల్లో, సముద్రాల్లో, తటాకాల్లో స్నానమాచరిస్తూ ఉంటారు, పంచపాండవుల విగ్రహాలను ఇక్కడ దర్శించవచ్చు. ధర్మరాజుకు సూర్యభగవానుడు అక్షయ పాత్రను ప్రసాదించిందికూడా ఇక్కడే.

## దేవరాజన్‌మందిరం

ఈ నైమిశారణ్యక్షేత్రానికి క్షేత్రపాలకుడు శ్రీవేంకటేశ్వరస్వామి. అందుకే ఇక్కడ ప్రధానాలయం శ్రీవేంకటేశ్వరాలయం. క్షేత్రపాలకుణ్ణి, మూలవిరాట్టును ఇక్కడ దేవరాజన్ అంటారు. ఈ స్వామివిగ్రహం నల్లనివిగ్రహం. బంగారు ఆభరణాలతో ఎంతో మనోహరంగా ఉంటుంది. ఈ ఆలయంలోని అమ్మవారు పుండరీకవల్లి. ఈ స్వామి, అమ్మవార్లు ఇక్కడ పూజలందుకొంటూ భక్తులను కటాక్షిస్తూ ఉంటారు. ఇది చాలా పురాతనాలయం. ఇదిగాక కొత్తగా దక్షిణాది దేవాలయనిర్మాణపద్ధతిలో మరో వేంకటేశ్వరాలయంకూడా నిర్మించబడి ఉంది.

ఈ చక్రతీర్థంలో స్నానంచేసి దానంచేస్తే పదితరాల పితృ, మాతృవర్గాల వారు పాపవిముక్తులై పుణ్యలోకాలు పొందుతారని భక్తుల విశ్వాసం.

భగవద్గీత సందేశం

# త్రికరణశుద్ధితో సాధించలేనిది లేదు!!

- శ్రీ యం.రవితేజ

**అనన్యాశ్చిన్తయంతోమాం**
**యేజనాః పర్యుపాసతే !**
**తేషాం నిత్యాభియుక్తానాం**
**యోగక్షేమం వహామ్యహమ్ !! (9-22)**

"ఇతరమైన ఆలోచనలు మాని నిత్యమూ తనను తానే నమ్ముకుని తన స్వీయఆత్మధ్యానంలోనే గడిపే భక్తుల యోగ క్షేమాలను నేనే చూసుకుంటాను" అన్నాడు భగవానుడు గీతలో.

భగవంతుడంటే ఎక్కడోలేదు. మనం చేసే ప్రతిపనిలో భగవంతుడున్నాడు అని తెలుసుకోవాలి. విద్యార్థికి తన చదువులో, ఉద్యోగికి తనవృత్తిలో, ప్రతిఒక్కరు తాము చేసే పనిని భగవత్స్వరూపంగా భావించి త్రికరణశుద్ధిగా పనిచేయాలి అన్నదే గీతాసందేశం. ఎవరైతే మనోవాక్కాయకర్మలను కేంద్రీకృతంచేసి శ్రద్ధతో, భక్తితో కార్యనిర్వహణ చేయడమన్నదే భగవానుడి గీతోపదేశం. అలా త్రికరణ శుద్ధితో పనులు చేయగలిగితే తప్పకుండా సత్ఫలితం చేకూరుతుంది.



నేడు యువతలో అటువంటి ఏకాగ్రత లోపించింది. అంతర్జాలం, చర వాణి, చలనచిత్రాలు, ఇతరమైన వ్యామోహాలు మొదలైన లౌకికమాయాజాలం ఉచ్చులలో పడిపోయి చేసేపనిమీద శ్రద్ధ లోపించింది. అందువల్లే యువత అనేక కష్టనిష్టూరాలకు లోను కావలసివస్తోంది. శ్రద్ధాభక్తులతోచేసే పనివల్ల తప్పక ఫలితాన్ని పొందగలుగుతాం. త్రికరణశుద్ధిగా భగవంతుని సేవిస్తే అంతే గొప్పఫలితాన్ని పొందగలమని ఈ శ్లోకం మనకు చెప్తోంది.

మహాభారతంలో అర్జునుని విద్యాసముపార్జనమే దీనికి ఉదాహరణం. కౌరవులకు, పాండవులకు గురువు ద్రోణాచార్యుల వారు. శిష్యుల ఏకాగ్రత, చిత్తశుద్ధి, శ్రద్ధ, లక్ష్యశుద్ధులను పరీక్షింపగోరి ధనుర్విద్యాబోధనసమయంలో వారికి ఒక పరీక్షను పెట్టాడు. ఒకవృక్షం అగ్రభాగంలో ఒకపక్షిబొమ్మను నిలబెట్టి దానికంటిని బాణంతో ఛేదించుమన్నాడు. ముందుగా ధర్మరాజుతో ప్రారంభించి అందరిని వృక్షంపైన ఏమి కనిపిస్తోం దని అడిగాడు. అప్పుడు వారందరూ వృక్షం, కొమ్మలు, ఆకులు, పక్షి, పక్షికన్ను అన్నీ కనిపిస్తున్నాయన్నారు. కాని ఒక్క అర్జునుడు మాత్రం తనకు పక్షికన్నుతప్ప మరేమీ కనిపించలేదన్నాడు.

ఐతే, శరసంధానం చెయ్యమన్నాడు ద్రోణుడు. అర్జునుడు లక్ష్యభేదనం చేశాడు. అదీ ఏకాగ్రత, చిత్తశుద్ధి, శ్రద్ధ అంటే. ఏమనిషికైనా కావలసింది అవేకదా!

ఈ విషయమే భగవానుడు కురుక్షేత్రయుద్ధసమయంలో అర్జునునకు చేసిన గీతాశ్లోకసారాంశం. అందుకే భగవద్గీత అంటే ఒక ఆధ్యాత్మికగ్రంథంకన్నా వ్యక్తిత్వవికాసగ్రంథం అని పండితాభిప్రాయం. గీతలో చెప్పని విషయం లేదు.

గీతను చదివితే మానవుని జీవనవిధానంలో వచ్చే ఒడుదుడుకులను తట్టుకుని నిలబడవచ్చని మనకు తెలుస్తోంది.

అందుకే మహాభారతంలో భగవానుడు అర్జునునకు బోధించిన "గీత" సర్వమానవాళికి ఆదర్శప్రాయం, అనుసర ణీయం, ఆచరణీయమైనగ్రంథంగా చెప్పవచ్చు.



యువత

# రక్షాబంధన్ యువతకు స్ఫూర్తి

- డా॥ మైలవరపు లలితకుమారి, 99595 10422

"అమ్మ ప్రాణంపోస్తే
నాన్న జీవితాన్నిస్తే
అన్న రక్షాబంధన్‌తో
జీవితాంతం రక్షిస్తాడు"

30-08-2023న రాఖీపండుగ సందర్భంగా...

శ్రావణమాసంలో వచ్చే పూర్ణిమను రాఖీ అని రక్షా బంధన్, జంధ్యాలపూర్ణిమ అని పిలుస్తారు. అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళమధ్యగల ప్రేమానురాగాలకు సూచనగా ఈ పండుగను జరుపుకుంటారు. రాఖీ అంటే రక్షణబంధం అని అర్థం. ఇది సోదరసోదరీమణులు జరుపుకునే ఒక మహత్తరమైన పండుగగా పేర్కొంటారు. ఈ పండుగను ఉత్తరహిందూస్థానంలో ప్రతి ఒక్కరూ జరుపుకుంటారు. జంధ్యాలను ధరించే మగవారు తమ పాత జంధ్యాలను తీసివేసి, గాయత్రీపూజ చేసుకొని మరలా క్రొత్తజంధ్యాన్ని ధరించటం ఒక ఆచారం. అంతేకాక క్రొత్తగా ఉపనయనం అయిన వటువుకు ఉపాకర్మ అని, ముంజవిడుపు అనుపేర కలాపమును నిర్వర్తిస్తారు. ఆరోజున వటువుచేత గాయత్రిపూజ, అగ్నిహోత్రం చేయించి క్రొత్త జంధ్యాన్ని ధరింప జేస్తారు.

రాఖీ ఈనాటి ఆచారం కాదు. అనాదినుంచి ఉన్న సంప్రదాయం. దేవతలకు, రాక్షసులకు మధ్యన పుష్కరకాలం యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఓడిపోయిన దేవేంద్రుడు తన పరివారంతో కలిసి అమరావతీనగరంలో దాక్కున్నాడు. రాక్షస రాజు అమరావతిని వశం చేసుకోబోతున్నాడని తెలుసుకున్న శచీదేవి భర్తకు సమరోత్సాహాన్ని కలిగించి, విజయం లభింప చేయటానికి లక్ష్మీనారాయణులను, పార్వతీపరమేశ్వరులను పూజించి, వారి అనుగ్రహంవలన ఇంద్రుడు విజయాన్ని పొంద గలడని పలుకుతూ భర్తచేతికి రక్ష కట్టినట్లుగా భవిష్యపురాణం పేర్కొంటున్నది. ఇంద్రాణి మాత్రమేకాక దేవతలందరూ ఇంద్రు నికి రక్షకట్టారు. ఆమె ఆ రక్ష కట్టినరోజు శ్రావణపౌర్ణమి. ఆ విధంగా శచీదేవి రక్ష కట్టినరోజు కనుక ఆ రోజు రక్షా బంధన్‌గా ప్రశస్తి పొందింది. భర్తకు ఆపద కలుగుతుందని తెలిసి రక్ష కట్టి భర్తను కాపాడుకొన్నది ఇంద్రాణి. మన సంప్ర దాయాలను తెలుసుకొని గౌరవిస్తే ప్రతిఒక్కరూ ఆనంద మయజీవితాలను గడపవచ్చు.

మహావిష్ణువు దేవతలను రక్షించటానికి వామనావ తారంలో అవతరించాడు. బలి చేస్తున్న యజ్ఞానికి వెళ్ళి మూడ డుగులనేలను దానంగా పొందాడు. ఆ మూడడుగులు గ్రహిం చిన వామనుడు

ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీధిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటి పై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

అన్నట్లుగా పెరిగి ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో ఆకాశమును కప్పివేసి మూడవఅడుగు బలిశిరస్సుపై ఉంచి బలిని పాతాళానికి పంపేశాడు. అప్పుడు విష్ణుభక్తుడైన బలి కోరికమేరకు మహావిష్ణువు వైకుంఠమును వీడి పాతాళం లోనే ఉన్నాడు. అపుడు శ్రీమహాలక్ష్మి పాతాళానికి వెళ్ళి బలి చక్రవర్తికి రక్షాబంధనం కట్టి భర్తను వైకుంఠానికి తీసుకువెళ్ళింది.

యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః ।
తేనత్వా మభిబధ్నామి రక్షే మా చల మా చల ॥

అను శ్లోకాన్ని పఠిస్తూ రక్షాబంధాన్ని ధరిస్తారు. అంతే కాక త్రేతాయుగంలో పితృవాక్యపరిపాలనకై శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణసమేతుడై అడవులకు వెళ్ళినపుడు కౌసల్య శ్రీరామ చంద్రునికి-



**"ఓషధీంచాపి సిద్ధార్థాం విశల్యకరణీం శుభామ్"** అని శుభాలు కలగాలని రక్ష కట్టింది. అదీ తల్లిప్రేమ. పుత్రుని క్షేమాన్ని కాంక్షిస్తూ రక్ష కట్టింది తల్లి. రక్షకట్టడం అనేది తల్లి కుమారునిక్షేమాన్ని కాంక్షించటమే కాదు, రామచంద్రుడు తల్లి కోసం అహర్నిశలు ఆలోచించాడు. వనవాసంనుండి తిరిగి వచ్చి తన తల్లులు ముగ్గురికి నమస్కరించి వారి ఆశీస్సులందు కోవటమే కాదు ఆ తరువాత తల్లిమాటను జవదాటలేదు కూడా.

ఇక ద్వాపరయుగంలో ద్రౌపది శ్రీకృష్ణులది అన్నా చెల్లెళ్ళ అనుబంధం. రాజసూయయాగసమయంలో శిశుపాల వధాసమయాన శ్రీకృష్ణుడు సుదర్శనచక్రాన్ని ప్రయోగించాడు. ఆ చక్రపురాపిడికి కృష్ణునివేలుకి గాయమై రక్తం వచ్చింది. అదిచూసిన ద్రౌపది తన చీరకొంగును చించి వేలికి కట్టుకట్టింది. ఆ తరువాత సభాపర్వంలో ద్రౌపదీవస్త్రాపహరణసమయంలో ఆమెకు అక్షయవలువలనిచ్చి దుశ్శాసనుని దురాగతంనుండి రక్షించాడు కృష్ణుడు. పరమాత్మ వేలికి కట్టిన కట్టే ఆమెకి రక్షాబంధన్‌గా మారి ఆమె రక్షణకు కంకణం కట్టు కున్నాడు. అదీ సోదరబంధం.

యుగాలుమారినా, కాలాలుమారినా, తరాలు మారినా రక్షాబంధన్ విలువ ఏనాడు మారలేదు. ఈ ఆధునికయుగంలో పెరిగిన సాంకేతికతతో యువత రక్షాబంధన్ విలువలను మరచిపోతున్నారు. ఒకొరికొకరు రాఖీ కట్టుకుంటున్నారు, కట్టించుకుంటున్నారే కాని దాని పవిత్రతను కాపాడుకోలేకపోతున్నారు. కనుకనే బిడ్డలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. పేగుతెంచుకుపుట్టిన బిడ్డలను ఎన్నోఆశలతో పెంచితే రెక్కలొచ్చి ఎగిరి పోతున్నారు. కాని రెక్కలొచ్చాక తల్లి దాస్యవిముక్తికై దేవేంద్రుని ఎదిరించిన గరుత్మంతుడిలాగా, తల్లికోసం తిరిగివచ్చిన శ్రీరామచంద్రుడిలాగా, పెంచి పెద్దచేసిన యశోదమ్మకు ఆనందాన్ని మిగిల్చిన శ్రీకృష్ణుడిలాగా యువత ఉండాలి. ఆధునికయువత ఈ ధర్మాన్ని విస్మ రించకుండా, బాధ్యతలను మరచిపోకుండా పెద్దలకు ప్రేమలను పంచాలి.

స్త్రీపురుషులిరువురిలో సోదరప్రేమ పెల్లుబుకాలి. అదే రక్షాబంధన్‌లో దాగిఉన్న సత్యం. ఆ సత్యాన్ని గుండెల్లో నింపుకున్నప్పుడు దేశభవిత ఉజ్జ్వలంగా ప్రకాశి స్తుంది. సత్సంబంధాలకు ఈ పండుగ స్ఫూర్తిదాయకమైనది. మానవసంబంధాలే సుఖశాంతులకు మూలమని భారతీయుల నమ్మకం. భారతదేశంలో గల పటిష్టమైన కుటుంబవ్యవస్థే అందుకు మూలమని విదేశీయులుకూడా సమర్థించారు. ఆ సంబంధాలను నిలుపుకోవటానికే పూర్వీకులైన మన ఋషులు అనేక సంప్రదాయాలను, పండుగలను, ఉత్సవాలను మనకు అందించారు.

పరస్త్రీని తల్లిగా, సోదరిగా భావించే సంస్కృతి మనది. ఈ సంస్కృతిని పటిష్ఠంగా నిలుపుకోవటానికి, యువతలో ఆ స్ఫూర్తిని నింపటానికి ఈ రాఖీపండుగే నిదర్శనం. యువత ఏ పనిచేసినా మనసుతో ఆలోచించి, బాధ్యతతో నడుచుకోవా లన్నదే "రక్షాబంధనం" ప్రధానోద్దేశ్యం.


నిపుణత, విశ్వాసం ఉన్న వారికి అపజయాలు ఎదురుకావు



# శ్రీనివాస చతుర్వేద హవనం

యజ్ఞం లేదా యాగం ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. పురాణ కాలంనుంచి భారతదేశంలో ఈ యజ్ఞక్రతువుని నిర్వహిస్తూనే ఉన్నారు. ఆయా దేవతలను తృప్తిపరచడానికి కొన్ని వస్తువులను అగ్నికి ఆహుతివ్వడమే యజ్ఞం. ఈ యజ్ఞాన్ని యాగం, క్రతువు, హవనం అనికూడా అంటారు. ఈ యజ్ఞానికి అనుబంధంగా అనేక నియమ, సంప్రదాయాలు ఉన్నాయి. ఈ యజ్ఞయాగాలను మన పూర్వీకులు నిర్వహించడంవెనుక అనేక శాస్త్రీయకారణాలున్నాయి. ప్రస్తుతకాలంలో ఎక్కువమంది అనేకసమస్యలతో సతమతమవుతూ, మనశ్శాంతికోసం అనేకప్రాంతాలు తిరుగుతూంటారు. ఐతే, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు, యోగా, శారీరకశ్రమ, ఆరోగ్యకరమైనజీవనశైలివంటి అనేకాంశాలు ఆరోగ్యకరమైన జీవితానికి చాలా సహాయకారిగా ఉంటాయి. ఐతే మరొక ఎంపిక యాగం. ఈ యాగం చేసేసమయంలో మంత్రాలను పఠించడంవల్ల అన్నింటా మంచి జరుగుతుంది.

లోకకల్యాణార్థం తిరుపతిలో తి.తి.దే. పరిపాలనాభవనప్రాంగణమైదానంలో 29-06-2023నుండి 05-07-2023 వరకు **శ్రీనివాస చతుర్వేద హవనం** శాస్త్రోక్తంగా, వేదమంత్రాలతో అంగరంగవైభవంగా జరిగింది. ఈ యాగాన్ని తి.తి.దే. శ్రీవేంకటేశ్వర ఉన్నత వేదాధ్యయనసంస్థ, హిందూధార్మికసంస్థలు కలిసి నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో 32మంది ఋత్త్విక్కులు కలశస్థాపన, కలశ ఆవాహనం అనంతరం యజమాని సంకల్పం, యజమానిపూజ, భక్తసంకల్పం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నాలుగువేదాల్లోని మంత్రాలతో హవనం చేశారు.

ఈ హవనంలో సృష్టిలోని సకలజీవరాశులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేలా స్వామివారిని ప్రార్థిస్తూ నాలుగు వేదాల్లోని మంత్రాలు పఠించారు. ఈ విధంగా చేసి దేవతలకు ఆహుతులను ఇవ్వడంద్వారా సత్ఫలితం సిద్ధిస్తుందని వేదవాక్కు.

సాక్షాత్తు బ్రహ్మదేవుడు సృష్టించిన వేదాలహవనంవల్ల మానవుడు ధర్మమార్గంలో నడవడానికి ఇవి మార్గదర్శకాలౌతాయి. భగవంతుడు సృష్టించిన వేదాలు కేవలం వినబడ్డాయని, ఆ తర్వాత గురుశిష్యపరంపరద్వారా అవి వ్యాప్తి చెందుతూ వచ్చాయని ఆధ్యాత్మికవేత్తలమాట.

లింగపురాణం, కాశీపురాణం, వరాహపురాణంకూడా లోకకల్యాణార్థం ఈవిధమైన యాగాలు నిర్వహించాలంటూ తెల్పి ఉన్నాయి. ఈ హవనం దేశప్రజలకు స్వస్తి, శ్రద్ధ, మేధ, కీర్తి, ప్రజ్ఞాశక్తిని అందిస్తాయని పురాణాలవాక్కు.

ఈ కోవలో తి.తి.దే. వారి ఆధ్వర్యంలో ఎన్నోయాగాలు నిర్వహింపబడ్డాయి. అందులో **శ్రీనివాస చతుర్వేద హవనం** అనేది నిర్వహించబడింది. ఈ యాగానికి ఎక్కడెక్కడినుండో భక్తులంతా విచ్చేసి స్వామివారికృపకు పాత్రులయ్యారు.

లోకాః సమస్తా స్సుఖినోభవంతు

శ్రీ శ్రీనివాసార్పణమస్తు



తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనాభవన ప్రాంగణ మైదానం(తిరుపతి)లో
29-06-2023 నుండి 05-07-2023 వరకు జరిగిన
**శ్రీనివాస చతుర్వేద హవనం** కార్యక్రమంలో పాల్గొన్న
తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్. దంపతులు,
తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి (విద్య & వైద్యం) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.,
సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,
వేదపండితులు, అర్చకులు మరియు భక్తులు














తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి పరిపాలనాభవనం ప్రాంగణం మైదానంలో జరిగిన
**శ్రీనివాస చతుర్వేద హవనం** కార్యక్రమాల సందర్భంగా
తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచారపరిషత్తువారిచే ప్రదర్శించబడిన
వివిధ ధార్మిక కార్యక్రమాలలో పాల్గొన్న తి.తి.దే. అధికారులు, ఉద్యోగులు మరియు అసంఖ్యాక భక్తులు.



















తిరుమల శ్రీవారిని 22-06-2023న దర్శించిన దేశ అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీ వి.రామసుబ్రమణియన్ దంపతులను తిరుమల శ్రీవారి చిత్రపటం మరియు ప్రసాదాలతో సత్కరిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి.





నవీముంబైలో తి.తి.దే. నూతనంగా నిర్మించదలచుకున్న శ్రీబాలాజీ ఆలయ నూతన నిర్మాణానికి 07-06-2023న శాస్త్రోక్తంగా భూమిపూజ జరిగింది. ఇందులో మహారాష్ట్రముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ శంబాజీ షిండే, ఉపముఖ్యమంత్రి శ్రీ దేవేందర్ ఫడ్నవీస్, రేమండ్స్ గ్రూప్ సి.ఎం.డి. శ్రీ గౌతమ్‌హరిసింఘానియా, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాద నివారణార్థం తి.తి.దే. మహాశాంతిహోమాన్ని తిరుమల మొదటిఘాట్‌రోడ్డు, ఏడవమైలువద్ద ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద 14-06-2023న నిర్వహించింది. ఇందులో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్. పాల్గొన్నారు.





శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞానసంస్థ (స్విమ్స్), తిరుపతి నూతన డైరెక్టర్‌గా 30-06-2023న పదవీబాధ్యతలు స్వీకరించిన తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (విద్య & వైద్యం) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.,

# వరాలనిచ్చే.. వరలక్ష్మీపూజ

- డా॥ కడప లలిత,
94408 86535

వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యామభయప్రదాం మణిగణైర్నానావిధైః భూషితామ్ ।
భక్తాభీష్టఫలప్రదాం హరిహర బ్రహ్మాదిభిస్సేవితాం
పార్శ్వే పంకజశంఖపద్మనిధిభిర్యుక్తాం సదాశక్తిభిః ॥

అని ప్రతినిత్యము లక్ష్మీదేవిని ప్రార్థనచేస్తే సంపదలు ఇంట కొలువై ఉంటాయని భక్తులవిశ్వాసం. తెలుగువారికి ఉగాదినుండి పండుగలు ప్రారంభమౌతాయి. శ్రీరామనవమి తరువాత శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతం అత్యంత శ్రేష్ఠ మైన పండుగ. స్త్రీలకు సౌభాగ్యప్రదాయిని. ఉత్తరాయణంలో వరలక్ష్మీవ్రతం చేసుకోవడం అత్యంత శుభదాయకం.

ప్రతి శుక్రవారం శ్రేష్ఠమయిందే కానీ, శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం అయిన శ్రవణనక్షత్రంపేరుతో వచ్చే శ్రావణ మాసంలో పౌర్ణమిముందు వచ్చే శుక్రవారం అత్యంత విశిష్ట మైనది. ఆ రోజున కుదరనివారు ఆ మాసంలో ఏ శుక్రవారం నాడైనా వరలక్ష్మీదేవిని పూజించవచ్చు.

భక్తితోనే వేడుకుంటే కోరిన వరాలను ప్రసాదించే కల్పవల్లి వరమహాలక్ష్మీదేవి. 'వర' అంటే శ్రేష్ఠమైన అని అర్థం. శ్రీమహావిష్ణువు దేవేరి అయిన లక్ష్మీదేవి అష్టావతారాల్లో వరలక్ష్మి ఒకరు. ఈ వ్రతాచరణకు పెద్దగా నియమాలు, నిష్ఠలు అవసరం లేదు. నిర్మలమైన మనస్సు, నిశ్చలమైన భక్తి, ఏకాగ్రత ఉంటే చాలు. లక్ష్మీదేవి కృపాకటాక్షాలు కలిగి సంపద, సౌభాగ్యం కలుగుతాయి. దీర్ఘసుమంగళీత్వంతో జీవిస్తారని భక్తుల విశ్వాసం. సంపదలు అంటే ధనం మాత్రమే కాదు. పాడి, పంట, జ్ఞాన, విద్యాదులన్నీ సంపదలు అనే అర్థాన్నిస్తాయి. ఈ వ్రతమును వర్ణ వివక్షత, ధనికా పేద భేదంలేకుండా స్త్రీలందరూ చేసుకోవచ్చు.

25-08-2023న
**వరలక్ష్మీవ్రతం**
సందర్భంగా...



ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారంనాడు ఇంటిని శుభ్రం చేసుకుని ఈశాన్యాన మండపారాధన చేసి లక్ష్మీదేవి పటమునుగాని, రూపునుగానీ ఉంచాలి. ముందుగా గణపతిఆరాధన చేసి తరువాత అర్ఘ్య, పాద్య, ఆచమన, ఆభరణ, వస్త్ర, కుంకుమ, చందన, ధూపాది షోడశోపచారాలతో వరలక్ష్మీదేవిని పూజించాలి. ఆ తరువాత పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన **"చారుమతికథ"**ను చదువుకోవాలి.

మగధదేశంలో కుండిననగరంలో చారుమతి అనే బ్రాహ్మణస్త్రీ ఉండేది. ఆమె సాధుశీలి. వినయవిధేయతలు, భక్తిగౌరవాలు కలిగిన ఇల్లాలు. భర్త, అత్తమామలను సేవించే పుణ్యచరిత. ఒకనాటి తెల్లవారుజామున వరలక్ష్మీదేవి ఆమెకు కలలో

సాక్షాత్కరించి, శ్రావణమాసాన వచ్చే శుక్రవారంనాడు నన్ను పూజిస్తే సకలసౌభాగ్యాలు కలుగుతాయని చెప్పింది. అంత ఆమె తాను ఒక్కతిగా మాత్రమేగాక తోటివారందరికీ ఆ లక్ష్మీ సౌభాగ్యం కలిగించాలనుకున్నది. నిస్వార్థమైనమనసుతో తన తోటివారందరికీ లక్ష్మీదేవి తనకు కలలో చెప్పిన మాటను చెప్పింది. అంత వారందరూ ఆమె చెప్పినమాటకు సరేనని ఆమె చెప్పినట్లుగా శ్రావణశుక్రవారం వరలక్ష్మీపూజ చేసుకొని సకలసౌభాగ్య, ఐశ్వర్య సంపదలను పొంది ధన్యులయ్యారు.

ఐతే ఈ వ్రతాచరణంలో ఒక ప్రత్యేకత ఉంది. తొమ్మిది పోగులతో చేసిన, తొమ్మిదిముడులతో నిండిన తోరమును కుడి చేతికి ధరించాలి. తొమ్మిది అంటే 'నవ' అని కదా పరమార్థం. 'నవ' అంటే నూతనం, శ్రేష్ఠం అని అర్థం. తోరమును సిద్ధం చేసి అమ్మవారిని నవనామములతో పూజించి చేతికి ధరించాలి. తొమ్మిదిరకాల పిండివంటలు ఆ తల్లికి నివేదన చేయాలి. ఈ కథను కాత్యాయనీకోరికమేరకు పరమేశ్వరుడు పార్వతిదేవికి బోధించినట్లుగా స్కాందపురాణంలో ఉంది.

ఈ వరలక్ష్మీవ్రతమును స్త్రీలందరూ భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. కానీ, తిరుచానూరు శ్రీపద్మావతీదేవిఆలయంలో మాత్రం ఒక ప్రత్యేకమైనపద్ధతిలో వరలక్ష్మీవ్రతాచరణం చేయ బడుతుంది. తిరుచానూరులో వరలక్ష్మీవ్రతం వైభవోపేతంగా, సామూహికంగా నిర్వహించబడుతుంది. ఆ రోజు అమ్మవారిని సుప్రభాతసేవతో మేలుకొలుపుతారు. పద్మావతీదేవి ఆలయ



ఆస్థానమండపంలో అమ్మవారిని బంగారుచీరతో అలంకరిస్తారు. అమ్మవారిని తొమ్మిదిగ్రంథులతోకూడిన నూలుపోగులతో ఆరాధిస్తారు. ఇందులో ఒక్కొక్కపోగు ఒక్కొక్కదేవతకు గుర్తుగా భావనచేసి పూజిస్తారు. ఈ పండుగనాటి ఆచారాలు ఆలయం లోని ఇతర సాధారణఆచారాలకంటే భిన్నంగా ఉంటాయి.

తిరుచానూరుఆలయంలో వరలక్ష్మీవ్రతంరోజున లక్ష్మీ దేవిని ఎనిమిదిరూపాలలో పూజించటం ఇక్కడి విశిష్టత. అవే భాగ్యలక్ష్మి, విద్యాలక్ష్మి, భూలక్ష్మి, ప్రీతిలక్ష్మి, కీర్తిలక్ష్మి, శాంతి లక్ష్మి, తుష్టిలక్ష్మి, పుష్టిలక్ష్మి అనుపేర్లతో అష్టలక్ష్ములను ఏర్పాటు చేసి అర్చిస్తారు. ఇలా అర్చించినందువల్ల దేశం సుభిక్షంగా ఉంటుందని భక్తులనమ్మకం.

ఈనాటి వ్రతంలో స్త్రీలందరూ పాలుపంచుకుని వర లక్ష్మీదేవికృపకు పాత్రులవుతారు. మనం గృహంలో పూజ చేసుకునేదానికన్నా సామూహికంగా చేసుకునేదానిలో ఫలిత మెక్కువని పండితవాక్కు. మనక్షేమంమాత్రమేకాక సమస్తజాతి క్షేమం, దేశశ్రేయస్సుకోసంకూడా అనే సంకల్పంతో ఈ పూజ నిర్వహిస్తారు. పూజావిధి పూర్తిఅయినతరువాత స్కాంద పురాణాంతర్గతకథ భక్తులకు వినిపిస్తారు పండితులు. భవిష్యోత్తర పురాణంలోకూడా ఈ కథ మనకి కనిపిస్తుంది. ఏ పురాణంలో చెప్పినా, ఎవరుచెప్పినా ఆ తల్లిని త్రికరణశుద్ధితో అర్చిస్తే సకలసౌభాగ్యాలతో విలసిల్లగలమని భక్తులవిశ్వాసం.

తిరుచానూరులో వరలక్ష్మీవ్రతం సాయంసమయంలో శ్రీపద్మావతీదేవిని బంగారురథంపై ఆలయంచుట్టూ, పవిత్రమైన ఆలయవీథుల్లో ఊరేగింపు చేస్తారు. ఆ సమయాన భక్తులందరూ బయటికివచ్చి అమ్మవారిని దర్శించుకొని హారతులర్పిస్తారు. వేదపండితులు వేదస్తోత్రాలను పఠనం చేస్తుండగా, నృత్య, గాన, సంగీత, వాయిద్యసేవలతో పద్మావతీదేవి ఊరేగింపు మంగళకరంగా సాగుతుంది.

తిరుచానూరులో అంగరంగవైభవంగా జరిగే ఈ వర లక్ష్మీవ్రతఉత్సవం భక్తుల కోరికలను ఈడేర్చి ఆనందాలను చేకూరుస్తుంది.

పద్మాసన స్థితే దేవి పరబ్రహ్మ స్వరూపిణీ ।
పరమేశి జగన్మాతః మహాలక్ష్మీ నమోస్తు తే ॥

# నాగలక్ష్మి ఉలూచి

- శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి,
82775 32959

'ఉలూచి' ఒక నాగకన్యక. పాతాళలోకంలోని నాగ రాజైన ఐరవకౌరవ్యుని పుత్రిక. ఒకనాడు అర్జునుడు తీర్థ యాత్రలు చేస్తూ, గంగానదీతీరానికి వెళ్లాడు. గంగానదిలో ఆయన స్నానం చేస్తూండగా, అదేసమయంలో 'ఉలూచి' తన చెలికత్తెలతో జలవిహారానికి వచ్చింది. అర్జునుణ్ణి చూచి ఆమె ఆకర్షితురాలైంది. తనను వివాహం చేసుకొమ్మని కోరింది. అర్జునుడు అందుకు నిరాకరించాడు. అందుకు 'ఉలూచి' అతణ్ణి బంధించి నాగలోకానికి తీసుకెళ్లింది. 'ఉలూచి' ఒక మానవుని ఇష్టపడటాన్ని, ఇష్టపడలేదు ఐరవకౌరవ్యుడు. అర్జునుణ్ణి హత మార్చబోయాడు. అప్పుడు 'ఉలూచి' అర్జునుణ్ణి నరకజ్వాలల నుంచి కాపాడి రక్షించింది. 'ఉలూచి' చేసిన ఉపకారానికి, ఆమె తనపై చూపిన ప్రేమాభిమానాలకు అర్జునుడు తలవొగ్గి ఆమెను వివాహమాడాడు. వివాహమైన తరువాత అర్జునుడు 'ఉలూచి'తో కొంతకాలం గడిపాడు. తర్వాత తన తీర్థయాత్రలను కొన సాగించాడు. అప్పుడు 'ఉలూచి' అర్జునుడికి నీటిజంతువుల నుండి ఆపద కలుగకుండా ఉండేట్లు వరమిచ్చి పంపింది.

అర్జునుడు పయనమై వెళుతూ ఈశాన్యభారతంలోని మణిపురరాజ్యాన్ని చేరుకున్నాడు. ఆ రాజవంశీకులకు ఒక సంతానం మాత్రమే ఉంటుంది అని 'మహాదేవుని' వరం ఉంది. అర్జునుడు చేరుకున్నసమయానికి చిత్రవాహనుడు మణిపురాన్ని పరిపాలిస్తున్నాడు. 'చిత్రాంగద' అతని కుమార్తె, ఏకైక వారసురాలు. ఈమె క్షాత్రవిద్యల్లో ఆరితేరినది మరియు సౌందర్యవతి. ఆమెయే కాబోయే రాజ్యాధిపతి. ఆమె యుద్ధ కౌశల్యానికి మెచ్చిన అర్జునుడు, మణిపురమహారాజు షరతులకు అంగీకరించి, 'చిత్రాంగద'ను వివాహం చేసుకొన్నాడు. కొంత కాలానికి వారికి బభ్రువాహనుడు అనే ఒక కుమారుడు కలి గాడు. ఒప్పందంప్రకారం చిత్రాంగద, బభ్రువాహనులను మణి పురంలోనే వదలి అర్జునుడు వెళ్లిపోయాడు.

తరువాత జరిగిన కురుక్షేత్రయుద్ధంలో పాండవులు విజయం సాధించి, హస్తినాపురంలో పాండవరాజ్యాన్ని స్థాపిం చారు. ధర్మరాజు అశ్వమేధయాగం తలపెట్టాడు. యాగాశ్వం వెంట అర్జునుడు బయలుదేరి వెళ్లాడు.

అర్జునునికి, అతని పుత్రునివల్లనే మరణం సంభ విస్తుంది అనే ఒక శాపముంది. కురువంశపూర్వీకుడైన శంతన మహారాజు గంగాదేవిని వివాహమాడాడు. గంగాదేవి తమ సంతానమైన మొదటి ఏడుగురువసువులను ఆ నదియందే వదిలివేసింది. వీరి ఎనిమిదవసంతానమే అష్టమవసువైన భీష్ముడు. భీష్ముడు, మహాభారతయుద్ధంలో అర్జునుని బాణము నకు తీవ్రంగా గాయపడి అంపశయ్యను చేరుకున్నాడు. ఉత్తరా యణఘడియలు రాగానే మరణించాడు. భీష్మునిమరణం,



మిగిలిన సప్తవసువులకు మిక్కిలి దుఃఖం కలిగించింది. వారు గంగాదేవివద్దకు వెళ్ళి, భీష్ముని మరణవృత్తాంతాన్ని చెప్పారు. అది విని, ఆగ్రహం చెందిన గంగాదేవి, 'అర్జునుడుకూడా అతని పుత్రునిచేతనే మరణిస్తాడు అని శపించింది. ఆ శపించటాన్ని అదేసమయంలో, గంగానదిలో ఉన్న 'ఉలూచి' విన్నది. 'ఉలూచి' నాగలోకానికి తిరిగివెళ్ళి, తన తండ్రి ఐరవకౌర వ్యుడికి ఈ విషయం చెప్పి విలపించింది. ఆ సర్పరాజు గంగానదిని శాపవిమోచనమార్గాన్ని చెప్పుమని ప్రార్థించాడు.

అప్పుడు గంగాదేవి ప్రత్యక్షమై, "అర్జునుడి మరణం తథ్యమనీ, సంజీవినీమణితో అతణ్ణి పునర్జీవితుణ్ణి చేయవచ్చు" అనీ తెలిపింది. ఆ సంజీవినీమణి నాగలోకంలో ఉంది.

అర్జునుడు యాగాశ్వంవెంట మణిపురరాజ్యానికి వెళ్లాడు. అప్పుడు అర్జునుడి సంతానమైన బభ్రువాహనుడు మణిపురానికి మహారాజు. బభ్రువాహనుడు యాగాశ్వాన్ని బంధించి తనతో యుద్ధానికి రమ్మన్నాడు. అతని యుద్ధ కౌశల్యాన్ని చూడవచ్చునని అర్జునుడు భావించాడు. తండ్రి వచ్చాడని తెలిసిన బభ్రువాహనుడు, అర్జునుడుకి ఎదురేగి పాదాలకు నమస్కరించాడు. అది ఇష్టపడని అర్జునుడు, బభ్రు వాహనుణ్ణి తిరస్కరించాడు. బభ్రువాహనుడు ఖిన్నుడై తిరిగి వెళ్ళిపోతూన్నాడు. అప్పుడు నాగరాణి అయిన 'ఉలూచి', అతణ్ణి మార్గమధ్యంలో కలిసింది. తనను తాను పరిచయం చేసు కొన్నది. 'అర్జునుడితో వీరోచితంగా యుద్ధం చేయమన్నది. అప్పుడే నీ తండ్రి సంతోషిస్తాడు' అని అంటూ బభ్రువాహనుణ్ణి యుద్ధానికి ప్రోత్సహించింది.

బభ్రువాహనుడు తన సైన్యాన్ని వెంటబెట్టుకొని వెళ్ళి అర్జునుడితో తలపడ్డాడు. వారిరువురిమధ్య గొప్ప యుద్ధం జరిగింది. యుద్ధంలో అర్జునుడి శరాఘాతాలకు బభ్రు వాహనుడు తీవ్రంగా గాయపడి మూర్ఛపోయాడు. అదే సమయంలో బభ్రువాహనుని అస్త్రాలకు శాపగ్రస్తుడైన అర్జు నుడు హతుడయ్యాడు. ఇది చూచి 'చిత్రాంగద' విలపిస్తూ, యుద్ధానికి ప్రోత్సహించిన 'ఉలూచి'ని నిందించసాగింది. అప్పుడు 'ఉలూచి' గంగాదేవి అర్జునునికి ఇచ్చిన శాపాన్ని, ఆ శాపవిమోచనమార్గాన్ని చెప్పింది. ఇంతలో బభ్రువాహనుడు మేల్కొని, 'ఉలూచి' ఇచ్చిన సంజీవినీమణిసహాయంతో అర్జునుణ్ణి పునర్జీవితుణ్ణి చేశాడు. ఈ వివరాలు విన్న అర్జునుడు ఆశ్చర్యా నందాలను పొందాడు. అర్జునుడు యాగాశ్వంతోబాటు చిత్రాం గద, ఉలూచి, బభ్రువాహనులతో కలిసి హస్తినాపురానికి తిరిగి వెళ్లాడు. ధర్మరాజు అశ్వమేధయాగాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశాడు.

మహాభారతంలో 'ఉలూచి' పాత్ర చిన్నదే అయినప్ప టికీ, తన భర్త ప్రాణాలను కాపాడుకోవటంలో ఆమె ప్రవర్తించిన తీరు మిక్కిలి ప్రశంసనీయమైనది. ఈమె పాండవమధ్యముణ్ణి రక్షించిన నాగలక్ష్మి.

**గ్రంథసమీక్ష**

## వందే గురుపరంపరామ్

(గురురాజ పోశెట్టిహళ్ళి) పుటలు-200; ఆకృతి- 1/8 డెమ్మీ, వెల-రూ. 50/-; ప్రతులకు-చరవాణి-97393 69621

ప్రస్తుతసమాజంలో మార్గదర్శకులకొరతవల్ల ధర్మ మార్గంలో నడిచేవారిసంఖ్య తగ్గిపోయింది. అసురగుణాలు పెరిగిపోయి దైవగుణం తరిగిపోతోంది. ప్రజలు ధర్మ మార్గంలో నడచి మానవతావిలువలను అలవరచుకొని సామరస్యంగా జీవించినపుడే ప్రతిఒక్కరిజీవితంలోనూ ప్రశాంతత, సుఖశాంతులు నెలకొనడం సాధ్యమవుతుంది. జీవితంలో అనేక సమస్యలుంటాయి. వాటిలో చిక్కుకొన్న పుడు భగవంతుణ్ణి ఆశ్రయించాలని అనుకుంటాం. ఐతే, ఈ దుఃఖంనుండి బయటకు రావడమెలా? ఈ భవ సాగరాన్ని దాటాలంటే గురునాథుల ఆశ్రయం కావలసి ఉంటుంది. గురువులను ఆశ్రయిస్తే వారు జీవితంలో ప్రశాంతతను, సుఖశాంతులను పొందేమార్గాన్ని చూపిస్తారు. దుఃఖంనుండి విడుదలయ్యేలా చేయించగలరు. ఇదే గురువు యొక్క ఔన్నత్యం.

అలాంటి గురువులు జ్ఞానస్వరూపులు, సాక్షాత్ భగవత్స్వరూపులు, కైవల్యాన్నిచ్చే కల్పతరువులు, అంత రంగజ్యోతులు, సారస్వతసార్వభౌములు, సాధన అనే సన్మార్గాన్ని చూపే మార్గదర్శకులు అని 'గురువు' ఔన్నత్యాన్ని ఈ గ్రంథంలో వ్యాసాలరూపంలో చక్కగా అభివర్ణించారు రచయిత్రి శ్రీమతి సంధ్యారవికుమార్. రచయిత శ్రీ గురు రాజపోశెట్టిహళ్ళివారిచే రచింపబడిన కన్నడ మూలగ్రంథం తెలుగులోకి అనువదింపబడిన గ్రంథరాజమిది. ఇందులో గురువు విశిష్టతను ఎంతో గొప్పగా వర్ణించిన అన్ని విష యాలు ప్రతిఒక్కరూ తెలుసుకుని ఆచరించేలా తీర్చిదిద్ద బడింది. ప్రతిఇంట్లోనూ తప్పక ఉండాల్సిన గ్రంథమిదిగా చెప్పుకోవచ్చు.

– శ్రీ వాదిరాజు

# భారతీయ గణితం

– ఆచార్య వి.రమేష్‌బాబు,
94912 71729

గణితశాస్త్రజ్ఞులు ఎందరో ఎన్నోరకాలుగా గణితరంగానికి గణనీయమైన కృషిచేశారు. మరియు ప్రాచీన భారతదేశంలో గణితశాస్త్రవిజ్ఞానాన్ని అభివృద్ధిచేయడంలో కీలకపాత్ర పోషించారు. వివిధగణితవిభాగాల్లో వారి అంతర్దృష్టులు మరియు పురోగమనాలకోసం వారి రచనలు అధ్యయనం చేయబడుతున్నాయి మరియు ప్రశంసించబడుతున్నాయి. ఆ కోవలో ప్రముఖులగురించి తెలుసుకుందాం...

**01) ఆర్యభట్ట (476 సి.ఇ. - 550 సి.ఇ.):**

ఇతడు ఖగోళశాస్త్రం మరియు గణితశాస్త్రంలో చేసిన కృషికి ప్రసిద్ధిచెందాడు. సున్నాభావనను రూపొందించాడు పై(Π) విలువను లెక్కించాడు. బీజగణితం మరియు త్రికోణమితికి గణనీయమైన కృషిచేశాడు.

**02) బ్రహ్మగుప్త (598 సి.ఇ. - 668 సి.ఇ.):**

ఇతడు సంఖ్యావ్యవస్థలు మరియు బీజగణితంపై చేసిన కృషికి ప్రసిద్ధిచెందాడు. ఇతడు సున్నా మరియు ప్రతికూల సంఖ్యలతో అంకగణిత కార్యకలాపాలకోసం నియమాలను అభివృద్ధిచేశాడు. ఇతను వర్గసమీకరణాలకు పరిష్కారాలను కూడా అందించాడు మరియు జ్యామితిని అధ్యయనం చేశాడు.

**03) భాస్కర 1 (600 సి.ఇ. - 680 సి.ఇ.):**

ఇతణ్ణి భాస్కర ది ఫస్ట్ అనికూడా పిలుస్తారు, ఇతను ఖగోళశాస్త్రం మరియు గణితశాస్త్ర అధ్యయనానికి గణనీయమైన కృషిచేశాడు. ఖగోళవస్తువులస్థానాలను లెక్కించడానికి పద్ధతులను అభివృద్ధిచేశాడు. బీజగణితసమీకరణాలపై కృషిచేశాడు.

**04) భాస్కర (9వశతాబ్దం సి.ఇ.):**

ఇతడు ఒక జైనగణితశాస్త్రజ్ఞుడు, మహావీరుడు ప్రస్తారణ మరియు కలయికసూత్రాలను అభివృద్ధిచేయడం ద్వారా గణితశాస్త్రరంగానికి సహకరించాడు. ఇతడు బీజగణిత సమీకరణాలపైకూడా కృషిచేశాడు మరియు జైనగణితానికి సున్నాభావనను పరిచయం చేశాడు.

**05) బ్రహ్మగుప్త 2 (9వశతాబ్దం సి.ఇ.):**

ఇతణ్ణి రెండవభాస్కర అనికూడా పిలుస్తారు. ఇతడు అంకగణితం మరియు బీజగణితంలో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించాడు. ఇతడు గణితకార్యకలాపాలు, బీజగణితసమీకరణాలు మరియు శ్రేణివంటి వివిధగణితఅంశాలను కవర్ చేసే "ఖండఖాద్యక" అనే గ్రంథాన్ని రచించాడు.

**6.భాస్కర 2 (1114 సి.ఇ.- 1185 సి.ఇ.):**

భాస్కరాచార్యగా ప్రసిద్ధిచెందిన ఇతడు ప్రఖ్యాత గణితశాస్త్రజ్ఞుడు మరియు ఖగోళశాస్త్రవేత్త. ఇతనియొక్క ముఖ్యమైన రచనలో "లీలావతి" (అంకగణితం మరియు బీజగణితం),

### జూన్ నెల క్విజ్-11 సమాధానాలు

| | |
|---|---|
| 01) తైత్తిరీయ ఉపనిషత్తు | 11) పెరియాళ్వార్ |
| 02) విమానకల్పం | 12) పూరిజగన్నాథ |
| 03) మావిద్విషావహై | 13) విఖనసమహర్షి |
| 04) ద్వేషభావం | 14) అంతఃకరణము |
| 05) సింహవతి | 15) నిరుద్ధావస్థ |
| 06) నియామకశక్తి | 16) శిబి |
| 07) భూమాదేవి | 17) గాయత్రి |
| 08) గరుత్మంతుడు | 18) సాధం |
| 09) క్రియాధికారి | 19) భాస్కరాచార్య |
| 10) విష్ణుచిత్తుడు | 20) ఏడుమార్లు |

సరైన సమాధానాలు వ్రాసినవారు-

01) వేదసంహిత, అమలాపురం.
02) కె.తేజ, పోరంకి.

"బీజగణిత" (బీజగణితం), మరియు "గోలాధ్యాయ" (ఖగోళ భూగోళం మరియు ఖగోళశాస్త్రం) ఉన్నాయి.

**07) మాధవ (సి. 1350 సి.ఇ.- 1425 సి.ఇ.):**

ఇతడు కేరళ గణితశాస్త్ర స్థాపకుడిగా ప్రసిద్ధిచెందాడు. ఇతడు కలన గణన మరియు అనంతమైన శ్రేణులకు గణనీయమైన కృషిచేశాడు. త్రికోణమితి ఫంక్షన్ల భావనలను అభివృద్ధి చేశాడు. సైన్ మరియు కొసైన్‌వంటి త్రికోణమితి ఫంక్షన్లకోసం అనంతమైన శ్రేణివిస్తరణలను పొందాడు.

**08) నీలకంఠ సోమయాజి (1444 సి.ఇ.- 1545 సి.ఇ.):**

ఇతడు ఖగోళశాస్త్రం మరియు గణితశాస్త్రానికి చేసిన కృషికిగాను ప్రసిద్ధిచెందాడు. తన స్వంత ఖగోళవ్యవస్థను రూపొందించాడు. గ్రహాలస్థానాలను గణించే పద్ధతులను అభివృద్ధిచేశాడు. అనంతమైన సిరీస్‌విస్తరణలపైకూడా కృషి చేశాడు. కాలిక్యులస్‌లోకూడా పురోగతి సాధించాడు

**09) వరాహమిహిర (505 సి.ఇ.- 587 సి.ఇ.):**

ఇతడు ఖగోళశాస్త్రం, జ్యోతిషశాస్త్రం మరియు గణిత శాస్త్రంలో చేసినకృషికి ప్రసిద్ధిచెందాడు, ఇతని ప్రధాన సహకారం "పంచసిద్ధాంతిక". ఇది ఐదు ఖగోళవ్యవస్థలను ఏకీకృతం చేస్తుంది. అంకగణితం మరియు బీజగణితంలోకూడా గణనీయమైన కృషిచేశాడు.

**10) పింగళ (సుమారు 3వ శతాబ్దం బి.సి.ఇ.):**

ఇతడు ఛందస్సుపై మరియు బైనరీసంఖ్యల అభివృద్ధికి చేసినకృషికి ప్రసిద్ధిచెందాడు. "ఛందఃశాస్త్రం"పై ఇతని కృషి బైనరీ ప్రాతినిధ్యాలభావనను పరిచయం చేసింది మరియు బైనరీగణితానికి పునాదిని స్థాపించింది.

**11) హేమచంద్ర (1089 సి.ఇ. - 1172 సి.ఇ.):**

ఇతడు గణితశాస్త్రానికి గణనీయమైన కృషిచేసిన జైనపండితుడు. ఇతడు స్వతంత్రంగా "పాస్కల్ ట్రయాంగిల్" భావనను అభివృద్ధి చేశాడు. సంఖ్యాసిద్ధాంతం, కాంబినేటరిక్స్ మరియు జ్యామితిపైకూడా కృషిచేశాడు.

**12) శ్రీధర (సుమారు 870 సి.ఇ.):**

ఇతడు అంకగణితం మరియు బీజగణితంలపై చేసిన కృషికి ప్రసిద్ధిచెందాడు. ఇతడు "పతిగణిత" అనే గ్రంథాన్ని వ్రాశాడు, ఇది గణితంలో వివిధఅంశాలను వివరిస్తుంది, ఇందులో అంకగణితకార్యకలాపాలు, భిన్నాలు మరియు బీజగణితసమీకరణాలు ఉన్నాయి.

**13) కమలాకర (17వ శతాబ్దం సి.ఇ.):**

ఇతడు బీజగణితసమీకరణాలు మరియు సంఖ్య సిద్ధాంతానికి కృషిచేశాడు. ఇతడు "క్రియాక్రమకారి" అనే రచనను వ్రాశాడు, ఇది వర్గసమీకరణాలను పరిష్కరించడం మరియు సరళసమీకరణాలవ్యవస్థలువంటి అంశాలను చర్చిస్తుంది.

**14) మహావీరాచార్య (9వ శతాబ్దం సి.ఇ.):**

ఇతడు ఒక జైన గణితశాస్త్రజ్ఞుడు, భిన్నసూచికల భావనను అభివృద్ధి చేయడంద్వారా మరియు వర్గసమీకరణాలకు పరిష్కారాలను అందించడంద్వారా గణితరంగానికి సహకరించాడు.

**15) లల్లా (సుమారు 8వ శతాబ్దం సి.ఇ.):**

ఇతడు త్రికోణమితి మరియు గోళాకారజ్యామితిపై చేసినకృషికి ప్రసిద్ధిచెందిన గణితశాస్త్రజ్ఞుడు. మరియు ఖగోళ శాస్త్రవేత్తకూడా. ఇతడు త్రికోణమితి విధులు మరియు వాటి అప్లికేషన్లువంటి అంశాలను కవర్‌చేసే "శిష్యాధివృద్ధిదా" అనే గ్రంథాన్ని రచించాడు.

**సవరణ-**

**(1) జూలై, 2023 సంచిక, వైకుంఠపాళి(54 పుట)లో 19 నిలువు పూరణ అంశం (ప్రశ్న) ప్రచురితం కాలేదు. దానిని 'ఒక తిథి'గా పూరించుకోగలరు.**

**(2) జూలై, 2023 సంచికలోని 25వ పుటలోని వేదగణితం వ్యాసంలో ఇచ్చిన ఉదాహరణను ఈ క్రింది విధంగా సరి చూసుకోగలరు.**

వేదిక్ మాథ్స్ పద్ధతి ఆధారం 100

$97 \; \overline{3}$

$94 \; \overline{6}$

---

(97−6) లేదా (94−3) | $\overline{3} \times \overline{6}$

---

91 | 18

---

**- ప్రధాన సంపాదకుడు.**



శత్రువు కృత్రిమప్రేమకన్నా స్నేహితుని తిట్లే మిన్న

గత సంచిక తరువాయి భావం...

# విశ్వచైతన్యం పెరగాలంటే...

- డా॥ ముంజులూరి నరసింహారావు

పతంజలి యోగసూత్రాలు

యోగమంటే 'చిత్తవృత్తి నిరోధం. విశ్వమనే తెరమీద వేరు వేరుగా కనిపించే మట్టిబెడ్డా, గులక రాయీ, బంగారమూ అనే వాటి పార మాణుక స్పందనలవెనుక ఉన్నది ఒకే కాంతిచైతన్యం కనుక అవన్నీ సమానమే. అలాగే వేడీ, చలవా స్పందనలవెనుకా, పని జరగడమూ, జరగకపోవడమూ అనే భావాలస్పందనల వెనుకా, స్త్రీ, పురుషుడూ అనే తేడాల స్పందనల వెనుకా కూడా ఒకే చైతన్యముంది. విషమత్వాన్ని తెచ్చే ఈ తేడాలను చూడ కుండా ఉండాలంటే, చిత్తవృత్తులను అడ్డుకోవడం అవసరం. చిత్తక ల్లోలాల్ని ఆపుజేయాలంటే, పనుల అంటు తగలకుండా ఉండే తీరుగా, వాటిఫలితాలను వదిలిపెడుతూ, వాటిగురించి పట్టించు కోకుండా ఆ పనులను చేసే నేర్పుకావాలి. చిత్తంలో పుట్టే కలతలవల్లనే దుఃఖంతో సంయోగం కలుగుతుంది. చిత్తావేశాల వల్ల వచ్చే సుఖాలుకూడా వివేకికి దుఃఖాలే. సుఖాల వేషాలు వేసుకొన్న ఈ దుఃఖాల కలయికను విడగొట్టడమే యోగం. ఈ విధంగా చూస్తే ఈ నిర్వచనాలన్నీ ఒకటే. దేహానికి పరిమితమైన చైతన్యాన్ని విశ్వచైతన్యంగా పెంపొందించుకోవడమే ఈ యోగాని కున్న పరమోద్దేశం.

యోగమంటే కోరికలతలపుల్ని విడిచిపెట్టడం. ఆలో చనలు రాకుండా అరికట్టడమనికూడా చెబుతారు. అదే వృత్తి నిరోధమంటేకూడా. ఆలోచనలు లేకుండా ఉండడమంటే మానసికంగా స్తబ్దుగా పడి ఉండడమనికాదు. ప్రియమూ, అప్రియమూ అనే జమిలిభావాలను దాటిన సమత్వమే తలపుల్ని వదిలిపెట్టడమంటే. ఏ ఆలోచనలకూ తావునీయకుండా ఇంద్రి యాలను స్థిరంగా సద్ధర్మ మనే సమత్వానికి కట్టి ఉంచడమే యోగం. అంతేగాక, పుట్టడమూ, లయం కావడమూ రెండూ యోగాలే అని రెట్టిస్తుంది కఠోపనిషత్తు. మరోలాగా చెప్పాలంటే, ప్రపంచంలోనూ, అది లేనప్పుడూ ఎప్పుడూ బ్రహ్మైకత్వాన్ని కలిగి ఉండడమే యోగమని తిరిగి సమత్వాన్నే యోగంగా బలపరిచింది ఈ ఉపనిషత్తు. ఈ సమత్వయోగమే సమాధి.

'అథ' అంటే-'తనను అనంతతత్త్వంనుంచి దూరం చేసిన పరిమితుల్ని పోగొట్టుకొందా మన్న గాఢమైన వాంఛను దిట్టపరుచుకొన్న తరువాత, ఆలోచనలను జయించాలనే కోరిక గట్టిపడినమీదట, ఇంద్రియాలను కట్టడిచేయడమెంత అవసరమో రూఢి అయిన మీదట అనే శ్రేయస్కరమైన అర్థాన్ని సంత రించుకుంటుంది.

ఈ యోగాన్ని అనుసరించడానికి అవసరమైన లక్షణాలను పతంజలి తాను చెప్పబోయే సూత్రాలద్వారా నిబంధిస్తూ దాన్ని నేర్పడానికి నడుంకట్టి, ఈ శాస్త్రాన్ని ముందు పటివారు చేసిన ఉపదేశాలను అల్పాక్షరాలతో అసందిగ్ధంగానూ, సారవంతంగానూ, సర్వతోముఖంగానూ, ప్రతిబంధాలేమీ లేకుండానూ, దోషరహితంగానూ సూత్రీకరిస్తూ మొదలుపెడు తున్నాడు (అనుశాసిస్తున్నాడు).

ఇది హిరణ్యగర్భుడి శాస్త్రాన్ని అనుసరిస్తూ సమాధిని పండించే సాధనలను వివరిస్తుందని సదాశివబ్రహ్మేంద్రస్వామి వారు పతంజలియోగసూత్రాలకు వ్రాసిన వ్యాఖ్యానరూపమైన తమ యోగసుధాకరంలో వ్రాశారు. ఈ హైరణ్యగర్భశాస్త్ర మేమిటి? హిరణ్యగర్భుడు సూక్ష్మవిశ్వశక్తుల్ని నిర్దేశించే సూక్ష్మ విశ్వకర్త. సూక్ష్మవిశ్వాన్ని ధరించి, పోషించి, అదుపులో ఉంచే దివ్యమైన కర్తృశక్తి. ఈ శక్తిస్పందనప్రవాహాల్ని పోషిస్తూ, అన్నింటిలోనూ సర్వోపగతంగా ఉన్న జీవశక్తిని మనిషిశరీరం లోని జీవశక్తితో కలుపుతుంది. దీనితోనే స్థూలశరీరం ఆవేశితమై పనులను చేస్తూన్నట్టుం టుంది. సూక్ష్మశరీరంలో సూక్ష్మవిశ్వం ప్రవేశింపజేసే శక్తుల వినా, స్థూలశరీరం వట్టి జడం మాత్రమే. ఈ సూక్ష్మవిశ్వజీవితం గురించిన శాస్త్రమే హిరణ్యగర్భుడిశాస్త్రం. స్థూలవిశ్వమైన భూమికన్నా సూక్ష్మవిశ్వం ఎక్కువ సహజంగా భగవంతుడి ఇచ్ఛకు, అంటే, దివ్యశాసనానికి శ్రుతిబద్ధమై ఉంటుంది. ఇక్కడ ఉన్నట్టుగా సూక్ష్మవిశ్వంలో నేలమీదా, నీటిలోనూ, గాలిలోనూ హత్యలూ, యుద్ధాలూ ఉండవు; అక్కడ హాయినిచ్చే పొందికా, సమత్వమూ ఎప్పుడూ రాజ్యంచేస్తూ ఉంటాయి. సూక్ష్మ విశ్వ జీవులు తమ ఇచ్ఛాశక్తితోనే రూపాలను దాల్చగలరు, కరిగించనూగలరు. అక్కడ అంతా, అన్నీను సృజ నాత్మకమైన భగవంతుడిదీప్తితో స్పందిస్తూ ఉంటాయి. అక్కడ సంతానం ఎప్పుడూ మానసికమైందే. అందరూ ఇచ్ఛాప్రసూతులే అంటే, కోరుకోవడమే తడవు మానసికంగా పుట్టినవాళ్ళే. సూక్ష్మశరీరం వేడికీ, చలవకీ ఇతరమైన ప్రకృతితాలూకు పరి స్థితులకూ గురికాదు. అది వట్టి ఆగమభావంతోనే చూడగలదు,

వినగలదు, వాసనను చూడగలదు, రుచిచూడగలదు, తాకగలదు. దానికి మూడుకళ్లుంటాయిగానీ రెండు పాక్షికంగా మూసుకొనిపోయి ఉంటాయి; మూడోది నొసలిమీద నిట్టనిలువుగా తెరుచుకొని ఉంటుంది. సూక్ష్మశరీరానికి అన్ని ఇంద్రియాలూ ఉంటాయి; అయితే, అది, ఆగమశక్తితో ఏ ఇంద్రియంతోనైనా సరే, అన్ని ఇంద్రియాలపనులనూ చేయగలదు. సూక్ష్మవిశ్వంలో ఒకళ్లతో ఒకరు దివ్యశ్రవణంద్వారా, దివ్యదృష్టిద్వారా సంవాదాలు జరుపుకొంటూ ఉంటారు. సూక్ష్మవిశ్వజీవులు ముఖ్యంగా విశ్వకాంతితోనే పోషితులౌతారు. భూమిమీది జీవితాలతో పోలిస్తే సూక్ష్మవిశ్వజీవులు ఐదువందలనుంచీ వెయ్యేళ్లదాకా బ్రతుకుతూంటారు. వాళ్లకు చావు, ప్రాణకణాలు చెదిరిపోవడంతో జరుగుతుంది. భౌతికమైన కోరికలనుంచి విముక్తిపొందిన సూక్ష్మజీవి, తన మునపటిజన్మల్లోని తండ్రుల్నీ, తల్లుల్నీ, భార్యల్నీ, భర్తల్నీ, స్నేహితుల్నీ, చుట్టాల్నీ చూస్తాడు గనక, అతను వాళ్లందర్నీ ఒకేవిధంగా భగవంతుడి రూపాలుగానే చూడడాన్ని నేర్చుకొంటాడు. ఇన్ని విషయాల్లోనూ ఈ హిరణ్యగర్భుడి సూక్ష్మవిశ్వ శరీరశాస్త్రాన్ని ఈ యోగశాస్త్రం అనుసరిస్తూ ఏ ఉపాయాలతో స్వతంత్రమూ, కాంతిమయమూ అయిన ఆ జీవితాన్ని ఇక్కడే, ఈ శరీరంలో ఉండగానే పొందవచ్చునో మనకు నేర్పుతుందన్న మాట. అప్పుడు స్థూలశరీరంతో ఒకటై ఉండడంనుంచి విడివడి ఉండడం సులువుగా అలవడుతుంది.

అదీగాక హిరణ్యగర్భుడంటే, కమనీయమైన సృష్టిని గర్భాన దాల్చిన కకారరూపుడూ, అంటే, ఫలానా రూపమని చెప్పగరాని దీప్తిమంతుడూ, గతిమంతుడూ, శక్తిమంతుడూ, కమనీయుడూ, క్రమణాత్మకుడూ, సుఖస్వరూపుడూ, నిత్యనూతనుడూ అయిన ప్రజాపతి. ప్రజాపతి అంటే, ఒకదానినుంచి లాగగా చాలామందిగా పుట్టినవాళ్లకు పరిపాలకుడు, సంరక్షకుడు. అంచేత అతను సృష్టిలో పుట్టిన సర్వభూతాలకూ ఏకపతి; అతనే దివినీ భువినీ, అంతరిక్షాన్నీ మనం చూస్తూన్న విధంగా దృఢంగా ధరించి ఉంచుతున్నాడు. అతనే అహంకారంగా మారిన మన ఆత్మను శోధించి విశుద్ధపరుస్తాడు. 'నాది' అనుకునే మనబలాన్నికూడా 'నాతనం' నుంచి వేరుచేసి, 'ఇదంతా పరమాత్మదే, అతని భరణ, ధారణ, పోషణాల ఈవే ఇదంతా' అనే తెలివి కలిగేలాగ శుభ్రపరుస్తాడు. అతని శాసనానికి లోబడి, అంటే, సృష్టిసూత్రాలకు లోబడే సర్వశక్తులూ పనిచేస్తున్నాయి. అతనికి అమృతత్త్వమూ, మృత్యువూ రెండూ విరుద్ధం కావు; అవి అతని నీడల్లాంటివి. ఊపిరీ, కన్నార్పడమూ అనేవే రెండుపాదాలుగా చేసుకుని, ఊపిరి పీల్చేవాళ్లనీ, కళ్లార్పేవాళ్లనీ అనే పేర్లతో నాలుగురకాలుగా పుడుతూ, నాలుగుపాదాల ధర్మాన్ని పరిపాలించేవాళ్లనీ అందరినీ అతనే తన ఏలుబడిలో ఏలుతూ ఉంటాడు. ముందూవెనుకా అతనిచేతులే; ఇటుపక్కా అటుపక్కా అతనిచేతులే. పూజనీయమైన తన మహత్త్వంతో, శబ్దించే సముద్రాన్ని, పర్వతాల చల్లని కడుపుల్లోంచి పుట్టే నదులతో నింపుతున్నా, తెర్లిపోకుండా దిక్కులనే తన చేతులతో నిలుపుతూ ఉంటాడు. దివిని ప్రకాశంతో ఉబికి కనిపించే విధంగానూ, భువిని చుట్టూ ఉన్న నీళ్లలో కరగి పోకుండా దృఢంగా ఉండేవిధంగానూ, సూర్యుణ్ణి సుఖదుఃఖాలనే ద్వంద్వాలు బొత్తిగాలేని సుఖైకలోకాన్నీ నిర్మించి, కిరణాల తాళ్లతో భూమ్యాకాశాల్ని పట్టి ఉంచి నడుమ ఆకాశాన్ని విశేషంగా సడలకుండా ఉండే విధంగానూ చేసిన మహానుభావుడూ ఆ హిరణ్యగర్భుడే. ఇదంతా తన దివ్యమైన మనస్సుతోనే స్పందించేలాగ చేస్తూ తన ఇచ్ఛాశక్తితో భూమ్యాకాశాల నడుమ సూర్యుణ్ణి వెలిగించి ప్రేరేపించేవాడూ అతనే. అంతటా వ్యాపించి ఉన్న చైతన్య 'జలాల' రూపంలో ఉన్న అతను, విశ్వరూపగర్భాన్ని ధరించి, అగ్రణిగా ఒకటిగా ఉండే ప్రజ్ఞారూపమైన ప్రాణస్పందనను కన్నాడు; ఆమీద సర్వజ్ఞానాన్నిచ్చే దక్షరూపమైన విశ్వయజ్ఞం రూపొందింది. జలరూపంలో చైతన్యాన్ని చెప్పడానికి కారణం, విశ్వంగా పెంపొందిన అది నీళ్లలాగ అధ్రువంగా ఉంటుందని తెలియజెప్పడానికే. చైతన్యంగా ధ్రువమైనా, విశ్వంగా మారిన అది అధ్రువమే. ఇలాగే తెలిసిన వాడికి ఈ భూమీ, దివమూ నీళ్లూ, చంద్రుడూ మొదలైనవన్నీ నాశనమయ్యే రూపులోగాక చైతన్యంగానే కన్పిస్తాయి. అన్నీ చైతన్యంగా అగుపింపజేసేది జ్ఞానంగనుక, ఈ హిరణ్యగర్భశాస్త్రం సాంఖ్యశాస్త్రరూపందాల్చి, సుఖైకస్వరూపమైన ఏకచైతన్యంలో నానాత్వాన్ని హవిస్సుగా హుతంచేసి, బ్రహ్మానికి పరిచర్య చేయడాన్ని నిరూపిస్తుంది. యోగశాస్త్రంకూడా చిత్తవృత్తులతో బహువిధాలుగా అనిపించే విశ్వం వెనుక ఉన్న ఏకచైతన్యాన్ని, ఆ రకరకాలవృత్తుల్ని నిరోధించిన సమాధిద్వారా నిరూపిస్తుంది. ఆవిధంగా ఈ యోగశాస్త్రం హిరణ్యగర్భశాస్త్రాన్ని అనుసరిస్తుంది.

**పుణ్యే కణ్వపురోత్తమే విలసతి శ్రీశౌరిరాజప్రభుః**
**దేవీతత్పురనాయకీ కమలినీ నిత్యాభిధా సర్వదా।**
**దివ్యేచైవ తదుత్పలావతసమాఖ్యాతే విమానేऽధృతే**
**తిష్ఠన్ పూర్వదిశావలోకనముఖః కణ్వస్య ముక్తిప్రదః॥**

## 108 దివ్యదేశాలు

# తిరుక్కణ్ణప్పురం

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

తిరుక్కణ్ణప్పురం దివ్యదేశం తమిళనాడురాష్ట్రం కుంభకోణం సమీపంలో ఉంది. నన్నిలంఊరినుండి ఏడుకిలోమీటర్ల దూరంలో, నాగపట్టిణమ్ క్షేత్రంనుండి ఏడుకిలోమీటర్లదూరంలో ప్రకృతిశోభతో, పెద్దగోపురాలతో, మూడుప్రాకారాలతో విశాల ప్రదేశంలో ఉంది. ఈ దివ్యదేశం దండకారణ్యం, కృష్ణఅరణ్య క్షేత్రం, అష్టాక్షరమంత్రసిద్ధిక్షేత్రం అని ప్రసిద్ధిగాంచింది.

అష్టాక్షరంలో మొత్తం ఎనిమిదిఅక్షరాలుండగా, ఏడు అక్షరాలవరకు 1)తిరుమల 2)శ్రీరంగం 3)శ్రీముష్ణం 4)వానమామలై 5)సాలగ్రామం 6)బదరికాశ్రమం 7)నైమిశారణ్యం. ఇక ఎనిమిదవ అష్టాక్షరంయొక్క సంపూర్ణసారమే ఈ తిరుక్కణ్ణపురంక్షేత్రం. స్వామి శౌరిరాజపెరుమాళ్, అమ్మవారు కణ్ణపురనాయకి. నిత్యపుష్కరిణితీర్థం. ఉత్పలావతకవిమానం. కణ్వమహర్షికి ప్రత్యక్షం. నమ్మాళ్వార్లు, కులశేఖరులు, గోదాదేవి, పెరియాళ్వార్లు మరియు తిరుమంగయాళ్వార్లు మొత్తం నూట ఇరవైతొమ్మిదిపాశురాలద్వారా ఈ శౌరిరాజస్వామిని మంగళాశాసనం చేశారు.

మూలమూర్తి తూర్పుదిక్కున వరదహస్తంతో ప్రయోగ చక్రంతో నీలమేఘస్వామిగా దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. అమ్మవారు ప్రత్యేకసన్నిధిలో కణ్ణపురనాయకిగా వేంచేసి ఉన్నారు. గర్భగృహంలో శ్రీదేవిభూదేవితోపాటు స్వామి మత్స్యకులంలో పుట్టిన ఒకరాజకుమార్తె పద్మావతిని వివాహం చేసుకున్నందువల్ల, స్వామివారి కుడిపక్కన అమ్మవారు వేంచేసి ఉంటారు. ఇలా శ్రీదేవి, భూదేవి, కణ్ణపురనాయకి, పద్మావతి, పద్మిని అనే ఐదుమందిఅమ్మవార్లతో స్వామి భక్తులకు దర్శనాన్నిస్తున్నాడు.

## స్థలపురాణాలు

ప్రతినిత్యం అర్చకుడు స్వామివారికి సమర్పించే పుష్పమాలికను రాజుకి తీసుకెళ్లి అతనిమెడలో వేయడం అలవాటు. ఓరోజు ఆ మాలలో కేశములు కనిపించాయి. అందుకు రాజు అర్చకుణ్ణి 'స్వామికి కేశములు ఉన్నాయా?' అని అడిగాడు. ఉన్నాయన్నాడు. 'నేను ఓసారి ఆ కేశములను చూడాలి' అని రాజు అడిగాడు. అర్చకుడు అక్కడికెళ్లి స్వామిశిరస్సుపై చేయి పెట్టగానే ఆ వెంట్రుకలు కనిపించాయి. కనుక ఈ స్వామిని 'శౌరిరాజపెరుమాళ్' అందమైన కేశసౌందర్యాన్ని కలవాడు అని పిలుస్తారు.

విభీషణునికి తన నడకసౌందర్యాన్ని ఈ స్వామి చూపెట్టాడని, ఈ దేవాలయంలో విభీషణునికి మరియు అతని కుమార్తె త్రిజటకి ప్రత్యేక సన్నిధిలున్నాయి. గరుత్మంతుడు ఈ క్షేత్రంలో తపస్సుచేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందాడు. అలాగే ఇంద్రుడు అశ్వమేధయాగాన్ని త్వష్ట మరియు వృత్రాసురుడనే అసురులు భంగం చేయగా ఇంద్రుడు వాళ్ళిద్దరిని సంహరించాడు. ఆ పాపపరిహారంకోసం, ఈ క్షేత్రానికి వచ్చి తపస్సు చేశాడు. అలాగే పాండ్యదేశరాజు చిత్రశ్రవుని కుమార్తె తామ్రపర్ణిలో కొట్టుకుపోతూ, ఈ తిరుక్కణ్ణపురంలో ఉన్న నిత్యపుష్కరిణిలో పడి తన ప్రాణాన్ని దక్కించుకుని, పాపాల్ని పోగొట్టుకుందని ఐతిహ్యం. ఉపరిశ్రవస్‌రాజు ఈ తిరుక్కణ్ణపురంస్వామికి దేవాలయాన్ని నిర్మించాడని స్థలపురాణం. వసు అనే రాజు పుత్రకామేష్టియాగాన్ని చేసి, పద్మిని–పద్మకుడు అనే ఇద్దరిని సంతానంగా పొందినట్లు చరిత్ర. పద్మిని ఈ స్వామిని వివాహం చేసుకున్నది. వైఖానసాగమంప్రకారం స్వామి ఆరాధనలు అందుకుంటున్నాడు.





శ్రీవేంకటేశ్వరలీలలు



# స్వామిదయ!!

- శ్రీమతి మంచుకొండ జయప్రద,
77804 76881.

తిరుమల శ్రీవారికి ఆ రోజుల్లో రూ.500/- కల్యాణాలు, రూ.2,500/- కల్యాణాలు ఉండేవి. మేము రూ. 500/- కల్యాణాలు ఎప్పుడు తిరుమల వెళ్లినా చేయించుకునే వాళ్లం. నడచి కొండ ఎక్కడం, రూ.500/- కల్యాణాలు చేయించుకోవడం, ఏ కష్టం, ఏ ఇబ్బంది వచ్చినాగానీ పిల్లలు పరీక్షల్లో మంచిమార్కులతో ఉత్తీర్ణులు కావాలని మొక్కేవాళ్లం. ఆ గోవిందుడు నా మొఱలు ఆలకించి, ఆ కష్టం తీర్చేవాడు. అలా స్వామికి మొక్కినమొక్కులు తీర్చుకొనేవాళ్లం.

రూ.2500/- పెద్దకల్యాణాలు చేయించేవారిని ముందు వరుసలో, కల్యాణం అరుగు సమీపంలో కూర్చోబెట్టేవారు. వారి తర్వాత రూ.500/- కల్యాణంవారిని కూర్చోబెట్టేవారు. స్వామి మీద అత్యంత ప్రేమ, భక్తి ఉన్న నాకు స్వామివారిని, అమ్మ వార్లను, దగ్గరగా కూర్చొని స్వామివారి కల్యాణం సేవించాలని ఆశగా ఉండేది. అలా దగ్గరగా కూర్చొని సేవించే ఆర్థిక వనరులు లేని నా స్థితికి ఏడుపు వచ్చేది.

ఇలా రోజులు గడుస్తున్నసమయంలో మాకు భగవంతుడు ఒక చక్కని అవకాశం కల్పించారు. స్వామివారి దయాగుణాన్ని చెప్పక ఉండలేక సప్తగిరి పాఠకులతో పంచుకుంటున్నాను. ఒకరోజు మావారి స్నేహితుడు మావారి వద్దకు వచ్చి తిరుమలలో రూ.2,500/- పెద్దకల్యాణం చేయించాలని అనుకుంటున్నాను. ఎలా నమోదు చేయాలో నాకు తెలీదు. నావెంట వచ్చి నమోదు చేయించు. నీవెప్పుడూ రూ.500/- కల్యాణం నమోదు చేయించుకుంటుంటావు కదా అని మా వారిని వెంట తీసుకెళ్లారు, ఆ వెంటనే కల్యాణంటిక్కెట్ నమోదు అయింది. తిరుమలనుండి ఏ తారీకు అనేది కల్యాణం టిక్కెట్ తపాలాలో పంపేవారు. అలా జరిగిన కొన్నిరోజులకు మావారి స్నేహితునిపేరుతో కాక మా వారిపేరుతో రూ.2500/- పెద్దకల్యాణంటిక్కెట్ వచ్చింది. నా పేరుతో నమోదుచేస్తే నీపేరుమీద వచ్చిందే అని అతను బాధపడ్డాడు. ఇలా జరిగిందేమిటా అని మాక్కూడా అనిపించింది. అప్పుడు ఇంట్లో ఉన్న డబ్బులన్నీ వెతికి తీసుకుని మరలా ఆ స్నేహితుణ్ణి వెంటబెట్టుకొని కల్యాణంటిక్కెట్ నమోదు చేయటానికి వెళ్లి నమోదుచేస్తే మావారిపేరుమీద వచ్చిన తారీకులో అతనికి కల్యాణంటిక్కెట్ వచ్చింది, మావారి సీరియల్‌నెంబరుప్రక్కనే వారికికూడా వచ్చింది. వెంటనే రైలుటిక్కెట్లు, విశ్రాంతిగదులు నమోదుచేసుకొని తిరుమల వెళ్లాం. అందరం కల్యాణానికి పంపే వెయిటింగ్‌హాలులో కూర్చున్నాం. దేవస్థానంవారు వచ్చి హాలు తాళం తీసి కల్యాణమండపంలోకి వెళ్లమని చెప్పారు. పెద్దకల్యాణంటిక్కెట్లున్నవారిని ముందుకు పంపారు. ఒకరిమీద ఒకరు పడి పరుగెత్తుతున్నారు. నాకు మోకాళ్లనొప్పులవల్ల మేమందరం చిన్నగా నడుస్తూ వెళ్తున్నాం. చిన్నకల్యాణంటిక్కెట్లున్న వారుకూడా మమ్మల్ని దాటి వెళ్లిపోయారు. నా శరీర అశక్తతకు ఏడుస్తూ, ఏమిటి స్వామివారికల్యాణం దగ్గరనుండి చూడాలని వస్తే నా పరిస్థితి ఇలా అయింది. గోవిందా ఏమిటి నా గతి అని ఏడుస్తూ మండపానికి చేరుకొన్నాను. ఎప్పటిలాగే చివర్లో కూర్చొని కనిపించి కనిపించనిలాగా చూడాలికదా అని ఆవేదనపడ్డాను. మండపంలో టిక్కెట్లు చెక్ చేసే సిబ్బంది ఏమిటి ఇంత ఆలస్యం అని మావారిచేతిలో టిక్కెట్లు తీసుకొని ఆశ్చర్యంగా మావైపు చూశాడు. నా ఏడుపుముఖం చూసి జాలి వేసినట్లుంది. పెద్దకల్యాణంలిస్టులో మొదటి నాలుగుసీట్లు మావి. మావారి స్నేహితులవి. ఆ వచ్చినవారందరు అక్కడ మమ్మల్ని కూర్చోనివ్వండి అని దౌర్జన్యం చేశారట. మొదటి నెంబరువాళ్లు వస్తారు అని వారికి చెప్పలేకపోయారట. వారు మాతో ఇక మీరు వెళ్లి కూర్చొండి అని మమ్మల్ని కూర్చోపెట్టారు. ఆ ఏడుకొండలవాడి వాత్సల్యం భరించే ఓపిక లేకపోయింది. అప్పుడు మా ఆయన ముందు కూర్చొనికూడా ఎందుకు ఏడుస్తున్నావు అని మందలింపు. స్వామి దయావాత్సల్యాలు భరించేశక్తి లేక ఏడుపు. స్వామీ! నీ దయకు అర్హురాలిని స్వామి. గోవిందా! వింటున్నావా తండ్రీ!

# సకలజీవకోటిబ్రహ్మ కశ్యపమహర్షి

– డా॥ పి.లలితవాణి, 9849026107

కశ్యపమహర్షి బ్రహ్మమానసపుత్రుడు. సృష్టిని వ్యాపింపచేయాలని బ్రహ్మదేవుడు– కశ్యపుని ప్రజాపతిని చేసి, జీవసృష్టి చేయుమని నియమించాడు. అందుకే కశ్యపుడు (సృష్టిచేసినందువలన) నవబ్రహ్మలలో ఒకనిగా స్థిరపడ్డాడు. ఎందరినో ఆవాహం చేసుకుని ఒక్కొక్కభార్యవలన ఒక్కొక్కజాతిని కని, సృష్టికార్యం నెరవేర్చిన అఖండ తపశ్శాలి కశ్యపుడు.

దక్షప్రజాపతి కుమార్తెలైన అదితి, దితి, ధనువు, క్రోధవశ, కాల, విశ్వ, అనాయువు, పృథ, సురస, అరిష్ట, ముని, ఇల, తిమి, సురభి, చేల, తామ్ర, వశ, సింహిక, వినత, కపిల, కద్రువ మొదలైనవారిని వివాహం చేసుకున్నాడు. అదితితో దేవతలను, దితితో దైత్యులను, ధనువుతో దానవులను, వినతతో పక్షులను, కద్రువతో సర్పాలను, సురభితో గోవులను, సింహికతో సింహాలు– పులులను, తామ్రతో డేగ– గ్రద్దలను, క్రోధవశతో కీటకాలను, ఇలతో చెట్లు–తీగెలను, అరిష్టతో గుర్రాలను, విశ్వతో యక్షులను, మునితో అప్సరసలను, తిమితో తిమింగలాది జలచరాలను–ఇంకా నరులను కూడా సంతానంగా పొంది– సృష్టిని పెంపొందించాడు. అన్నిజాతులకు తండ్రిగా నిలిచాడు.

త్రిలోకాధినాథుడైన దేవేంద్రునికి, సర్వలోకకర్మసాక్షి– సమస్త ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానునికి తండ్రి కశ్యపమహర్షే. అదితితో కూడి కశ్యపుడు మహోగ్రంగా తపస్సు చేసి–శ్రీమన్నారాయణుని అనుగ్రహాన్ని పొంది–శ్రీమహావిష్ణువునకే ముమ్మారు తండ్రిగా తరించాడు. దశావతారాలలోని వామన మూర్తిని అదితికశ్యపులే కడుపారా కన్నారు. ఆ తరువాత త్రేతాయుగంలో అదితికశ్యపులే కౌసల్యాదశరథులుగా జన్మించి శ్రీరామచంద్రుని పుత్రునిగా పొందారు. ద్వాపరయుగంలో దేవకీవసుదేవులుగా పుట్టి శ్రీకృష్ణపరమాత్మునే కని ధన్యులయ్యారు. కశ్యపుడు మహోన్నత తపశ్శక్తిసంపన్నుడు కనుకనే అంతటి భాగ్యశాలి అయ్యాడు. కశ్యపుడు మహాయోగిపుంగవుడు. వైవస్వతమన్వంతరంలో అంటే ఇప్పుడు ఈ కాలంలో సప్తమహర్షులలో కశ్యపుడున్నాడు. కశ్యపుని పేరుమీదుగా "కాశ్యపసగోత్రం" అనూచానంగా వస్తోంది.

బృహదారణ్యకోపనిషత్తు– కశ్యపుని ఆదిఋషిగా పేర్కొన్నది. బౌద్ధమతంలోకూడా కశ్యపుడే తొలిముని. కశ్యపుడు బహుగ్రంథశాస్త్రకర్త. ఎన్నింటినో రచించి మనకందించాడు. "కశ్యపసంహిత" అనే గ్రంథంలో జీవకీయతంత్రం చాలా వివరంగా ఉంది. ఇది ఆయుర్వేదశాస్త్రం. ప్రసూతిశాస్త్రం (గైనకాలజీ)మొత్తం దీనిలో నిక్షిప్తం. పసిపిల్లవ్యాధులు, చికిత్సలు ఇందులోనే చెప్పబడ్డాయి. ఆయుర్వేదవైద్యగ్రంథాలలో మొట్టమొదటిది కశ్యపసంహిత. ఇది మనకందిన అమూల్యవరం.

"కాశ్యపసంగీతశాస్త్రం" అనే గ్రంథం ఉన్నది. "కాశ్యపశిల్పశాస్త్రం"లో వాస్తుశిల్పం, ఇకనోగ్రఫీ– (విగ్రహశాస్త్రం), అలంకారకళలు విపులంగా వివరించబడ్డాయి. అన్నిటికీ మించింది "కాశ్యపగీత". ఇందులో వేదాలు, యాగాలు, ధర్మాలు, యావత్తు జగము– అన్నీ క్షమలోనే నిలిచి ఉన్నాయని కశ్యపుడు బోధించాడు. క్షమ–అంటే ఓర్పుతో, సహనంతో, ఎంతటి దోషాన్నైనా క్షమించగలిగే గుణోన్నతి. సకలధర్మాలూ క్షమలోనే ఉన్నాయనీ, క్షమాగుణమే ప్రతిఒక్కరికీ అత్యావశ్యకమనీ, అదే వేదాలసారమనీ– ప్రత్యక్షరంలోనూ స్పష్టం చేశాడు. కశ్యపుడు– శాంతికాముకుడు.

మహాభారతం, భాగవతం, రామాయణం, పద్మపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, వైద్య, సంగీత, ధర్మ, శిల్ప, మానసిక శాస్త్రవేత్త–అని కశ్యపుని మహోన్నతిని వేనోళ్ళ కీర్తించాయి.

సకలజీవకోటిని సృష్టించిన మరో బ్రహ్మ కశ్యపప్రజాపతి.



# ఇండోనేషియాలో భారతీయసంస్కృతి

- శ్రీ కె.సి.నాయుడు, 77020 12946

ఈ సువిశాల భరతఖండాన్ని పరిపాలించిన రాజుల్లో భరతుడు ప్రముఖమైన చక్రవర్తి. ఆ తరువాత యుధిష్ఠిర మహారాజు ఏకచ్ఛత్రాధిపత్యం వహించాడని అతనితరువాత అది విభజింపబడుతూ వచ్చిందని చెప్పబడుతోంది. ఇప్పటికీ కొన్ని దేశాల్లో వైదికకాలంనాటి ఆనవాళ్ళు కనిపిస్తూంటాయి.

రామాయణంలోని కిష్కిందకాండలో సుగ్రీవుడు సీతాన్వేషణకై యువద్వీపానికి వానరులను పంపాడు. అదే జావా ఇప్పటి ఇండోనేషియా. ఈ ఇండోనేషియాలో రామాయణం ప్రభావం అధికంగా ఉండేది. ఇండోనేషియా సుమారు 17500 ద్వీపాల సముదాయం. దీని రాజధాని జకర్తా. ఇక్కడ ఆచరణ మొత్తం హిందూసంప్రదాయాలే. భిన్నత్వంలో ఏకత్వం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తున్నారు.

ఇండోనేషియా ఏర్‌లైన్స్‌పేరు గరుడ. ఈ దేశ కరెన్సీపై వినాయకునివిగ్రహం ముద్రించబడి ఉంది. ఇండోనేషియాలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో భగవద్గీత బోధింపబడుతూంది. కొందరు విద్యార్థులు గీతపై పి.హెచ్‌డిలు కూడా చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం ఈ దేశ మొదటి అధ్యక్షుడు సుకర్ణో, అతని తరువాత అతనికుమార్తె మేఘవతి సుకర్ణోపుత్రి ఈ ప్రాంతాలను ఆధ్యాత్మికతకు, సనాతనధర్మవారసత్వాలకు ఎలాంటి హాని జరుగకుండా కాపాడారు. ఇవన్నీ ఇక్కడి ప్రజల్లో ఒకభాగం.



ఇండోనేషియాలోని యోగ్యకర్త అను నగరసమీపంలో యునెస్కో వారసత్వసంపదగా గుర్తింపు పొందిన ప్రపంచంలో కెల్లా అతిపెద్ద బౌద్ధాలయముంది. ఇందుకోసం 32కి.మీ. విస్తీర్ణం కేటాయించారు. ఇది 115 అడుగులఎత్తు కలిగి ఉంది. రాజా శైలేంద్రవంశానికి చెందిన రాజులు 7వశతాబ్దంలో ఈ ప్రాంతంను పరిపాలించారు. ఈ రాజవంశంవారు హిందూ మతాన్ని పాటించేవారు. యోగ్యకర్తనగరాన్ని అయోధ్యగా భావించేవారు. ఆ తర్వాత సమరతుంగ అను రాజు ఇతని మరణానంతరం ఇతనిభార్య ప్రమోదవర్ధిని ఈ భారం తనపై వేసుకొని నిర్మాణం కొనసాగించింది. గుణధర్మ అనే శిల్పి 25 సంవత్సరాలు శ్రమించి పర్వతాకారంలో నిర్మించారు. 404 అడుగుల పొడవు, అంతే వెడల్పుతో చతురస్రాకారంగా ప్రారంభించి పైన వృత్తాకారంగా ముగించారు. దీని ప్రధానస్థూపం 23 అడుగులఎత్తుతో కేంద్రస్థానంగా నిర్మించబడింది. దీనిచుట్టూ గంటఆకారంలో 72స్థూపాలు నిర్మించారు. ప్రతిస్థూపంలోను ధ్యానబుద్ధనివిగ్రహాలు లోభాగంలో ప్రతిష్ఠించారు. 6అంతస్థులున్న దీనిని హిందువులు శ్రీచక్రమనికూడా పిలుస్తారు.

ఈ యోగ్యకర్తనగరానికి మరోవైపు ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద హిందూదేవాలయం ప్రంబనాన్. ప్రంబనాన్ అంటే పరబ్రహ్మస్వరూపం గల ప్రపంచత్రిమూర్తి దేవాలయం. ఇక్కడ బ్రహ్మ, శివ, విష్ణువులకోసం మూడుప్రధానగుళ్ల వాటి కెదురుగా వారివాహనాలకు మరో మూడుఉపాలయాలు, వీటికి చుట్టూ 224 పరివారదేవాలయాలుకూడా నిర్మించారు. మధ్యనున్న శివదేవాలయం 154అడుగులఎత్తు ఉన్నది. ఇందులో శివునితోపాటు మరో మూడుదిక్కుల్లో అగస్త్యమహర్షి, వినాయకుడు, దుర్గామాతవిగ్రహాలున్నాయి.

వీటిని శివానుగ్రహంకోసం ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజలోకపాల మరియు రాజా బలితుంగ మహాసాంబులు నిర్మించారు.

ప్రపంచప్రఖ్యాత పర్యాటకకేంద్రం బాలిద్వీపం. ఇక్కడి దేవాలయాలు సుమారు 1000సంవత్సరాల చరిత్ర కలిగిఉన్నాయి. 45లక్షల జనాభాఉన్న ఈ ద్వీపంలో 87శాతం ప్రజలు హిందూసంప్రదాయాలను పాటిస్తున్నారు. ఇక్కడి ప్రజలు దేవాలయప్రాంగణ సమీపానికి వెళ్ళినవెంటనే మౌనవ్రతం పాటిస్తారు.



పురాణాల్లో చెప్పబడ్డ కశ్యపుని భార్యలైన వినత, కద్రువల పందెం, తనతల్లి దాస్యవిముక్తికై గరుత్మంతుడు అమృతాన్ని తెచ్చి కద్రువకు అందించినస్థలంగా ఈ బాలి చెప్పబడుతూంది. తన తల్లికి విముక్తి లభించిన తరువాత గరుడుడు శ్రీమహావిష్ణువును ప్రార్థించి అతనికి వాహనంగా ఉండేలా కోరాడు. ఇందుకు మహావిష్ణువుకూడా సమ్మతించాడు. ఈ వృత్తాంతం ఒక డిజిటల్‌రూపంలో ప్రతిదినం ఇక్కడ ప్రదర్శించబడుతోంది. కశ్యపుడు మరియు వినత, కద్రువల భారీప్రతిమలుకూడా ఇక్కడున్నాయి. ఈప్రాంతాన్ని గరుడ విష్ణు కాంచన థీమ్స్‌పార్కుగా ఆధునీకరించారు. ఈ కొండపైకి వెళ్ళడం ఒక అద్భుతమైన ప్రయాణం. ఈ ఉద్యానవనం 60హెక్టార్లలో అతిసుందరంగా తీర్చిదిద్దారు. ఇచ్చట అతిపెద్ద గరుడ వాహనంగా విష్ణుమూర్తి విగ్రహం 400అడుగులఎత్తుతో నిర్మించ బడినది.

సర్పరాజు వాసుకి నివాసంగా చెప్పబడుతున్న అగూంగ్ పర్వతప్రాంతం 86గుళ్ల సమూహం ఉంది. ప్రతి ఒక్కరూ సంప్రదాయదుస్తులు ధరించి పూజలో పాల్గొంటారు. ఇక్కడ బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పూజాద్రవ్యములనొసంగి ఆరాధించాలి. అక్కడి పూజారులు పూజలో పాల్గొన్న ప్రతిఒక్కరిని ప్రసన్నతతో ఆశీర్వ దిస్తారు. ఇక్కడ లక్ష్మీదేవిఅంశతో జన్మిం చిన అత్యంత ప్రాచీనమైన ధనూదేవి దేవా లయం, అఘుంపుష్పి సుందరమైన పర్వత ప్రాంతం అక్కడి ఉద్యానవనం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. బాలిలో ప్రతివీధి కూడలిలోను రామాయణ, మహాభారతం లోని పురాణపురుషులవిగ్రహాలు దర్శనమిస్తాయి. శ్రీరాముడు వారధి నిర్మించటం, పంచపాండవులు, ఘటోత్కచుడు, విభీష ణుడు, కుంభకర్ణుడు, కృష్ణార్జునులు మొదలైనవి ఉన్నాయి.



అంతేగాక శ్రీరామజల, లక్ష్మణజల, వాల్మీకిజల అనే పేర్లతో వీథులు వెలశాయి. జల అనగా రోడ్డు లేదా వీధి అని అర్థం. అర్జునరోడ్డు, భీమారోడ్డు, నకులరోడ్డు మొదలైనవి ఉన్నాయి. బాలిలో ప్రతిఇంటిలోను వీథినుండి ముఖద్వారం వచ్చినతర్వాత కొంతస్థలం భగవంతునికోసం కేటాయించుతారు. ప్రతిరోజు పూజలు చేస్తారు. అది ఇల్లయినా, వాణిజ్యస్థలమైనా ప్రతిఒక్కరూ లోనికి వచ్చినపుడు ఆ పూజాద్రవ్యాలను దర్శించి లోపలికి రావాల్సిందే.

తూర్పుబాలిలో సప్తనదీసంగమం ఉంది. ఇక్కడ అనేక మంది ఋషులు తపమాచరించినట్లు చెప్పబడుతూంది. ఇక్కడ ఒకసారి ప్రపంచఋషుల సమ్మేళనం జరుప నిశ్చయించారట. ఆ సమయంలో వాతావరణం సహకరించలేదట. అప్పుడు ప్రధానఋషులందరూ దక్షిణభారతదేశం వచ్చి మైసూరుజిల్లా లోని తలకాడునందున్న అగస్త్యమహాఋషిని కలిశారట.

అప్పుడు అతను వారితోపాటు బాలి వెళ్ళి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ప్రార్థించాడట. వారు ప్రత్యక్షంకాగా వారిని అక్కడే ఉండి ఆ ఋషులకు సహాయపడాల్సిందిగా అగస్త్యమహర్షి కోరాడట.

అప్పుడు వారు ముగ్గురు మూడు శివలింగాలుగా మారి గుహలో వెల శారు. వారికి ఎదురుగా వినాయక స్వామి కొలువై ఉన్నాడు. వారిని పూజించినతర్వాత ఆ ఋషుల సంకల్పం నెరవేరినట్లు అక్కడివారు చెప్తుంటారు. ఇది ప్రస్తుతం తపోవన గుహ అని పిలువబడుతూంది.

అక్కడివారందరూ భగవంతుని ఆరాధించటంవల్లే వారిజీవితాలు ప్రశాంతంగా ఉన్నాయని భావిస్తుం టారు.

ఆయుర్వేదం

# బీట్రూట్

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

దుంపజాతికి చెందిన బీట్రూట్‌గడ్డలు పోషక, ఔషధ విలువలు కలిగి శరీరపోషణకు, ఆరోగ్యపరిరక్షణకు, సౌందర్య పోషణకు ఉపయోగపడతాయి. మనం నిత్యజీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్యసమస్యలకు ఈ బీట్రూట్‌ను ఎలా సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవచ్చో తెలుసుకుందాం.

**రక్తహీనతకు:** రోజూ ఒకసారి 100మి.లీ. బీట్రూట్‌రసంలో పావుటీస్పూనునుంచి అరటీస్పూన్‌వరకు ఉసిరికపొడి, అరటీ స్పూన్ బెల్లంకలిపి సేవిస్తుంటే మంచిఫలితం వస్తుంది.

**జ్ఞాపకశక్తి పెరిగేందుకు:** వారానికోసారి 200మి.లీ.నీటిలో ఒకటీస్పూన్ బీట్రూట్‌పేస్టు, 10నలగ్గొట్టిన మిరియాలు, అరటీ స్పూన్ జీలకర్ర, పావుటీస్పూన్ ఉప్పు కలిపి 100మి.లీ. నీరు మిగిలేలా సన్ననిమంటపై మరిగించి దంచి చల్లార్చి వడగట్టి సేవిస్తుంటే జ్ఞాపకశక్తి, ధారణాశక్తి పెరుగుతాయి. అల్జీమర్స్, డిమెన్షియాలాంటి అనారోగ్యపరిస్థితుల్లో కలిగే మతిమరుపు సమస్య అదుపులోకి వస్తుంది.

**చర్మం పొడిబారేసమస్యకు:** కొన్నాళ్ళపాటు రోజూ పరగడుపున 50మి.లీ. బీట్రూట్‌రసంలో 50మి.లీ. కొబ్బరిపాలు, అరటీ స్పూన్ తాటికలకండ కలిపి సేవిస్తూ, బీట్రూట్‌పేస్టు, కొబ్బరి పాలు కలిపి పైపూతగా పట్టించి అరగంటాగి కడిగేస్తుంటే త్వరగా ఫలితం కనిపిస్తుంది.



**కడుపులో పుళ్ళు, వ్రణాలకు:** రోజూ ఉదయం ఆహారానికి అర గంటముందు 100మి.లీ. బీట్రూట్‌రసంలో 15మి.లీ. తేనె కలిపి సేవిస్తుంటే అవి మానిపోతాయి.

**బాలనెరుపుకు:** వారానికి ఒకట్రెండుసార్లు 100గ్రా. బీట్రూట్ గడ్డలపేస్టులో నల్లజీలకర్రని వేయించి చేసిన పొడి, గోరింటాకు పొడి, ఉసిరికపొడి ఒక్కొక్కటి 15గ్రాములు కలిపి తలకి, జుట్టుకి పట్టించి రెండుగంటలాగి తలస్నానం చేస్తుంటే చిన్నవయస్సు లోనే వెంట్రుకలు తెల్లబడటం అనే సమస్య అదుపులో ఉంటుంది.

**ముఖంపై నల్లమచ్చలకు:** రోజూ ఒకసారి రెండుటీస్పూన్ల బీట్రూట్‌రసం, రెండుటీస్పూన్ల శనగపిండి, ఒకటీస్పూన్ పెరుగు, ఒకటీస్పూన్ నిమ్మరసం, ఒకటీస్పూన్ తేనె కలిపి నల్లమచ్చలపై పట్టించి గంటసేపాగి ముఖం కడుక్కుంటుంటే చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

**చుండ్రునివారణకు:** వారానికోసారి 100గ్రాముల బీట్రూట్ ముక్కలు, 50గ్రాముల అల్లంముక్కలు కలిపి మిక్సీలోవేసి రసంతీసి తలకి మర్దించి గంటసేపాగి తలస్నానం చేస్తుంటే మంచిఫలితం కలుగుతుంది.

**కొలెస్ట్రాల్‌సమస్యకు:** రోజూ ఒకసారి 100 మి.లీ. బీట్రూట్ రసంలో అరటీస్పూన్ జీలకర్రపొడి, పావుటీస్పూన్ మిరియాల పొడి, ఒకగ్రాముపసుపు కలిపి మరిగించి దించి చల్లార్చి గోరువెచ్చగా ఉన్నప్పుడు సేవిస్తుంటే మనశరీరానికి ఉపయోగ పడే మంచి కొలెస్ట్రాల్ పెరిగి హానిచేసే చెడుకొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఈ ఔషధాన్ని ఇలా వాడుకుంటే రక్తపోటుకూడా అదుపులో ఉంటుంది.

**రక్తశుద్ధికి:** పావుకిలో బీట్రూట్‌రసం, ముప్పావుకిలో క్యారట్ గడ్డలరసం, కిలో పటికబెల్లంపొడి కలిపి లేతపాకం వచ్చేంత వరకు సన్నటిమంటపై మరిగించి దించి గోరువెచ్చగా ఉన్నప్పుడు ఒకగ్రాము పచ్చకర్పూరంపొడి కలిపి చల్లార్చిన పిదప ఒకగాజు సీసాలో నిల్వఉంచుకుని రోజూ ఉదయం, సాయంత్రం పూటకి 10మి.లీ. ఔషధాన్ని 50మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే రక్త శుద్ధి జరిగి వివిధరకాల చర్మరోగాలు తగ్గి చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** వృత్తిఉద్యోగాలరీత్యా మీకంటే పైస్థాయి వారివల్ల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశ ముంది. ఇతరులతో సుహృద్భావవాతావరణంలో మాటకలుపుకునే ప్రయత్నంచేస్తే సమస్యలను నివారించు కోవచ్చు..

**వృషభం–** గృహంలో మంగళకరమైన వాతా వరణం కన్పిస్తుంది. మానసికపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటారు. భూమి లేదా ఆస్తి కొనుగోలు విషయంలో కొన్నిరకాల ప్రతిష్ఠంభనలు కొనసాగుతాయి.

**మిథునం–** కుటుంబంలోనూ, స్నేహితులతోనూ సమస్యలు కలుగవచ్చు. మాసఉత్తరార్థంలో అను కూలమైన పరిస్థితులుంటాయి. ఆర్థికపరిపుష్టి, ధైర్యం కల్గుతాయి.

**కర్కాటకం–** ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. ఆరోగ్యవిషయాలకుకూడా ఇది మంచికాలం. ప్రయాణాలు ఫలవంతమౌతాయి. కుటుంబవిష యాలు అనుకూలమౌతాయి.

**సింహం–** దూరప్రయాణాలు అనుకూలం గాదు. ఉదరసంబంధఅనారోగ్యం, రక్తపోటు సమస్యలను అధిగమించడానికి ఆహారం, వ్యాయామంవంటి విషయాల్లో శ్రద్ధ అవసరం.

**కన్య–** సకలదోషాలు తొలగి సమస్తఐశ్వర్యాలు కలసివస్తాయి. ఆకస్మిక ధనలాభం మిమ్మల్ని వరిస్తుంది. ఆర్థికవిషయాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. కుటుంబవృద్ధి కలుగుతుంది.

**తుల–** మంచి సమతుల్యతతో వ్యవహరించడం వల్ల జీవనస్థాయి, హోదా పెరుగుతుంది. మీ జీవితం మంచిమలుపు తీసుకోవడం ప్రారంభమౌ తుంది. మీలోని సృజనాత్మకశక్తి పెరుగుతుంది. మంచి ఆరోగ్యాన్ని కల్గి ఉంటారు.

**వృశ్చికం–** ఇది ఆహ్లాదకరమైన కాలం అవుతుంది. వృత్తివ్యాపారాల్లో సంతృప్తికరమైన ఆదాయాన్ని మరియు వృద్ధిని కూడా పొందుతారు. కుటుంబ వాతావరణం బాగుంటుంది. నూతనవ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు–** మీ సామాజికస్థితి బాగుంటుంది. మీరు విలాసవంతమైన జీవనశైలిని పొందుతారు. పిల్లల వ్యవహారాలుకూడా సజావుగా సాగుతాయి. మీరు ఆకస్మికంగా తెలివైననిర్ణయాలు తీసుకుని విజయం సాధి స్తారు. మంచిఆదాయాన్నికూడా పొందుతారు.

**మకరం–** గుండె మరియు ఊపిరితిత్తులవ్యాధుల వల్ల సతమతమౌతారు. గ్రహాలప్రభావం ప్రతి కూలం. సూర్యనారాయణమూర్తిని ఆరాధించటం వల్ల మంచి జరుగుతుంది. ఉద్యోగులకు స్థానమార్పులుం టాయి. విద్యార్థులకు విదేశీవిద్య, నూతనఅవకాశాలు కల్గుతాయి.

**కుంభం–** ఆరోగ్యవిషయాలపై శ్రద్ధ వహించాలి. దైవబలం పెరుగుతుంది. శుభకార్యాల్లో పాల్గొం టారు. కార్యసిద్ధి, ధనలాభం కల్గుతాయి.

**మీనం–** వృత్తిలో సమస్యలను ఎదుర్కొంటారు. కొంత మానసికఒత్తిడి ఉంటుంది. ఐనా ఇది ఆరోగ్యవిషయాల్లో ఉపశమనం పొందడానికి సహాయపడుతుంది. ప్రత్యర్థుల వ్యాఖ్యాలను సమర్థవంతంగా తిప్పికొడతారు. సామాజిక పరిచయాలు పెరుగుతాయి.

యవ్వనంలో వృద్ధాప్యపు-అనుభవం, వృద్ధాప్యంలో యవ్వనపుశక్తిని కల్గిఉంటే జీవితం బాగుంటుంది

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# తప్పులెన్నరాదు

తప్పులెన్నువారు తండోపతండంబు;
లుర్విజనులకెల్ల నుండు తప్పు;
తప్పులెన్నువారు తమతప్పులెరుగరు;
విశ్వదాభిరామ! వినురవేమ!

**అర్థాలు:** తండోపతండంబులు= అసంఖ్యాకములు; ఉర్వి= భూమి(లోకం); తప్పులెన్నువారు= ఇతరుల తప్పులను లెక్కించువారు; ఎరుగరు= తెలుసుకోరు.

**భావం:** తప్పులు వెతికేవారు అసంఖ్యాకంగా అంటే లెక్కకు మిక్కిలి ఉంటారు. ఈ భూమిమీద జనులందరికీ తప్పులుంటాయి. ఇతరులతప్పులు ఎంచేవారు తమతప్పుల్ని తాము తెలుసుకోరు.

**వివరణ:** సాధారణంగా అందరూ ఇతరుల్లో తప్పులు ఎక్కడుంటాయా అని వెదికి చూస్తుంటారు. కాని ఈ లోకంలో తప్పులు అందరిలోనూ ఉంటాయి. ఇతరులతప్పుల్ని వెతకడంలో ఉన్న కుతూహలం తనలోనితప్పుల్ని గ్రహించడంలో ఉండదు ఎవరికీ. తమలో తప్పులున్నా అవి తప్పులు కావనే భావిస్తారు. మంచిగా సమన్వ యిస్తారు. గుణాన్ని గుణంగానూ, దోషాన్ని దోషంగానూ నిజాయితీగా స్వపరభేదం లేకుండా గ్రహించాలి. దానినే నిర్భయంగా చెప్పగలిగేలా ఉండాలి.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

# కార్యదక్షుడైనవాడు..!



ఉ. సన్నుత కార్యదక్షు డొకచాయ నిజప్రభ యప్రకాశమై
యున్నపుడైన లోకులకు నొండొక మేలొనరించు సత్వసం
పన్నుడు భీము డా ద్విజుల ప్రాణము కావడె ఏకచక్రమం
దెన్నికగా బకాసురుని నేపున రూపడగించి భాస్కరా!

భీముడు బ్రాహ్మణవేషంలో అజ్ఞాతంగా గడపాల్సివచ్చినాకూడా ఏకచక్రపురంలో ఉన్న బ్రాహ్మణకుటుంబాన్ని బకాసురునిబారినుండి రక్షించాడు. కనుక కార్యదక్షుడైనవాడు ఏ కారణం చేతనైనా తన గొప్పతనాన్ని మరుగుపరచు కోవలసివచ్చినా ఇతరులకు తనకు చేతనైనంత మేలు ఏదైనా సరే చేస్తాడని భావం.

– శ్రీ మారవి వెంకయ్య



అహంకారం, మమకారం అంతరించినచోటే శాంతి విరాజిల్లుతుంది

పాఠం-23

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- కీ.శే. మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | |
|---|---|
| बालकस्य | = పిల్లవానిది-యొక్క-కి |
| बालकानाम् | = పిల్లలది-యొక్క-కు |
| दन्तः | = పన్ను |
| कुतः | = ఎందువల్ల |
| ततः | = అందువల్ల |
| अतः | = ఇందువల్ల |

| | | | |
|---|---|---|---|
| प्रार्थनाद्यर्थकम् | | = | ప్రార్థనాదిపూర్వకం |
| प्र. | खादतु | = | खादन्तु |
| म. | खाद | = | खादत |
| उ. | खादामि | = | खादाम |

## అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) बालकस्य दन्ताः नासन्।
02) एते बालकाः अन्नं खादन्तु।
03) त्वमपि झटिति स्नानं कृत्वाऽन्नं खाद।
04) अद्य ममान्नं मास्तु।
05) तर्हि किं खादिष्यसि।
06) फलानि खादिष्यामि।
07) युष्मद्गृहे फलानि सन्ति वा?
08) अनेकफलानि सन्ति।
09) बालकस्य जनकः भोजनम् अकरोद्वा न वा?
10) सः इदानीम् अस्मद्गृहस्य आरात् देवस्य नमस्कारान् करोति।

### అ) జవాబులు

01) పిల్లవానికి దంతములు లేవు.
02) ఈ పిల్లలు అన్నం తిననీ.
03) నీవుకూడా వెంటనే స్నానంచేసి అన్నం తిను.
04) ఈ రోజు నాకు అన్నం వద్దు.
05) అయితే ఏమి తింటావు?
06) పండ్లను తింటాను.
07) మీ ఇంటిలో పండ్లు ఉన్నవా?
08) చాలా పండ్లు ఉన్నాయి.
09) పిల్లవానితండ్రి భోజనం చేశాడా? లేదా?
10) అతడు ఇప్పుడు మా ఇంటినుండి వచ్చి దేవుడికి నమస్కరించుచున్నాడు.

## ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నాకు పళ్లు లేవు.
02) అందువల్లనే పండ్లను తినను.
03) ఆ ఇండ్లెవరివి?
04) ఆ ఇండ్లు మావే.
05) మా ఇండ్లు దగ్గరగానే ఉన్నవి.
06) ఆ మంచమందెవరున్నారు?
07) ఆ పిల్లవానియొక్క అన్న.
08) ఈ పండును వాడు తిననిమ్ము.
09) ఆ పండును మీరు తినుడు.
10) లేకపోతే ఆ పండ్లను మేము తిందుముగాక.

### ఆ) జవాబులు

01) मम दन्ताः न सन्ति?
02) तदर्थं फलानि न खादामि।
03) तानि गृहाणि केषाम्।
04) तानि गृहाणि अस्माकमेव।
05) अस्माकं गृहाणि सविधे एव सन्ति।
06) तस्मिन् मञ्चे के सन्ति?
07) तस्य बालकस्य अग्रजः।
08) इदं फलं सः खादतु।
09) तत् फलं यूयं खादन्तु।
10) नोचेत् तानि फलानि वयं खादामः।

చిత్ర కథ

# బకాసురవధ

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

లక్కఇల్లు కాలిపోయింది. పాండవులు క్షేమంగా బయటపడ్డారు. వాళ్లు రహస్యంగా ఏకచక్రపురానికి చేరుకున్నారు. ఒకనాడు వాళ్లకి ఆశ్రయమిచ్చిన బ్రాహ్మణకుటుంబంలో ఏడుపులు వినిపిస్తున్నాయి. అప్పుడు కుంతి వాళ్లని అడిగింది....




కుంతి ఆ కుటుంబాన్ని ఒప్పించింది. మిగిలిన ఏర్పాట్లన్నీ ఆ కుటుంబమే చేసింది.
బకాసురుడిగుహకి ఆహారంతోపాటు భీమసేనుడు వెళ్లాడు.
ఆకలిగా ఉంది. త్వరగా రారా!
అయ్యో! బకాసురా! నీ ఆహారమంతా నేనే తినేశానే!
ఓహో! అలాగా! నువ్వున్నావు కదరా మానవా! కరకరా నమిలేస్తానురా నిన్ను
నీ గొంతుకి అడ్డం పడతానురా దానవా! రారా నాతో యుద్ధానికి...
భీముడికీ బకుడికి మధ్య భయంకరంగా యుద్ధం జరిగింది.
కాచుకో దానవా!
కాచుకో మానవా!
హుఁ...
హాఁ...
జనమంతా భీమసేనుడికి జేజేలు పలికారు. జై జై.. భీమసేనా! నీకు
చివరికి భీమునిదెబ్బలకి రక్తం కక్కుకుంటూ మరణించాడు బకాసురుడు. బండిమీద తిరిగి అగ్రహారానికి వచ్చాడు భీముడు.
జయం.. జయం...
శుభం.. శుభం...

# బాలవినోదం

## కదంబం

### సప్తద్వీపప్రశస్తక్షేత్రాలు

1) పుష్కరద్వీపం - బ్రహ్మదేవాలయం
2) శాకద్వీపం - శేషశాయివిష్ణ్వాలయం
3) క్రౌంచద్వీపం - శివాలయం
4) కుశద్వీపం - మందరగిరిఆలయం
5) శాల్మలద్వీపం - ద్రోణపర్వతసంజీవాలయం
6) ప్లక్షద్వీపం - విపాశానదీతీర విరూపాక్షాలయం
7) జంబూద్వీపం - విష్ణ్వాలయం

## పొట్టివాణ్ణి! గట్టివాణ్ణి!!

చుట్టాలసురభి - బొటనవ్రేలు
కొండేలకొరవి - చూపుడువ్రేలు
పుట్టుసన్యాసి - మధ్యవ్రేలు
ఉంగరాలభోగి - ఉంగరపువ్రేలు
పెళ్లికిపెద్ద - చిటికెనవ్రేలు
తిందాం తిందాం ఒకవేలు !



ఎట్లా తిందాం ఒకవేలు?
అప్పుచేసి తిందాం ఒకవేలు!
అప్పెట్టా తీరుతుంది ఒకవేలు?
ఉన్నాగదా నేను అన్నింటికీ
పొట్టివాణ్ణి గట్టివాణ్ణి బొటనవేలు !

## ఏ దారిలో వెళితే...



ఇక్కడ ఉన్న సంఖ్యలు కూడితే సంఖ్య15 వచ్చేదారిలో ఈ పాప అమ్మవారికి సారె తీసుకుని వెళ్లాలి. అందుకు సహాయం చేద్దామా..

## అంకెలు కలపండి!!

పిల్లలూ! అంకెలు కలుపుతూ పోతే ఏమి వస్తుందో చూడండి!



## రంగుల కళ



బాలచిత్రకారులూ!
రంగులు ఉన్న బొమ్మను చూసి,
ఆ రంగులనే.. రంగులు లేని
బొమ్మకు వేయండి!!



## పిల్లలూ! దారి కనుక్కోండి!!







సుబ్రహ్మణ్యస్వామిని
దర్శించేందుకు
భక్తులకు దారి చూపుదామా!!

## పిల్లలూ.. ఈ బొమ్మల్లో తేడాలు గుర్తించండి!





బాలనీతి

# ఆ దేవుడే.. నాకన్నీ ఇస్తున్నాడు!!

– శ్రీ బలిజేపల్లి సుబ్బారావు, 98667 83954

శ్రీచక్రధరపురం అనే రాజ్యానికి శ్రీధరుడు రాజు. అతని ధర్మబద్ధమైన పరిపాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారు. శ్రీధరునికి పదిసంవత్సరాల వయస్సున్న కుమారుడున్నాడు. ఆ కుమారునికి అకస్మాత్తుగా అస్వస్థత కలిగింది. ఆ బాలుడు మూసినకన్ను తెరవడం లేదు. ఆస్థానవైద్యులేకాక ఆ రాజ్యంలో ఉన్న వైద్యులెవ్వరూ వ్యాధిని నయం చేయలేకపోయారు.

ఒకనాడు ఒక సన్యాసి విచ్చేసి రాజుతో "రాజా! ఎవరైతే స్వధర్మాన్ని పాటిస్తూ ఏ మాత్రమూ అధర్మానికి పాల్పడకుండా, ఏ జీవికీ హాని కలుగకుండా జీవనాన్ని సాగిస్తుంటారో వారి అంగుష్ఠంనుండి జారిన మూడు నీటిబిందువులు మాత్రమే నీ కుమారుణ్ణి పునరుజ్జీవింప జేస్తాయి" అని చెప్పాడు.



ఒకనాడు రాజదర్శనార్థమై చిరిగినవస్త్రాలతో ఉన్న ఒకవ్యక్తి వచ్చాడు. అతణ్ణి రాజుసమక్షానికి తీసుకువెళ్లారు రాజభటులు.

ఆ వ్యక్తి రాజా! నా పేరు సాంబయ్య. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే అభాగ్యుణ్ణి. నేను వెళ్లేమార్గంలో ఒక వృద్ధురాలి శవం పడిఉంది. ఆ శవాన్ని దహనం చేద్దామని స్మశానానికి తీసుకెళ్లాను. పైకం చెల్లించనిదే శవదహనం చేయడానికి కాటికాపరి అనుమతించ లేదు. అందుచేత ఆ శవాన్ని సెలయేటికి దూరంగా ఒకగట్టుపై ఖననం చేయడానికి నేలను త్రవ్వుతుండగా బంగారునాణేలతో ఉన్న రెండు లోహపుపెట్టెలు కనిపించాయి. వెంటనే వాటిని భద్రపరచి ఆ సమాచారాన్ని తెలియచేయడానికి మీవద్దకు వచ్చాను అని చెప్పాడు.

ఇదంతా విన్న రాజు తనకు కలిగిన కష్టాన్ని ఆ వ్యక్తికి వివరించి మృత్యువుకు సమీపంలో ఉన్న తన కుమారుణ్ణి బ్రతికించుమని ప్రాధేయపడ్డాడు.

వెంటనే సాంబయ్య నీటిపాత్రను తీసుకుని తన బొటనవ్రేలు నుండి మూడునీటిబొట్లు ఆ రాజకుమారుని నోటిలో పోశాడు.

అంతే! వెంటనే ఆ బాలుడు కళ్లుతెరిచాడు. శ్రీధరుని ఆనందానికి అవధులు లేవు. ధర్మజీవనానికి ఉన్న శక్తిని స్వయంగా చూసిన రాజు సాంబయ్యకు నమస్కరించి, అయ్యా! ధర్మాత్ముడవైన నీవు నా కుమారునికి పునర్జన్మ ప్రసాదించావు. కావున నీకు దొరికిన నిధులను నీవే తీసుకో. అంతేకాదు, నీవు ఏదికోరినా నేను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను అన్నాడు. అందుకు సాంబయ్య....

రాజా! వాటిని నేను స్వీకరించడం ధర్మబద్ధం కాదు. అవి రాజుకే చెందాలి. అంతేకాక దైవం చేసినపనికి నేను ప్రతిఫలం తీసుకోవడమూ న్యాయం కాదు. నా శ్రమకు తగిన ఫలాన్ని ఆ దేవుడే ఇస్తున్నాడు. నన్ను మన్నించండి. ఆ నిధులను స్వాధీనం చేసుకుని నాకు సెలవు ఇప్పించండి అని వినయంగా చెప్పాడు. ధర్మంకోసం ధనాన్ని, కోరికల్ని త్యాగంచేసిన సాంబయ్యకన్నా భాగ్యశాలి ఈ లోకంలో ఎవ్వరూ ఉండరు కదా అన్నాడు రాజు.

**నీతి**

**స్వధర్మాన్ని పాటిస్తూ ఫలితాన్ని దైవానికి వదిలినవారిని దైవం ఎప్పుడూ వదలదుగాక వదలదు.**

# ప్రశ్నావళి 13

01) 'పళని' అంటే..? జ).........................

02) శ్రీనివాసునికి నాగాభరణాలు బహూకరించినవాడు? జ).........................

03) హైందవసంస్కృతికి దర్పణం? జ).........................

04) పౌర్ణమికి అధిదేవత? జ).........................

05) మహాభారతం ఏ పర్వంలో నాగులగురించి చెప్పబడింది? జ).........................

06) వేదవ్యాసుడు మహాభారతరచన చేసిన క్షేత్రం? జ).........................

07) సకలజీవకోటిబ్రహ్మ ఎవరు? జ).........................

08) ఉలూచి తండ్రిపేరు? జ).........................

09) 'రక్షాబంధన్'కు మరోపేరు? జ).........................

10) అన్నిమంత్రాలకు మూలమంత్రం? జ).........................

11) షోడశోపచారాలు అంటే...? జ).........................

12) శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం? జ).........................

13) చిత్రాంగద కుమారుని పేరు? జ).........................

14) యోగమంటే అర్థం? జ).........................

15) సర్పాలకు తల్లి? జ).........................

16) భరతఖండాన్ని పరిపాలించినవారిలో ప్రథముడు? జ).........................

17) భీముడు ఎవరిబారినుండి బ్రాహ్మణకుటుంబాన్ని రక్షించాడు? జ).........................

18) 'ఖండఖాద్యక' గ్రంథరచయిత? జ).........................

19) శ్రీచక్రధరపురంరాజ్యానికి రాజు? జ).........................

20) 'శిష్యాధివృద్ధిదా' గ్రంథరచయిత? జ).........................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'ప్రశ్నావళి'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. ప్రశ్నావళి సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-08-2023.

06) ఈ ప్రశ్నావళిలో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ ప్రశ్నావళిపోటీలో పాల్గొనకూడదు.

08) ప్రశ్నావళికి సంబంధించి ఏ సమాచారమూ చరవాణిద్వారా ఇవ్వబడదు.

09) ఈ ప్రశ్నావళిలో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. ప్రశ్నావళి సమాధానపత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ..............

పాఠశాల: ........................ తరగతి: ..............

పేరు: ........................................

చిరునామా: ........................................

........................................

........................................

........................ పిన్‌కోడ్: ..............

చరవాణి సంఖ్య: ........................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................... తేది : ....................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 91

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | 3 | | | | ■ |
| 4 | ■ | | ■ | | ■ | ■ | ■ | 5 |
| | ■ | | ■ | 6 | | 7 | | |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| ■ | 8 | | | ■ | 9 | | | ■ |
| 10 | ■ | | ■ | 11 | ■ | | ■ | 12 |
| 13 | | ■ | 14 | | | ■ | 15 | |
| | ■ | 16 | ■ | | ■ | 17 | ■ | |
| 18 | | | | ■ | 19 | | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)ఎవరివల్ల 'దితి' దైత్యుల్ని, 'అదితి' దేవతల్నికన్నారు(7); 6)కౌరవాగ్రజుడు(5); 8)వసంతము(3); 9)రాజు కాని రాజు, పైగా వస్తువుల్ని తూచేది(3); 13)ముఖము వికృతి(2); 14)శివుడు(3); 15)పావురం ఆహారమడిగితే తన తొడను కోసి ఇచ్చిన చక్రవర్తి(2); 18)రాజుల శిరస్సుపై ఉండేది(4); 19)ఈమెను ఎత్తుకెళ్ళి శ్రీకృష్ణుడు రాక్షసవివాహం చేసుకున్నాడు(3)

### నిలువు

2)శ్రీకృష్ణుడు సత్యభామతోపాటు ఈ మణినికూడా స్వీకరించాడు(6); 3)హిరణ్యకశిపునికొడుకు(4); 4)దేవాలయాల్లో శివుని రూపం(3); 5) మనిషిపాదము(3); 7)పాండవాగ్రజుడు(4); 10)విష్ణుమూర్తి గదపేరు(4); 11)పాండవులభార్య(3); 12)ధృతరాష్ట్రునితల్లి(3); 16)ఆడపిల్లకు పనితోపాటు ఇదికూడా ఉండాలంటారు మనపెద్దలు(2); 17)రుక్మిణి సోదరుడు(2)

**జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.**

**- ప్రధాన సంపాదకుడు**



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

## తిరుమల తిరుపతి దేవస్థానములు



# తిరుమల
# శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు
(2023 సెప్టెంబరు 18 నుండి 26 వరకు)

| | | |
|---|---|---|
| 18-09-2023<br>సోమవారం<br>పగలు: ధ్వజారోహణం<br>రాత్రి: పెద్దశేషవాహనం | 19-09-2023<br>మంగళవారం<br>పగలు: చిన్నశేషవాహనం<br>రాత్రి: హంసవాహనం | 20-09-2023<br>బుధవారం<br>పగలు: సింహవాహనం<br>రాత్రి:<br>ముత్యపుపందిరివాహనం |
| 21-09-2023<br>గురువారం<br>పగలు: కల్పవృక్షవాహనం<br>రాత్రి: సర్వభూపాలవాహనం | 22-09-2023<br>శుక్రవారం<br>పగలు: పల్లకీలో<br>మోహినీఅవతారోత్సవం<br>రాత్రి: గరుడవాహనం | 23-09-2023<br>శనివారం<br>పగలు:<br>హనుమద్వాహనం<br>రాత్రి: గజవాహనం |
| 24-09-2023<br>ఆదివారం<br>పగలు: సూర్యప్రభవాహనం<br>రాత్రి: చంద్రప్రభవాహనం | 25-09-2023<br>సోమవారం<br>పగలు: రథోత్సవం<br>రాత్రి: అశ్వవాహనం | 26-09-2023<br>మంగళవారం<br>పగలు: చక్రస్నానం<br>రాత్రి: ధ్వజావరోహణం |

## తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల
# శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
(2023 అక్టోబరు 15 నుండి 23 వరకు)



| | | |
|---|---|---|
| 15-10-2023<br>ఆదివారం<br>పగలు: బంగారు తిరుచ్చి ఉత్సవం<br>రాత్రి: పెద్దశేషవాహనం | 16-10-2023<br>సోమవారం<br>పగలు: చిన్నశేషవాహనం<br>రాత్రి: హంసవాహనం | 17-10-2023<br>మంగళవారం<br>పగలు: సింహవాహనం<br>రాత్రి:<br>ముత్యపుపందిరివాహనం |
| 18-10-2023<br>బుధవారం<br>పగలు: కల్పవృక్షవాహనం<br>రాత్రి: సర్వభూపాలవాహనం | 19-10-2023<br>గురువారం<br>పగలు: పల్లకీలో<br>మోహినీఅవతారోత్సవం<br>రాత్రి: గరుడవాహనం | 20-10-2023<br>శుక్రవారం<br>పగలు:<br>హనుమద్వాహనం<br>రాత్రి: గజవాహనం |
| 21-10-2023<br>శనివారం<br>పగలు: సూర్యప్రభవాహనం<br>రాత్రి: చంద్రప్రభవాహనం | 22-10-2023<br>ఆదివారం<br>పగలు: స్వర్ణ రథోత్సవం<br>రాత్రి: అశ్వవాహనం | 23-10-2023<br>సోమవారం<br>పగలు: చక్రస్నానం<br>రాత్రి: తిరుచ్చి ఉత్సవం |

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY. Published by Tirumala Tirupati Devasthanams printing on 25-07-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

